

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | గురువారం 16-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 297 | పేజీలు: 8 | వెల: రూ.1/-


# నగరంలో డబుల్ బెడ్ ఇళ్లకు ఢోకా లేదు

## పేదల సంకల్పం నెరవేరుస్తాం: తలసాని

హైదరాబాద్,జూలై 15ఆర్ఎన్ఎ): రెండుపడకల ఇళ్ల నిర్మాణాలపై కొందరు పనిగట్టుకునిచేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. సిఎం కెసిఆర్ ఈ విషయంలో ధృఢవైఖరితో ఉన్నారని అన్నారు. రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని పేర్కొన్నారు. నిరుపేదలకు గూడు కల్పించేందుకు తలపెట్టిన రెండు పడకల ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. ఇప్పటికే పాలనా పరమైన అనుమతులు జారీ చేసిన ఇళ్లలో బిడ్లు దాఖలై,నిర్మాణాలు సాగుతున్నాయని అన్నారు. పేదలకు ఆవాసం కల్పించదుకు ప్రభుత్వం నిర్మించనున్న రెండు పడకల ఇళ్ల పనులను యుద్ధ ప్రతిపాదికన ప్రారంభించామని ప్రకటించారు. ప్రజల కష్టాల నుంచి భవన నిర్మాణరంగ కూలీల ఉపాధిపై ప్రభావం వరకు గల ఇబ్బందులను వివరించారు. రెండు పడకల ఇళ్లపై ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టిసారించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష ఇళ్లు నిర్మించాలన్న లక్ష్యంలో సగమైనా పూర్తి చేయాలని భావిస్తున్నారు. నిర్మాణ సంస్థలు ముందుకు రాకపోవడంతో పనుల్లో కొంత జాప్యం జరిగింది. దీనిని అధిగమించేందుకు ప్రత్యామ్నా యాలనూ పరిశీలిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసిన రూ.5కే భోజన కేంద్రాలను పేదలు ఆశ్రయిస్తున్నారు. దీంతో మరిన్ని కేంద్రాలను అందుబాటులోకి తీసుకుని వస్తామని మంత్రి అన్నారు. ఈ కేంద్రాల సంఖ్యను 150కి పెంచితే రోజూ 45వేల మంది ఆకలి తీరనుంది. ఒక్కొక్కరి భోజనానికి రూ. 27.50 ఖర్చవుతుండగా.. జీహెచ్ఎంసీ రూ.22.50 భరిస్తోంది. వినియోగదారుడి నుంచి ఐదు రూపాయలు వసూలు చేస్తోంది. ఈ కేంద్రాల్లో ఎక్కువగా కార్మికులు భోజనం చేస్తుంటారు. ఈ కష్టకాలంలో ఇది వీరికి ఆసరగా ఉందని తలసాని అన్నారు.

# కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

## సిబ్బంది సమ్మెతో గాంధీలో కరోనా వైద్యానికి కష్టం

హైదరాబాద్,జూలై 15ఆర్ఎన్ఎ): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెకు దిగిన సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి పొరుగు సేవల సిబ్బంది ఆందోళ



గాంధీ ఆస్పత్రి ముందు బుధవారం కూడా ఆందోళన కొనసాగించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నలను కొనసాగిస్తున్నారు. వర్షంపడుతున్నా లెక్క చేయకుండ వారు తమ ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను సానుభూతితో పరిశీలించాలని వారు సిఎం కెసిఆర్‌ను కోరారు. వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్దీకరణ సహా వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాంధీ ఆసుపత్రి పొరుగుసేవల సిబ్బంది గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి కరోనా బాధితులను కాపాడుతున్నా సరైన వేతనాలు ఇవ్వట్లేదని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ నర్సులు, పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బంది విధులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించడంతో గాంధీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిచిపోయి రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ, ఇతర వార్డుల్లో రోగులకు సేవల్లో అంతరాయ మేర్పడింది. సెక్యూరిటీ, శానిటైజేషన్, ఫోర్త్ క్లాస్ పేషెంట్ కేర్ సిబ్బంది విధులు బహిష్కరించారు. తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలంటూ ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే వారం రోజులుగా నిరవధిక సమ్మెలో 600 మంది నర్సులు పాల్గొన్నారు. దీంతో కరోనా పేషెంట్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విధులకు హాజరు కావాలని, సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రభుత్వం కోరినా ఉద్యోగులు ససేమిరా అంటున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు విధుల్లో చేరమని చెబుతున్నారు. గాంధీ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే.

# సచివాలయ కూల్చివేతపై నేటి వరకు స్టే

## కూల్చివేతల అభ్యంతరాలపై హైకోర్టులో విచారణ

## కేసు విచారణ నేటికి వాయిదా వేసిని కోర్టు

హైదరాబాద్,జూలై 15(ఆర్ఎన్ఎ): సచివాలయ కూల్చివేతకు సంబంధించి ఇప్పటికిప్పుడు ఎలాంటి కొత్త నిర్మానాలు చేపట్టడం లేదని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. నిర్మాణాలు చేపట్టే ముందు పర్యావరణ అనుమతులతో పాటు అన్ని అనుమతులు తీసుకుంటామని పేర్కొంది. సచివాలయ భవనాల కూల్చివేతపై బుధవారం కూడా విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా అనేక ప్రశ్నలను ధార్మాసనం ప్రభుత్వానికి వేసింది. చివరకు విచారణను హైకోర్టు గురువారం నాటికి వాయిదా వేసింది. భవనాల కూల్చివేతపై స్టే రేపటి వరకు కొనసాగు తుందని తెలిపింది. అడిషనల్ రిపోర్ట్ సమర్పించాలని పిటిషనర్‌కు ఉన్నత న్యాయస్థానం సూచించింది. పర్యావరణ అనుమతులకు సంబంధించి పలు తీర్పులను సమర్పిస్తామని ఏజీ కోర్టుకు తెలిపారు. భవనాల కూల్చివేతకు పర్యావరణ అనుమతులు అవసరం లేదని చెబుతున్నా యని ఏజీ తెలిపారు. ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్ చిక్కుడు ప్రభాకర్ రిప్లై కౌంటర్ దాఖలు చేశారు. పర్యావరణ పరిరక్షణ సవరణ చట్టం 2018కి విరుద్ధంగా కూల్చివేత పనులు చేపడుతున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ఒక ప్రాజెక్టు పనులు ప్రారంభించడానికి లీగల్ రిజర్వ్‌మెంట్స్ తీసుకోవాలని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. లీగల్ రిజతర్వ్‌మెంట్స్‌పై వివరణ ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణ సవరణ చట్టం ఏం చెబుతుందో తెలపాలని సూచించింది. భవనాల కూల్చివేతకు సెంట్రల్ మినిస్టీ అనుమతి తీసుకోలేదని కోర్టుకు పిటిషనర్ తెలిపారు. ఒక ప్రాజెక్టు నిర్మించడానికి మాత్రమే సెంట్రల్ మినస్ట్రీ అనుమతి అవసరమని ఏజీ కోర్టుకు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం భవనాల కూల్చివేయాలంటే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా రెగ్యులేటరీ అనుమతి తీసుకోవాలని, సంబంధిత శాఖ అనుమతి అసలు తీసుకున్నారా అని హైకోర్టు ప్రశ్నించింది. భవనాల కూల్చివేతకు అనుమతి అవసరం లేదని, కేవలం భవనాల నిర్మాణాలకు మాత్రవే అనుమతి అవసరమని కోర్టుకు ఏజీ తెలిపారు. ఇప్పుడు తాము ఎలాంటి నిర్మాణం చేపట్టడం లేదన్నారు. నూతన నిర్మాణాలు చేపట్టేటప్పుడు అన్ని అనుమతులు తీసుకుంటాని అన్నారు. జీహెచ్ఎంసీ, లోకల్ అథారిటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనుమతులు ఉన్నాయన్నారు. సొలిసిటర్ జనరల్ గురువారం విచారణకు హాజరు కావాలని హైకోర్టు అదేశించింది. తదుపరి విచారణను గురువారానికి హైకోర్టు వాయిదా వేసింది.

## చరిత్రలో నేటినిజం



కం॥ స్వార్థమును... పనిలో చనదగు
మార్గమును జూపించగలుగు మహిలోత్తముడై....
ఆర్థికుడై నమలను గాను
"ఆర్కే ధావను"ను సతతమభినందింతునే!!

(జులై 16 ఆర్కే ధావన్ జన్మదినం..)



-రాధశ్రీ

సెల్: 9494481210

# అమెరికాలో కరోనా వ్యాక్సిన్ ట్రయల్స్ సక్సెస్

## 45 మంది హెల్త్ వాలంటీర్లపై వ్యాక్సిన్ ప్రయోగం

వాషింగ్టన్,జూలై 15(ఆర్ఎన్ఎ): అమెరికాకు చెందిన మోడెర్నా కంపెనీ .. ప్రయోగాత్మకంగా చేపట్టిన కోవిడ్19 వ్యాక్సిన్ తొలి దశ పరీక్షలో సక్సెస్ సాధించింది. వ్యాక్సిన్ తీసుకున్నవారు సురక్షితంగా ఉన్నట్లు తేలింది. 45 మంది హెల్త్ వాలంటీర్లు ఈ వ్యాక్సిన్ తీసుకున్నారు. వారిలో రోగనిరోధక శక్తిని పెంచే యాంటీబాడీలు అధిక స్థాయిలో తయారైనట్లు అమెరికా పరిశోధకులు వెల్లడించారు. ఈ విషయాన్ని న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించారు. హెల్త్ వాలంటీర్లకు రెండు డోస్‌ల వ్యాక్సిన్ ఇచ్చినట్లు పరిశోధకులు చెప్పారు. అయితే కోవిడ్19 నుంచి కోలుకున్నవారి కంటే.. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో యాంటీబాడీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. మోడెర్నా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఎవరికి కూడా సైడ్ ఎఫెక్ట్స్ నమోదు కాలేదు. కానీ టీకా కుచ్చిన ప్రాంతంలో కొంత నొప్పి వచ్చినట్లు వాలంటీర్లు తెలిపారు. కొందరికి స్వల్ప స్థాయిలో తలనొప్పి, వణుకుడు వచ్చినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. అమెరికా కంపెనీలు వ్యాక్సిన్ తయారీలో నిమగ్నం అయ్యాయి. మార్చి 16వ తేదీన మోడెర్నా కంపెనీ మానవులపై వ్యాక్సిన్ పరీక్షలు మొదలుపెట్టింది. కరోనా జన్యువు క్రమాన్ని రిలీజ్ చేసిన 66 రోజుల్లోనే ఆ కంపెనీ వ్యాక్సిన్ ట్రయల్స్ చేపట్టడం విశేషం.

వ్యాక్సిన్ తయారీలో మోడెర్నా బయోటెక్ కంపెనీ శాస్త్రవేత్తలతో పాటు అమెరికా ప్రభుత్వానికి చెందిన అంటువ్యాధుల సంస్థ శాస్త్రవేత్తలు కూడా పాల్గొన్నారు. అయితే జూలై 27వ తేదీన మూడవ దశ వ్యాక్సిన్ పరీక్షలను భారీ స్థాయిలో చేపట్టనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. మూడవ దశలో సుమారు 30 వేల మందిని పరీక్షించనున్నారు. అయితే ఆ పరీక్ష ఫలితాలు అక్టోబర్ వరకు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయానికి మోడెర్నా వ్యాక్సిన్ సురక్షితమైందా కాదా అని ఇప్పుడే తేల్చలేమన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్,జూలై 15ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా విజృంభిస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కరోనాకు ఉచితంగా చికిత్స అందించాలని నిర్ణయం తీసుకుంది. అందులోభాగంగా మొదట మూడు ప్రైవేట్ మెడికల్ కాలేజీలను ఎంపిక చేసింది. మల్లారెడ్డి, మమత, కామినేని మెడికల్ కాలేజీల్లో కరోనా టెస్టులు, చికిత్స ఉచితంగా అందించేలా ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. కరోనా రోగులకు చికిత్సను పెంచడానికి గాను తెలంగాణలోని మూడు ప్రైవేట్ వైద్య కళాశాలలు ఉచితంగా వైద్యం అందించడానికి ముందుకొచ్చాయి.జీహెచ్ఎంసీ పరిధిలోని ఏ మండలంలోనైనా బెడ్‌ల కొరత లేదని నిర్ధారించేందుకు గాను ఈ ప్రయత్నం మొదలు పెట్టడం జరిగిందని తెలంగాణ

## మూడు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఉచిత కరోనా చికిత్స

## త్వరలో అందుబాటులోకి మరో ఏడు ప్రైవేట్ బోధనాసుపత్రులు

గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ బుధవారం అన్నారు. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులతో పాటు, లక్షణాలు ఉన్నా ఇక్కడ పరీక్షలు జరుపడంతో పాటు ఉచితంగా చికిత్సనందించనున్నారు. మమత, మల్లారెడ్డి, కామినేని ఇనిస్టిట్యూట్ ఈ మూడు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఉచిత వైద్యం అందించనున్నారు. అదే విధంగా మరో ఏడు ప్రైవేట్ బోధనా దవాఖానలను కూడా త్వరలో ఈ జాబితాలో చేర్చనున్నట్లు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ తెలిపారు. జిల్లా ఆసుపత్రులు, టిమ్స్, ప్రైవేట్ వైద్య కళాశాలలు కరోనా చికిత్సను అందించనున్నాయి. ప్రస్తుతం 98 దవాఖానలు, విశ్లేషణ కేంద్రాలు వీలైనంత త్వరగా కేసులను గుర్తించడానికి, పరీక్షలు చేయడానికి సదుపాలయాలను కలిగి ఉన్నాయి. దవాఖానల వద్ద డాష్ బోర్డులను ఏర్పాటు చేశారని గవర్నర్ తమిళిసై ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. స్వయం చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, కరోనా చికిత్సకు సంబంధించిన వారి ప్రశ్నలను పరిష్కరించడానికి హోం క్వారంటైన్‌లో ఉన్న వారి కోసం కాల్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు.ఇదిలావుంటే హైదరాబాద్‌లో కరోనా పరీక్షలు విస్తృతం చేశామని, కరోనా లక్షణాలు కనిపిస్తే ఎవరైనా యాంటిజన్ పరీక్షలు చేయించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట్ తెలిపారు. హైదరాబాద్ లో కరోనా కట్టడికి చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యాంటిజన్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నగరంలో 65 కేంద్రాల్లో ర్యాపిడ్ యాంటిజన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. హోం ఐసోలేషన్ సదుపాయం లేనివారు ప్రభుత్వ ఐసోలేషన్‌లో ఉండవచ్చని, నేచుర్‌క్యూర్, ఆయుర్వేద ఆసుపత్రుల్లో పడకలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సెల్ఫ్ డిక్లరేషన్ మీదనే హోం ఐసోలేషన్‌కు పంపిసామన్నారు. నగరంలో ఇప్పటి వరకు 11,705 మంది హోం ఐసోలేషన్‌లో ఉన్నారని తెలిపారు. హోం ఐసోలేషన్‌లో ఉండి 16,600 మంది కోలుకున్నారని డీఎంహెచ్‌వో వివరించారు. హోం ఐసోలేషన్‌లో ఉండే వారికి ఔషధాలతో కూడిన కిట్ ఇస్తున్నామని తెలిపారు.

# నైపుణ్యం ఉంటే ప్రపంచం మీ చేతుల్లో ఉన్నట్లే

హైదరాబాద్,జూలై 15ఆర్ఎన్ఎ): వేగంగా మారుతున్న ప్రపంచంలో, అనేక రంగాలలో మిలియన్ల మంది నైపుణ్యం గల వ్యక్తుల అవసరం ఉందని ప్రధాని మోడీ తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్య సేవల్లో నైపుణ్యం గల వారి అవసరం అధికంగా ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం 'స్కిల్ ఇండియా మిషన్'ను ప్రారంభించిందని తెలిపారు. ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతను ఉద్దేశించి వీడియో ద్వారా ప్రసంగించారు. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా వందలాది ప్రధాన మంత్రి

## కరోనా నేపథ్యంలో మారుతున్న ప్రాధాన్యాలు

## ఉద్యోగ ప్రాధాన్యాలు మారుతున్నాయి

## నైపుణ్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ప్రసంగం

నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు ప్రారంభించబడ్డాయన్నారు. ఐటీఐల సంఖ్యను పెంచామని, లక్షలాది కొత్త సీట్లను చేర్చామన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 5 కోట్లకు పైగా యువతలో నైపుణ్య అభివృద్ధి జరిగిందని తెలిపారు. నాలుగైదు రోజుల క్రితం దేశంలోని కార్మికుల కోసం 'స్కిల్ మ్యాపింగ్ పోర్టల్'ని ప్రారంభించామని మోదీ తెలిపారు. నైపుణ్యం కలిగిన వ్యక్తులను, కార్మికులను మ్యాపింగ్ చేయడంలో ఈ పోర్టల్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించే సంస్థలు, ఈ పోర్టల్ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను ఒకే క్లిక్‌తో చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. కరోనా వల్ల ఏర్పడిన ఈ సంక్షోభం ప్రపంచంలో అన్నిదేశాలలో సమానంగా ఉంటుందన్నారు. ఈ ప్రభావంతో ఉద్యోగ స్వభావం కూడా మారిందన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికత కూడా ఉద్యోగులను ప్రభావితం చేస్తుందని తెలిపారు. చిన్న, పెద్ద ప్రతి రకమైన నైపుణ్యం కూడా స్వావలంబన భారతదేశానికి చాలా పెద్ద శక్తిగా మారుతుందని మోదీ స్పష్టం చేశారు. నైపుణ్యం అనేది స్వయం సమృద్ధిని సాధిస్తుందన్నారు. నైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు పెంచుకుంటూ పోవాలన్నారు. ప్రపంచం వేగంగా మారుతున్న సమయంలో.. వ్యాపారాలు, మార్కెట్లు అనునిత్యం ప్రభావానికి లోనవుతుంటాయని, కరోనా మహమ్మారి నేపథ్యంలో నైపుణ్యం అనేది చాలా కీలకమైందని, ఇలాంటి సమయంలోనే యువత తమ నైపుణ్యానికి పదును పెట్టాలన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ యువతకు శుభాకాంక్షలు తెలిపారు. కరోనా మహమ్మారి వల్ల ఉద్యోగ ప్రవృత్తి మారిపోయిందని, టెక్నాలజీ కూడా మారుతూపోతున్నదని, కానీ మారుతున్న పరిస్థితులకు తగినట్లుగా యువత నైపుణ్యాన్ని సంపాదిస్తున్నారని మోదీ తెలిపారు. నైపుణ్యం అనేది మనకు మనం ఇచ్చుకునే బహుమతి అని, అది అనుభవంతో వృద్ధి చెందుతుందని, కాలానికి దీనితో సంబంధంలేదని, సమయం గడుస్తున్నాకొద్ది నైపుణ్యం పెరుగుతుందని మోదీ అన్నారు. నైపుణ్యం విశిష్టమైందన్నారు. ఇది ఇతరుల నుంచి మిమ్మల్ని వేరు చేస్తుందన్నారు. జ్ఞానం, నైపుణ్యం మధ్య కొందరు ఎప్పుడూ అయోమయపడుతుంటారని ప్రధాని అన్నారు. పుస్తకాల్లో చదివి, ఇంటర్నెట్‌లో చూసి ఎలా సైకిల్ తొక్కాలో తెలుసుకోవచ్చు, దీన్నే మనం నాలెడ్జ్ అంటామని, కానీ ఆ జ్ఞానం ఉన్నంత మాత్రన సైకిల్ తొక్కే గ్యారెంటీ ఉండదన్నారు. వాస్తవానికి సైకిల్ తొక్కాలంటే.. మీకు స్కిల్ ఉండాలని ప్రధాని ఓ ఉదాహరణ ఇచ్చారు. ఏదైనా కొత్త నైపుణ్యం నేర్చుకోవాలన్న తపన లేకుంటే.. అప్పుడు జీవితం ఆగిపోతుందన్నారు. దాంతో అతని జీవితం భారంగా మారుతుందని మోదీ పేర్కొన్నారు.

# కరోనాపై మరోమారు హైకోర్టు కీలక ప్రకటన

## టెస్టులు, చికిత్సల వివరాలు ప్రకటించాలని ప్రభుత్వానికి ఆదేశం

## చీఫ్ జస్టిస్ సూచనలను బేఖాతర్ చేయడంపై ఆగ్రహం

హైదరాబాద్,జూలై15(ఆర్ఎన్ఎ): కరోనా చికిత్సలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు కీలక సూచనలు చేసింది. సాధారణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఎక్కడెక్క కరోనా టెస్టులు, చికిత్సలు చేస్తున్నారో ప్రకటించాలని ఆదేశించింది. చీఫ్ జస్టిస్ సూచనలను కూడా పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

కరోనా వచ్చిన వారికి ప్రభుత్వం ఎలాంటి చికిత్స అందిస్తోందో తెలపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు బుధవారం ఆదేశించింది. కరోనా చికిత్సకు సంబంధించి హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. రాష్ట్రంలో ఎక్కడెక్కడ కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నారో ప్రజలకు అర్థం కావడం లేదని హైకోర్టు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కింగ్ కోఠి, గాంధీ, చెస్ట్ ఆస్పత్రుల్లో అత్యవసర పేషెంట్లకు చికిత్స అందిస్తున్నామని ప్రభుత్వం ఈ సందర్భంగా కోర్టుకు తెలిపింది. లక్షణాలు తక్కువగా ఉన్నవారికి పేషెంట్లకు సరోజిని దేవి, ఆయుర్వేదిక్, నేచర్ క్యూర్ ఆస్పత్రులలో చికిత్స అందిస్తున్నామని చెప్పింది. ప్రసార మాధ్యమాల్లో ఎక్కడెక్కడ కరోనా పరీక్షలు చేస్తున్నారో తెలపాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. సాధారణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ లేకుండా వ్యవహరిస్తోందని హైకోర్టు పేర్కొంది. చీఫ్ జస్టిస్ చెప్పిన సూచనలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించాలని మరోసారి ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

# హైదరాబాద్ నలుచెరుగులా అభివృద్ధి

## తూర్పు హైదరాబాద్ దిశగా ఐటి అభివృద్ధి

## ఐటిపరిశ్రమల ప్రతినిధులతో మంత్రి కెటిఆర్ సమీక్ష

హైదరాబాద్,జూలై 15(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధి కోసం ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ జరగాలన్నదే సిఎం కెసిఆర్ ఆకాంక్ష అని అన్నారు. బుధవారం హైదరాబాద్ ఐటీ కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఐటీ, ఐటీ అనుబంధ కంపెనీలను నగరం నలుమూలలకు విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముఖ్యంగా తూర్పు హైదరాబాద్ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న ఐటీ కంపెనీలతో పాటు... భవిష్యతలో రానున్న ఐటీ కంపెనీల ఏర్పాటు వాటికి సంబంధించిన మార్గదర్శకాలపై ఈ సమావేశంలో చర్చించారు. త్వరలోనే ఐటీని నగరంలోని నలుమూలలకు విస్తరించే గ్రిడ్ పాలసీని తీసుకువస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఈ పాలసీ ద్వారా పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని ఆయన చెప్పారు. ఐటీ పరిశ్రమలు ఈస్ట్ హైదరాబాద్‌కి తరలించే ప్రయత్నంలో భాగంగా అవసరమైన ప్రోత్సాహకాలతో పాటు మౌలిక వసతులను కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం అవసరమైన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులకు కేటీఆర్ ఆదేశాలు జారీ చేశారు. తూర్పు హైదరాబాద్‌లో ఉప్పల్ వరు నారపల్లి నుంచి ప్లై ఓవర్ నిర్మాణం జరుగతోందన్నారు. అలాగే అంబర్‌పేట నుంచి రామంతాపూర్ వరకు కూడా ప్లై ఓవర్ రానుందన్నారు. ఇకపోతే తూర్పులోనే యాదాద్రినిర్మాణం అద్భుతంగా సాగుతోం దన్నారు. ఇవన్నీ రావడంతో ప్రజలు పట్టణాల్లో వివిధ పనుల కోసం వచ్చి నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. అందువల్ల తూర్పు హైదరాబాద్ అభివృద్ధిలో కీలకం కానుందన్నారు. ఐటీ వృద్ధిలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు ఎక్కువగా ఉన్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ పురోగతి బాగుందని చెప్పారు.నగరంలో నలువైపులా సమాన అభివృద్ధి జరగాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని చెప్పారు. నగరం తూర్పువైపున ఉన్న ఉప్పల్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. నగరం లోపల ఉన్న పరిశ్రమలను నగరం వెలుపలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎంఎంటీఎస్ ను రాయగిరి వరకు పొడిగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రాచకొండకు కూడా సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటుకు సీపీ మహేశ్ భగవత్ చొరవ చూపారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేశ్ భగవత్ కూడా పాల్గొన్నారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతి భవన్‌లో కలిసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్

# రాష్ట్రపతితో టిఎంసి ఎంపి భేటీ

## మమత లేఖ అందచేత

న్యూఢిల్లీ,జూలై 15(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ప్రతినిధుల బృందం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను బుధవారం రాష్ట్రపతి భవన్‌లో కలిసింది. బీజేపీ ఎమ్మెల్యే దేబేంద్రనాథ్ రే ఆత్మహత్య ఘటనపై సీఎం మమతా బెనర్జీ రాసిన లేఖను ఎంపీ డెరెక్ ఓబ్రియన్ రాష్ట్రపతికి అందజేశారు. బిందాల్‌లోని తన నివాసంలో దేబేంద్రనాథ్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. అధికార టీఎంసీ, బీజేపీ మధ్య రాష్ట్రంలో ఘర్షణ వైఖరి నెలకొన్న నేపథ్యంలో జరిగిన ఈ ఘటన బెంగాల్‌లో కలకలం రేపింది. మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న పశ్చిమబెంగాల్ సీఐడీ బుధవారం నీలోయ్ సింగ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేబేంద్రనాథ్ రాసిన ఆత్మహత్యా లేఖలో నీలోయ్ సింగ్ పేరు ఉంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. బీజేపీ ఎమ్మెల్యే దేబేంద్రనాథ్ రే ఆత్మహత్య చేసుకోడానికి దారితీసిన కారణాలపై అతడ్ని ప్రశ్నిస్తున్నారు.

# కోయంబత్తూరు కలెక్టర్‌కు కరోనా పాజిటివ్

చెన్నై,జూలై 15(ఆర్ఎన్ఎ): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కే రాజమణికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టర్ జ్వరంతో బాధపడుతుండగా మంగళవారం ఆయనకు కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. కలెక్టర్‌కు కరోనా సోకినట్లు బుధవారం జిల్లా వైద్యాధికారులు తెలిపారు. కోవై మెడికల్ సెంటర్ అండ్ హాస్పిటల్‌లో కలెక్టర్ కరోనా చికిత్స తీసుకుంటున్నారు. కరోనా నియంత్రణ నేపథ్యంలో కలెక్టర్ కంటైన్మెంట్ జోన్లలో పర్యటించారని జిల్లా వైద్యాధికారి రామదురై మురుగన్ తెలిపారు. కలెక్టర్‌లో కరోనా లక్షణాలేవీ కనిపించలేదని చెప్పారు. తమిళనాడులో కరోనా కేసుల సంఖ్య 1,47,324కు పెరిగింది. ప్రస్తుతం 47,915 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 2,099 మంది చనిపోయారు.

# ఉడుత సాయం ...

(కథ)

చాలా సంవత్సరాలుగా అద్దె ఇళ్ళలో ఉండి ఉండి విసిగి పోయాము, మావారికి మాత్రం క్వార్టర్స్ అంటే చాలా భయం ఇంటికి ఇంటికి దూరం ఎక్కువ, ఖాళీ జాగాలు పెద్ద పెద్ద చెట్లు నాకైతే క్వార్టర్స్ అంటే చాలా ఇష్టం . ఇప్పుడు ఇక మరి మా ఆయనకి క్వార్టర్స్ కి రాక తప్పలేదు, ఎందుకంటే ఖర్చులు పెరగడం, పిల్లల చదువులు పెద్దవి అవ్వడం,ఇంటి అద్దె విపరీతంగా పెరగడం, తప్పనిపరిస్థితుల్లో క్వార్టర్స్ కి రావడానికి ఒప్పుకున్నారు .

కాలనీలో అంతా ఆడపిల్లలు బయటికి ఒక్కళ్ళే రావాలంటే భయమే చదువు సంధ్య లేని మగపిల్లలు అంతా గుంపుగా చేరి పాన్, గుట్కా,తంబాకు, నములుతూ చెట్ల కింద టైం పాస్ చేస్తూ వుండేవారు.

కాలనీలో వుండే తెలుగు వాళ్లంతా ఎలా జాగ్రత్తగా వుంటారో మనమూ అలాగే వుందామని నేను బతిమాలితే ఆఖరుకి ఒప్పుకొని క్వార్టర్స్ కి అప్లై చెయ్యటం , క్వార్టర్ దొరకటం జరిగింది.

క్వార్టర్స్ కి వచ్చేసాము, బాగా పాతవే రిపేర్ చేసేరు బాగానే వున్నాయి ఇల్లంతా సెట్ చేసుకున్నాము వీధి వాకిలి చాలా పెద్దది రెండు పెద్ద రేగి చెట్లు,ఒక నేరేడు చెట్టు వాకిలి అంతా అస్తవ్యస్తం గా గడ్డి మొలిచి వుంది, ఫెన్సింగ్ పూర్తిగా పాడయిపోయింది, మేకలు గుమ్మం లో నే గడ్డి మేస్తునాయి ఫెన్సింగ్ వేయించుకోవాలి అనున్నాము.

ఒక వారం గడిచింది ఇల్లు సర్దుకోవడం అయింది , ఆ రోజు మా ఆయన నైట్ డ్యూటీ కి వెళ్ళేరు. తలుపులన్నీ వేసుకున్నాము పెరట్లో పెద్ద విశాలమైన వాకిలి ప్రహారీ గోడ , మామిడి చెట్టు లైట్ లేకుండా పెరట్లోకి వెళితే భయం వేస్తుంది, పిల్లలు నేను తలుపులన్నీ ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని మంచం ఎక్కేము, మెల్లగా నిద్రలోకి జారుకున్నాము.

హఠాత్తుగా తెలివి వచ్చింది, ఏదో శబ్దం జాగ్రత్తగా వింటున్నాను మెల్లిగా వంట గది లో చూసేను ఏమి లేదు, బాత్రూం లో చూసేను ఏమి లేదు, లైట్ లు అన్నీ వేసి మంచాల కిందన అంతా చూసేను ఎక్కడా ఏమి లేదు మెల్లిగా పెద్దమ్మాయి లేపేను విషయం మెల్లిగా చెప్పేను,దానికి కొంచం ఎక్సైట్మెంట్ ఎక్కువ

"గట్టిగా అరుద్దామా"అంది

"ఎండా కాలం అందరూ కూలర్ లు వేసుకొని పడుకుంటారు ఎవరికీ వినిపించదు" అన్నాను

మళ్లీ శబ్దం మొదలయింది, నేను మా అమ్మాయి జాగ్రత్త గా విన్నాము అది ఏదో కోస్తున్నట్టు గా సౌండ్

కిటికీ కొస్తునారా,లేక కిటికీ కి ఆనుకొని వున్న కూలర్ కోస్తునారో అర్థం కావటం లేదు మేము కనక్షన్ ఇవ్వకపోవడం వలన ఇంకా మా కూలర్ నడపటం లేదు, భయం గా వుంది ఇంతలో మా అమ్మాయి మాస్ లాంగ్వేజ్ లో గట్టిగా అరుస్తూ తిట్టటం మొదలు పెట్టింది, అలా గట్టిగా మాటలు వస్తున్నప్పుడు బయట సౌండ్ ఆగేది, మళ్లీ కాసేపాగి కోత సౌండ్ మొదలయ్యేది అలా సమయం రెండు అయినట్టుంది, వుంది చౌకీ దార్ విజిల్ వినిపించింది ,జాఫ్రీ లోనించి గట్టిగా చౌకీ దార్ ని పిల్చేను

"ఏంటమ్మా అన్నాడు"

"వెనక ఎవరయినా ఉన్నారేమో శబ్దం వస్తోంది చూడు అన్నాను"

చూసి వచ్చి

"లేదమ్మా ఎవరూ లేరు వెనక పెద్ద కాలవ చెట్ల పొదలు పురుగు పుట్రా వుంటాయి ఈ రాత్రి అటు వెళ్ళటం మంచిది కాదు "

"జాగ్రత్తగా తలుపు వేసుకోండి" నేను ఈ నాలుగు లైన్ లు తిరుగుతాను భయం లేదు

అని వెళ్ళిపోయాడు . కొంచం ధైర్యం వచ్చింది మళ్లీ సైలెంట్ అవగానే మళ్లీ కోస్తున్న శబ్దం స్టార్ట్ అయింది. మేము ఎప్పుడు తెల్లవారుతుందా అనిఎదురుచూస్తున్నాం.సమయం చాలా మెల్లిగా గడుస్తోంది అనిపించింది.

అంతలో ఏవో బయట

బయట మాటలు వినిపిస్తున్నాయి

'ఓ వాకింగ్ కి జనాలేమో' ఇక భయం లేదు

అను కొని జాఫ్రీ తలుపు నేను తీస్తుంటే, మా అమ్మాయి నా సేఫ్టీ కోసం పెద్ద కఱ్ఱ ,మరొక చేత్తో టార్చ్ పట్టుకొని నా వెనుక ఇద్దరమూ మెల్లిగా సందులో కి వెళ్లి కూలర్ దగ్గర చూసేము , అక్కడ ఒక అరడజన్ ఉంటాయేమో పంది పిల్లల్ని పెట్టుకొని, కూలర్ స్టాండ్ కి వేసి శరీరాన్ని గీరు కుంటోంది ఆపకుండా. ఆ పంది చేష్టలకీ, మా అమ్మాయి ఉడుత సాయానికి నవ్వు ఆగలేదు దీనికే నా రాత్రంతా భయపడ్డామని నవ్వు కున్నాము.



-విజయలక్ష్మి
9301421243



బాల గేయం

## కొబ్బరి కాయలు!

కొబ్బరి కాయలు మనుషులకూ
కొసరి కొసరి తిను కోతులకూ
పూజల్లో ప్రతి దైవముకూ
పుష్కలంగా ఉపయోగం!

గుళ్లలోనా ప్రసాదాలుగా
ఇళ్లలోనా వంటలందునా
ఇష్టమైనా కూర సరుకుగా
కొబ్బరి ముక్కలు వినియోగం!.

తాళ్ళు పేనుటకు కొబ్బరి పీచులు
మంచి మంటలకు కొబ్బరి చిప్పలు
అనేక రకాలుగా ఉపయోగం!
అందుకె దానికి సాష్టాంగం!



- డా॥ వద్దేపల్లి కృష్ణ
9246541699

## బాల వికాసం

## వానాకాలం

వేసవికాలం ముగిసింది
వానాకాలం వచ్చింది

జోరుగ వర్షం కురిసింది
చెరువులనన్ని నింపింది

రైతుల నాగలి కదిలింది
దుక్కులనన్ని దున్నింది

మడిలో విత్తనం పడింది
వెంటనె మొలకలు వేసింది

పంటను చేతికి తెచ్చింది
కరువును సాగనంపింది

-బస్వ రాజ్ కుమార్
9392006080

## అమ్మ మొగ్గలు

ఆడజన్మకు సార్థకం అమ్మ కావడమేనని
గర్భస్థశిశువును నవమాసాలు మోస్తుంది
పురిటిబాధలకోర్చి జన్మనిచ్చిన దేవత అమ్మ

రక్తమాంసాలను మురి(రి)పాలుగా మార్చేసి
శిశువు ఆకలి తీర్చేటి అన్నపూర్ణదేవి
ప్రేమానురాగాలు పంచే ప్రేమమూర్తి అమ్మ

పొత్తిళ్లన్ని తడిపిన నొచ్చుకొనకుండా
లాలించి గోరుముద్దలు తినిపిస్తుంది
జోలపాటతో నిద్ర పుచ్చుతుంది అమ్మ

తప్పటడుగులు వేసే బిడ్డకు నడక నేర్పుతూనే
తేనెలొలికె తీయమాటలను పలికిస్తుంది
మురిపాలసుధలను పంచుతుంది అమ్మ

పతినే ప్రత్యక్షదైవంగా తలుస్తూనే
పిల్లల ఎదుగుదలకై పరితపిస్తుంది
చివరివరకు ఇంటిని ఆదుకునేది అమ్మ

-నింగిరెడ్డి కాంతారెడ్డి

## నిత్యస్మరణీయులు

### 3. గురువు



-దోరవేటి
సెల్:9866251679

ఉ॥ పుట్టిన మట్టిగడ్డనయి పూనిక నీ యొడిలోన వ్రేయ చే
బట్టితి బల్పమెట్లా గురువర్య! భవత్కరుణామృతంబు న
పుట్టున నేను పొందిన ప్రభవము లెస్స! తదాదిగా గురుత్
గట్టిగ వెన్నుతట్టి మెరుగౌ స్థితి చేర్చుచు నుండి రిప్పుడున్.

కం॥ తొలి గురువు అమ్మ; యింటను
మలి గురువయె నాన్న; యితర మాన్య గురువు లీ
యిలను గల రెందరెందరొ
తలవంచి నమస్కరింతు తప్పక నెపుడున్.

ఉ॥ తప్పును జేసినప్పుడు సుదీరత జూపక శిక్షవేసి; నే
గొప్పగ మంచికార్యములు కోరికతో నొనరింప ప్రేమతో
చెప్పుచు నెల్లవారలకు చేతన నింపిన మీ దయామృతం
బెప్పుడు విస్మరింపక వివేకము నిచ్చిన మీకు మ్రొక్కెదన్.

తే॥ అజుడవై నా మనంబున సృజన నింపి
విష్ణువై నా గుణంబుల వృద్ధిపరచి
హరుడవై దురితమ్ముల నాహరించి
భవ్యమౌ త్రిమూర్తి స్వరూపా! నమస్తే!

## ఆటాడుకుందాం...రా !

రారండోయ్ ..పిల్లల్లారా!
చెమ్మా ,చెక్క ఆడేద్దాం
చికు ,చికు రైలు ఆడేద్దాం
చికు ,చికు పుల్ల ఆడేద్దాం.
రారండోయ్ ..బాలల్లారా!.
వామన గుంటలు ఆడేద్దాం
కళ్ళకు గంతలు ఆడేద్దాం
వైకుంఠ పాళీ ఆడేద్దాం
రారండోయ్ ..చిన్నారుల్లారా!
కోతి,కొమ్మచ్చి ఆడేద్దాం
దాగుడు మూతలు ఆడేద్దాం
కుంటుడు బిళ్ళ ఆడేద్దాం.
అందరు కలసి ఒకటై మెలిగేద్దాం
ఆకాశంలో చుక్కల్లా వెలిగేద్దాం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139






వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంబన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinizam2020@gmail.com
కవితలు పంపాల్సిన చివరి తేది : 15-8-2020


పుస్తక సమీక్ష

# అందరినీ అలరించే "బాలమువ్వలు"






పర్శరాములు బాలలగేయాలకు, బాలల కథలకు, బాలల పద్యాలకు, వ్యాసాలు , నవల, జీవిత చరిత్రలు వంటి అనేక ప్రక్రియలలో రచిస్తున్నారు. అంతే కాకుండా బాలసాహిత్య కార్యశాలలు, పురస్కారాలు, సదస్సులు, పుస్తకావిష్కరణలు, కవిసమ్మేళనాలతో తమ ఉనికిని చాటుకుంటున్నారు. బాల సాహిత్యం రచించాలంటే మనుషులుగా మనం ఎదగాలి అనేమాట నా నుండి ఎప్పుడూ వస్తూనే ఉంటుంది. ఎందుకంటే బాలల మనస్తత్వాన్ని, ఆ అమాయకత్వాన్ని, నిష్కల్మషమైన తత్త్వాన్ని మనం అనుసరించాలంటే మనలోని స్వార్థం, అసూయను వదిలేయాలి. వదిలేయాలంటే మానసికంగా మనం ఎదగాలి. ఎదగాలంటే ఒదగాలి. ఆ ఒదిగేతత్త్వం నుండే పెద్దవారంతా చిన్నపిల్లల మనస్తత్వంతో రచిస్తేనే అది బాలలకు సంబంధించినది అవుతుంది. కవి కోణం పర్శరాములు రచించిన బాలల గేయాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయి. ప్రతి పాఠశాలలో వల్లెవేయడానికి, అర్థాలు తెలుసుకుని తదనుగుణంగా తమ ఆలోచనలను రూపుదిద్దుకోవడానికి దోహద పడే ఈ ప్రక్రియ ఎంతో బావుంది.

కొన్ని గేయాలను ఉదహరించుకుందాం ..

"మొక్కలు ఎదుగుట ఎందుకనీ ఎందుకనీ / పచ్చని ప్రకృతిని అందించడానికని

పూవులు పూయుట దేనికనీ దేనికనీ / సువాసన పరిమళాలు వెదజల్లడానికని" అంటూ సాగుతుంది. ప్రతీదీ ఎందుకు? అని ప్రశ్నించడంతోపాటు, సమాధానాలు కూడా తెలియజేయడం ఎంతో ఆసక్తికరంగా ఉంది. మరోచోట కులవృత్తుల్ని తలపోస్తూ రచించిన గేయం..

" మేదరోళ్ళ మంది/ మేం వెదురుతోని చేట బుట్టలల్లుతాం!

వడ్లోల్ల మంది / మేం ఇల్ల దర్వాజాలు, కుర్చీలు, బల్లలు చేస్తాం!

గొల్లవాల్లమంది / మేం పాలు, పెరుగు అమ్ముకుంటాం" అంటూ ప్రతి కులం చేసే తమ అద్భుతమైన పనులను గురించి తెలిపారు. ఇందువల్ల ఏ కులం ఏ పని చేస్తుంది అనే విషయం పిల్లలకు ఎంతో సులువుగా అర్థమవుతుంది. మరోచోట చెరువును తలపోస్తూ రచించిన గేయం..

"చెరువుకు పోదాం రారండి/ చెంగు చెంగున దూకెదము/ ఈతలు బాగా కొట్టెదము/ చేపలు ఎన్నో పట్టెదము/ చెరువుల మట్టిని తెచ్చెదమూ/ బొమ్మలు ఎన్నో చేసెదము/ పిల్లలందరిని పిలిచెదమూ/ పచ్చని పందిరి వేసెదమూ" అంటూ సాగింది.

కోణం పర్శరాములు రచించిన ఈ గేయాలు చదువుతుంటే పిల్లలకు తెలియని విషయాలను తెలపాలనే తృష్ణ వీరిలో ఎంతో ఉంది కదా అనిపించక మానదు. నిత్యం మన ఇంట్లో పిల్లలు అడిగే అనేక ప్రశ్నలకు సమాధానాలు ఏం చెప్పాలో తెలియదు. కానీ ఎంతో సున్నితంగా ఆ పసిమనసులు ఆకళింపు చేసుకునే విధంగా ఒక గేయ రూపంలో తెలియజేసిన తీరు హర్షణీయం. ఇప్పుడు పాఠశాలలో ఇవి కొరతగా ఉంది. ఇలాంటివి ఎన్నో ప్రాథమిక పాఠశాలలకు అందివ్వాలని కోరుకుంటూ అభినందిస్తున్నాను.

ప్రతులకు: కోణం పర్శరాములు
13-3-38/21,వి.జెడి.కాలనీ
రేణుక నగర్‌ప్రక్కన,
సిద్దిపేట-502 107
ఫోన్: 99595 24585

-శైలజామిత్ర
9290900879




ప్రసిద్ధ కవి "పాటవెలదుల" సృష్టికర్త
డా॥ వద్దేపల్లి కృష్ణ
మరియు
నేటినిజం దిన పత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో
ప్రతినెలా ఉత్తమ "పాట వెలదుల"కు బహుమతులు

ప్రతినెలా ఉత్తమ పాట వెలదుల్ని రచించిన రచయితలకు
ప్రథమ బహుమతి రూ.1,116/-
ద్వితీయ బహుమతి రూ.750/-
తృతీయ బహుమతి రూ.500/-లతో పాటు
ప్రశంసాపత్రం అందజేయబడును.

'పాట వెలదుల' లక్షణం: ప్రతిపాదంలో 4 పాదాల్లోనూ 5 సూర్యగణాలు (హంస పంచకం) ఉండాలి.
అంటే "ఆటవెలది"లో 2వ, 4వ పాదంలో పాటించే హంస పంచకాన్ని అన్నిపాదాల్లో పాటించాలి.
5 సూర్యగణాల మాత్రల నిడివి 15 మాత్రలు. మాత్రాగణనం 'పాట' లక్షణం.
హంస పంచకం 'ఆటవెలది'లక్షణం.
ఈ వినూత్న పద్య ప్రయోగానికి "పాటవెలది" అని పేరుపెట్టనైనది.

'పాట వెలది' పద్య ఉదాహరణకు:
**"పల్లెలందు వీచు పైరగాలి**
**పట్నమందు లేచు పాడుగాలి**
**ప్రియముగాను మనిషి పీల్చుగాలి**
**కలుషితమ్ము ఆయె కర్మగాలి"**

ఇలా కనీసం **5 పద్యాల్ని** రచించి 'నేటినిజం' పత్రికకు ప్రతినెలా **20వ తేదీలోగా** పంపించాలి. ప్రతినెల నెలాఖరులో ఫలితాల్ని ప్రకటించి రచయితలకు బహుమతుల్ని **'నేటినిజం'** వేదికగా అందజేయడం జరుగుతుంది.

*సందేహాలకు డా॥ వద్దేపల్లి గారిని 9246541699లో సంప్రదించండి.*
రచనలు పంపవలసిన ఈమెయిల్:
E-mail : netinizam2020@gmail.com


విద్యార్థి దశ నుండే
పోరాటం మొదలు పెట్టిన
ధీశాలి
రాజకీయ మేధావి
పాములపర్తి వెంకట నరసింహారావు

నిజాంకు వ్యతిరేకంగా
వందేమాతరం పాడిన
తెలంగాణ ముద్దుబిడ్డ
దక్షిణ భారత దేశం
నుండి
తొలి ప్రధానిగా
కీర్తి పొందిన
బహుభాషా కోవిదుడు

వ్యక్తిగా ఎదిగి
భారతదేశ శక్తిగా మారి
భూసంస్కరణలు
చేపట్టిన
విరామమెరుగని
చైతన్య మూర్తి
స్ఫూర్తి ప్రదాత
అపర చాణిక్యుడు

సహస్ర ఫన్
ది ఇన్ సైడర్ వంటి
రచనలు అందించిన
బహుగ్రంధకర్త
సాహితీవేత్త
భారతదేశపు కీలక నేత

అందరికి మార్గదర్శకులు
మరెందరికో ఆదర్శప్రాయులు
సహృదయ నేత
కలంతో పాటు
తుపాకిని చేతబూని
ఉగ్రవాదులను
ఎదుర్కొన్న ఉగ్రనరసింహుడు
చీకటి పాలిట మెరుపులు
నిరంతర ప్రజా నాయకులు
దయ మూర్తులు
రాజకీయ దురంధరుడు
అయినా
పివి నరసింహారావు గారికి
ఇదే నా అక్షరాంజలితో
ఘన నివాళి



-డా.తెలుగు తిరుమలేష్
9908910398

తత్వవేత్త పి.వి
విద్యావేత్త ,సామాజికవేత్త ,రాజకీయవేత్త
ఆర్థిక వేత్త ,సాహితీవేత్త
కలగలిసిన
బహుముఖ ప్రజ్ఞాశాలి
మన ప్రియతమ మాజీ ప్రధానమంత్రి
పాములపర్తి వెంకట నరసింహారావు

విమర్శలను లెక్కచేయక
ముందుకు సాగే ధీరుడు
ముఖ్యమంత్రిగా భూసంస్కరణలు..
ప్రధానమంత్రిగా ఆర్థిక సంస్కరణలు..
అద్వితీయ పాలనాదక్షుడు

దేశ ఆర్థిక సంక్షోభాన్ని
చాకచక్యంగా పరిష్కరించి
దేశానికి దిశా నిర్దేశం చేసిన
రాజనీతిజ్ఞుడు..అపర చాణక్యుడు.
15 భాషల్లో నిష్ణాతుడు




విశ్వనాథ వారి "వేయిపడగలు"
"సహస్ర ఫన్"గా
హిందీలో అనువదించి..
తెలుగు భాషకు వన్నెతెచ్చిన..
బహు భాషా కోవిదుడు.

అడగందే అమ్మ అయినా పెట్టదు
అడగకుండానే
ప్రధానమంత్రి పదవి వరించిన..
అసామాన్యుడు
దార్శనికుడుకార్యదక్షుడు
మన తెలుగు కీర్తి
పాములపర్తి.

భారత ఆర్థిక వ్యవస్థ
సుస్థిరపరచిన మహా మేధావి
నిగర్వి మన పీ.వీ.
భరతమాత ముద్దుబిడ్డను
తెలుగు వారిందరి
ఆకాంక్ష-అభిలాష



-కేతవరపురాజ్యశ్రీ
సెల్: 91 8500-121990 (సి)

పుట్టినాడు ఒకచోట
పెరిగి నాడు ఒకచోట
కీర్తిలొ చాణక్యుడుగా
జై జై లు జనమునోట !!

తెలుగు వాడుగా బుట్టెను
రాజకీయమే జొచ్చెను
ఆర్థిక సంస్కరణల్దెచ్చి
పితామహుడుగా నిలిచెను !!

జన్మమొందె తెలుగు గడ్డ
జ్ఞానమందు చాల దొడ్డ
పీ వి నరసింహారావు
తెలంగాణ ముద్దు బిడ్డ !!

అంగు ఆర్భాటం లేదు
ఆవేశమే గాన రాదు
నిస్వార్థమైన పీ వి కి
స్వార్థమసలు లేనె లేదు !!

బహు శాఖల మంత్రి యై
పదవులందు మేటి యై
మన పీ వి అలరించెను
తొలి తెలుగు ప్రధానియై !!

సాహిత్య పరిజ్ఞానము
కంప్యూటర్ విజ్ఞానము
పదిహేడు భాషలలో
జ్ఞానముండె పరిపూర్ణము !!

రచనలెన్నొ చేసెను
తర్జుమాలు జేసెను
సాహితీ వేత్త గాను
పేరు నెంతొ పొందెను !!

రాజకీయ దురంధరుడు
రాజకీయ నిష్ణాతుడు
ప్రజ్ఞాశాలి పీ వి గారు
తెలుగు వారి వెలుగు రేడు !!

బహు భాషా కోవిదుడు
భవితకు మార్గ దర్శుడు
భరత మాత గర్వించే
భారతీయ సుపుత్రుడు !!

రాజసాన రారాజు
స్వచ్ఛమైన రేరాజు
'పీ వి తెలంగాణ ఠీవి'
మరువ లేని మహారాజు !!



-పోమాల హన్మంతు
9989934521.

## ఎన్నాళ్లీ... నరక కూపం ?

హార్మోన్ల ఇంజెక్షన్లతో
అతలాకుతలమైన..
ఆ లేత మొగ్గలు..
ఎనిమిదేళ్ల ప్రాయంలోనే
నరకకూపం లోకి
నెట్టివేయబడుతుంటే....,
చాటుమాటుగా
వేట సాగించి
అదను చూసి
అపహరణ చేసి
బలవంతంగా
వ్యభిచార రొంపిలోకి
లాక్కు పోతుంటే....,
దేశంలోని పలు చోట్ల
పడుపువృత్తి కేంద్రాలు
బహిరంగంగానే..
బలోపేతమై...
బాలికల గుండెల్లో
బాకులు దించుతుంటే...,
దేశవ్యాప్తంగా..
అభాగినిల రక్తమాంసాలనే
పెట్టుబడిగా చేసి
సాగిస్తున్న వ్యభిచార
కేంద్రాల్లో పన్నెండేళ్లయినా
నిండని..అమ్మాయిలను
అంగడిబొమ్మల్ని చేసి
ఆటలాడిస్తుంటే...,
చూస్తూ.. మిన్నకుంటున్న
అధికార యంత్రాంగాలు
భాధ్యతారహితంగా..
ఉండటం... ఇంకెన్నాళ్ళు..??
ఇలాంటి సంఘటనలపై
ప్రభుత్వ తీరును....
చూసి స్పందించిన.. "కోర్టు"
అధికారులు కుమ్మక్కయినట్లు
కనిపిస్తుందనే..వ్యాఖ్యలతో
తూర్పార బట్టిన తీరు
సమకాలీన బాగోతాలపట్ల
ఘాటు అభిశంసన కాదా...??
రక్షణ వ్యవస్థ ను
బలోపేతం చేసి..
జాతికే తలవంపులు
తెచ్చే ఇలాంటి..
ఆటవిక చర్యలకు...
పాల్పడుతున్న ముష్కర
మూకలను..నిఘా నీడలో
బంధించి...వెన్ను విరవాలి..!
మహిళల..అపహరణకు..
దారుణ అమానుషాలకు
అడ్డుకట్ట పడేవిధంగా
పటిష్టమైన..కార్యాచరణ
ప్రణాళికలను రూపొందించాలి..!
ఆ దిశగాప్రభుత్వాలు కదులుతూ
అభాగ్యుల బతుకుల్ని..
ఆదుకొని...ఆసరానివ్వాలి..!!

(దేశంలోని పలు రాష్ట్రాల్లో..
వ్యభిచార ముఠాలదాష్టీకానికి...
ఇటీవలవెలుగుచూస్తున్న కథనాలకు..
నా స్పందన)



-రవి చంచల
8500330700

## అక్షరాలే ఆయుధంగా పోరాటం

అణగారిన ,
ప్రజల సమస్యలపై అక్షరమే ఆయుధంగా స్పందిస్తూ
అభాగ్యుల ,ఆక్రందనలపై అక్షరాలు ఆయుధంగా
ఎక్కు పెడతాను.
పసికూనల భ్రూణ హత్యలపై
అక్షరమే ఆయుధంగా ఖండిస్తాను, రక్షిస్తాను
రైతన్నల బడుగు జీవుల బాగుకై అక్షరాల బలంతో
కలం హలంతో ..
బాసటగా నిలుస్తాను.
పిల్లల వృద్ధుల రక్షణకై
అక్షరాన్ని ఆయుధంగా చేసి
పెద్దలకు గుణపాఠం చెబుతాను
సమాజ పరి రక్షణ కై
అక్షరమే ఆయుధంగా
మలచి సంధిస్తాను.
వీర సైనికులు హతమార్చిన,
దుర్మదాంధ్రుల అణచివేతకు..
కలాన్ని ఆయుధంగా చేసి అక్షరాల తూటాలతో..
ఎదురొడ్డి నిలుస్తాను.
అమర వీర జవాన్‌లకు
అక్షర పుష్పాలతో నివాళులర్పిస్తున్న.



## వజ్రసమానుడు

నీలిమేఘం వానచినుకుగా మారి
నేలను తాకి విత్తును మొలకను చేసింది
చేతిలో రూపుదిద్దుకున్న పతంగం
దారాన్ని ఆధారం చేసుకుని నింగిని తాకింది
పేరులేని మాంసఖండాన్ని భుజాన వేసుకుని
తన రక్తాన్ని స్వేదంగా మార్చి శరీరాన్నిచ్చి
ఆ రక్తపు ముద్దకు గొప్ప పేరు తెచ్చిపెట్టింది
ప్రతిఫలాన్ని ఆశించని ఒక ప్రేమ, తనే "నాన్న"
వయసు మైకంలో జ్ఞానం శృతి తప్పినా
జీవనభ్రమణంలో తన స్థానం నాదైనపుడు తెలిసింది
విలువ కట్టలేని విలువైన వజ్రం తండ్రేనని
ఆ పవిత్రగ్రంథాన్ని పూజగదికి చేర్చుకున్నాను
అందులోని ప్రతి పేజి నాకు అంతర్యామి సందేశ
ఆధారాన్ని ఇచ్చిన ఆ దారం అనంతవాయువును చేరినవేళ
తనలోని సప్తధాతువులను దహింపచేసుకుని
నాకు వెలుగునిచ్చిన పుణ్యమూర్తికి
నా చేతులతో అగ్నిహోత్రం రాజేశాను
పంచభూతాలను చేరిన అతని అశరీరవాణి
నేటికీ నాకు దారిచూపుతున్న దివ్యమణి
నాన్నంటే త్యాగం, మార్గం, నడిపించే దైవం.

-శింగరాజు శ్రీనివాసరావు
9052048706

## కెరటం ఎప్పుడూ అలసిపోదు

రైతు ఎప్పుడూ
భూమికి పచ్చని ఆకృతిని
అలంకరించే నిత్య సేవకుడు
సేవలో లోపం లేకుండా రోజూ
సూర్యుణ్ణి ముందే పలకరిస్తాడు
ఆకాశం గొడుగు క్రింద
అవని పుత్రుడై
ఆశల మొలకల్ని నాటు తుంటాడు
ఒక్కోసారి కాలం కసిరి
కన్నీటిని దిగ మింగుతుంటాడు
అయినా కసిగానే
కాలానికి కన్నీటిని అప్పజెప్పుతాడు
వ్యవ,సాయాన్ని భరిస్తూ
వేదనని గుండెల్ని దాటనీయడు
కరిమబ్బు కలన్ని మోసుకొస్తుందని
కళ్ళను ఆకాశానికి అప్పజెప్పుతూ
రుమాలుతో ధైర్యాన్ని తలకు చుట్టేస్తాడు
రైతంటే నమ్మకమని
నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్లాలంటే
రైతే దిక్కని ప్రపంచం అంతా
అతని వైపే చూపులున్నా
నకిలీ విత్తనాలు అతని నమ్మకాల్ని
అప్పుడప్పుడూ వమ్ము చేస్తుంటాయి
దళారుల దగాతో
ప్రకృతి వికృతి చేష్టలతో
అతివృష్టికి,అనావృష్టికి గురిఅవుతూ
గుండెలు అప్పుడప్పుడూ లయలు తప్పుతాయి
నడక అయితే ఆగదు
పంటకోసం పరితపిస్తూ
ఉరికొయ్యలను అధిగమిస్తూ
'వ్యవ'సాయ సంద్రాన్ని ఈదుతూ
ఆశల కెరటమై
పడి,లేస్తూ
కెరటం ఎప్పుడూ అలసిపోదని
నిరూపిస్తుంటాడు...



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## నువ్వు నేను

బీజం నువ్వు
సుక్షేత్రం నేను!

ప్రచండం నువ్వు,
ప్రకృతి నేను!

జ్ఞాననిధి నువ్వు,
అనుభవాల గని నేను!!

స్వప్రకాశం నువ్వు,
సుప్రబోధం నేను!!

సౌజన్యం నువ్వు,
సౌశీల్యం నేను!

విజ్ఞానం నువ్వు,
నీ విజయం నేను!

మాట నువ్వు
మనసు నేను!!

అలుపెరుగని పయనం నీది,
అలసట చూపని గమనం నాది!

ఎగిరే గువ్వల స్వేచ్ఛ నీ తత్త్వం!
కరిమబ్బులా కురిసి ఫలించడం నా నైజం!

నీ కరము నా మనికికి,
నా చెలిమి నీ ఉనికికీ ,
ఆధారం!!!

ఎవరేమన్నా...
అంతటా....
భూమి నైనా...
ఆకాశంలోనైనా...
మనం సమూలం!

మనమైతేనే సంతులత,
ఘనత!!
నువ్వో సగం!నేనో సగం!!

వెరసి...
అర్థనారీశ్వరం!!!!



-సుభాషిణి ప్రతిపాటి
8099305303

## మన'సు'కవి-మొగ్గలు

అక్షరాలతో నిత్యం కవితా సేద్యం చేస్తేనే
సాహితీ నేల బీళ్ళు పడకుండా ఉండేది
కవి స్వేదాన్నిఅప్యాయంగా ప్రేమించే రైతు

సిరాచుక్కలు నీటిచుక్కల్లా వెదజల్లితేనే
కవనవనంలో పూలపరిమళం గుభాళించేది
కవి ప్రకృతిని పలకరించే తోటమాలి

మదిలోని భావాలను ఇటుకల్లా పేరిస్తేనే
కావ్య సౌధం అందంగా నిర్మించబడేది
కవి కష్టాన్ని నమ్మే నిరంతర శ్రామికుడు

కలమనేఉలితో కాగితమనే శిలనుచెక్కితేనే
నవరసాల గ్రంథమనే శిల్పం మలచబడేది
కవి జీవం పోసే అద్భుతమైన శిల్పకారుడు

హృదయమనే కుంచెతో పదాలను సృశిస్తేనే
జనపదాల చిత్రాలుహృద్యంగా సృష్టించబడేది
కవి నిత్య నూతన చి( చరి)త్ర కారుడు

సాహితీ దేవతను నిష్టగా నిత్యం పూజిస్తేనే
చైతన్యమాటల మూటల వరాలు ప్రసాదించేది
కవి పరమ పవిత్రమైన పూజారి

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## మానవ వృక్షం

తెలంగాణ మాగాణమే హరితహారం
పచ్చని కాంతుల పరిమళ తోరణం
మొక్కలునాటే దీక్షా దక్షతలయాగం
నలుకోట్ల కుక్షిబాధలు తీర్చే 'మా'నవయత్నం
నేల ఈనినట్లు పచ్చనిచెట్ల పైరగాలుల
సంక్షేమ సత్వాల సంకల్ప యజ్ఞం
సకాల వర్షాలు కాలుష్యనివారణం
సస్యశ్యామలం
పులకించాలి పచ్చదనాల కోమలం..!

చెలిమికి ఆటపట్టు
మానవజాతికి ఆయువుపట్టు ఆప్యాయతల అసలుగుట్టు
భూతల్లికి పెద్దబిడ్డ సీతమ్మే చిన్నబిడ్డ
ఆకాంక్షల వరదాయి
అవనికే అనురాగ సిరులిచ్చే
ఆత్మీయ సుఖదాయి...!

అశ్వత్థ వృక్షంగ-మైథిలీనోదార్చి
బోధి వృక్షమై తథాగతునికి మోక్షమిచ్చి
తనువునుతరిగినా కొమ్మల్నికొట్టినా..!
గంధపరిమళాల్ని అనుబంధంగ
హాయిగా చల్లగా పంచుతూ
జమ్మిచెట్టు పండుగలో బంగారమై
మనుషులతో వెన్నంటి నడుస్తూ వేళ్ళనే
ఔషధంగా పంచే సర్వజీవుల
శ్వాసకాధారమైన పరమాత్ముని బిడ్డ..!

బుద్ధిబంగారంగా నుదుటి సింగారంగా
నిలువెల్ల అనురాగంగ
తలపంతా సమభావంగ...
కొబ్బరికాయల్లో కొంగుబంగారమై..!
కొత్తశక్తినింపి కోర్కెల్ని దీరుస్తూ
కాలచక్ర గతిలో కళలెన్నొచేకూర్చి
ప్రగతిమార్గాన్నిచూపే
పంచశక్తులు ప్రణవ స్వరూపిణీ....!
మొక్కల్నిపెంచుదాం..!
మోదాన్నికూర్చుదాం...!!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

## నవ వసంతం

జీవితం కష్టాల దుప్పట్లో దూరి నిదురిస్తూనే ఉండిపోదు!

సంతోషాల ఉషోదయాలు వెచ్చగా తాకి
నవ చేతనము నింపుతునే ఉంటాయి!

పండుటాకులు తమ ఆయుస్సు తీరిందంటే
చెట్టు కొమ్మకు లేత చిగురులను కానుకిస్తూ
తన తల్లి పాదాల చెంతకు చేరిపోతుంటాయి!
అటుపై మెల్లగా పుడమి గర్భాన చేరిపోయి
తమ మాతృ దేవతకు సత్తువ చేకూర్చుతాయి!

ఆకులు రాలి మోడైన చెట్టు సైతం
తన తనువంతా పచ్చనాకులను నింపుకొని
రంగు పూలతో విరగబూసి నవ్వే నవ వసంతాగమనం కోసం
ఒంటరిగా నిరీక్షిస్తూ ఉంటుంది!

మోడైనానని ఆశ వదిలితే...
ఆ తరువుకు పరోపకారం చేసి తరించే
యోగం కలిగేదెలా...?

అందుకే...
నిరాశనెప్పుడూ దరి చేరనీయవద్దు!!



-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## పత్రహరితము కాపాడే జీవుల అంతము బూనిందెవరు

పచ్చని చెట్లను పంట పొలాలను
పడగొడుతున్నది ఎవరు
పారే ఏరుల విషమును నింపి
ప్రాణం దీసేదెవరు
విచ్చలవిడిగా ప్లాస్టిక్ భూతం
మన మెడలకు జుట్టిందెవరు
ఊపిరిదీసే రసాయనాలకు
ఊతం ఇచ్చిందెవరు
కాలం చెల్లిన వాహనాలకు
కదలిక దెచ్చిందెవరు
స్వార్థం కోసం సాటి జీవులను
చంపుక తింటుందెవరు
నగరాలన్ని మురికి కూపమై
నడకను మార్చిందెవరు
పర్యావరణ ధ్వంస రచనకు
పథకం వేసిందెవరు
గనులను తవ్వి సిరులను దోచే
దోపిడి దారులు ఎవరు
కాలుష్యం కోరలు సాచే
కార్ఖానాలు పెట్టిందెవరు
ప్రాణవాయువు నిండిన పుడమికి
కీడును పెంచిందెవరు
చితికిన బతుకులు మారని
చరితకు మార్గం వేసిందెవరు
భ్రమలను పెంచె భాగ్యం జూపి
దోచుక తింటుందెవరు
పత్రహరితము కాపాడే
జీవుల అంతము బూనిందెవరు

-గన్ రెడ్డి ఆదిరెడ్డి

## ఆత్మ సంకల్పం

ఆత్మ సంకల్పం సత్యశీలమైతే
ఆచరించే హృదయం పవిత్రమై
మహాసంకల్పాన్ని ఆశయసిద్ధిలో
విజయశిఖరాలనధిరోహిస్తుంది !

పట్టుదలకు శ్రమతోడైతే
కాలం నీకు కలిసచ్చే ఆయుధమవుతుంది
నమ్మిన విశ్వాసం నాపచేనై పండించి
మహారూపానికి
మహతత్వాన్నిబోధిస్తుంది !

అచంచల సాత్విక ధర్మాన్ని
త్రికరణశుద్ధిగా
ఆభరణనీగా అలంకరించుకుంటే
నిండుకుండలాంటి మనస్సు
నీ వెంటే ఉండి
ఆదర్శజీవితాన్ని నడిపిస్తుంది !

సంకల్పించిన కార్యమేదైనా
లోకకళ్యాణంలో లీనమవ్వాలి !
ఎదనిండా విరిసిన ఆనంద క్షణాలు
ఎల్లప్పుడూ బతికించాలి !

అప్పుడే విలువల జీవితం
భావితరాలకు భాగ్యరేఖఅవుతుంది !!.



-చిందం సునీత

## స్వేచ్ఛా విహంగాన్నై....

వాడు పుట్టిన తర్వాత తెలిసింది
నేను కోల్పోయిందేమిటో..
అమ్మ చంకను
నాన్న భుజాలను
తాత మీసాలను
బామ్మ ఒడిని
నేను తాకరాని నిషిద్ధ మనిషయ్యానని
వాడు పుట్టిన తర్వాతే తెలిసింది!

ఆడపిల్లా అని పెదవి విరిచిన వాళ్ళకు
కాదు మా ఇంటి మహాలక్ష్మని
చంకనేసుకుని ముద్దు చేసిన అమ్మ!

చిన్ని చేతులతో నాన్నకు కావలసినవి అందిస్తే
ఎంతైనా ఆడపిల్ల ప్రేమే వేరంటూ
మురిసి భుజాలపై
ఉప్పు బస్తా మోసిన నాన్న!

ఆడిపిల్లే ఈడ పిల్ల
ఎందుకవుతుందంటూ
మీసాలతో ఆడుతుంటే సంబుర పడిన తాత!

ఏ ఇంటి వాకిలి ఊడ్చాలో
ఎవరింట్లో వండివార్చాలో అని
ఒళ్ళో కూర్చో బెట్టుకుని
బుగ్గలు నిమురుతూ బామ్మ!

ఇవన్నీ గద్దలా తన్నుకు పోయింది ఎవరో
వాడు పుట్టిన తర్వాతే తెలిసింది!

ప్రతిక్షణం నిఘా కెమెరాతో గమనిస్తూ
సదాచార ఆడపిల్ల ఇలాగే ఉండాలంటూ
హద్దులు ఆంక్షల సంప్రదాయ పంజరంలో
బంధించినప్పుడు తెలిసింది!

అమ్మా బామ్మ ఆ పదాలను
పదే పదే జపిస్తుంటే.
వాళ్ళూ..నేను కోల్పోయింది
ఏమిటో తెలిసింది!

నేనూ స్వేచ్ఛా విహంగాన్నై
ఎగరాలని ఉన్నా
నా ఆత్మ విశ్వాస రెక్కల్ని విరిచిన
ఆధిపత్య ఆకాశం
నన్నెప్పుడూ ఎగరనివ్వకుండా
నా జాతి వాళ్ళతోనే
సంకెళ్ళు వేయిస్తుందని అర్థమయ్యాక
నేను కోల్పోయింది ఏమిటో తెలిసింది!



-సునంద వురిమళ
9441815722

## చుక్కల పందిరి!

ఆకాశం ఓ చుక్కలపందిరి
చక్కని మెరుపుల్ని పోగేసి
మనలమురిపిస్తు పూసేవి
అందరి చూపులు అటువైపే!

సరిగ్గా అమావాస్యచ్చింది
అక్కడంతా చీకటిమబ్బులు
కల్లు నులిమిచూడగా శూన్యం
ఇక అక్కడ వ్యథ కథ అయింది!

ఇంకేముంది ఆ వెలుగుల్లేవు
ఎందుకంటే మధ్యలో రాహువు
ఎందుకచ్చాడో తెలియదు
సంపూర్ణంగా జాబిల్లిన్నాక్రమించాడు!

కన్నీటి చుక్కలు తోకచుక్కలై
ఒక్కోటి నేలరాలుతున్నప్పుడల్లా
ఆకాశం కూడా దుఃఖించింది
నిన్నటిదాక ఉమ్మడిగాఉండేగుంపు!

తల్లికోడి మంచంకోళ్లని చెప్పుకుంటు
ఆరుబయట డాబామీద ఆకాశంలో
చుక్కల కథలెన్నో చెప్పుకునేవాళ్ళం
ఇప్పుడు చుట్టు చీకటి మూగింది!

మనసంతా దుఃఖం అలుముకున్నా
పెనవేసుకున్న స్నేహబంధాలెన్నెన్నో
రేపటి భవిష్యత్తును వెతుకుతు వెళ్ళి
ఒకరికొకరం దూరమైతే అయ్యాము!

ఎవరు ఏ దేశం వెళ్ళినాబతకడానికే
మనసు తీగలపై అల్లుకున్న బంధం
పొంచివున్న వైరస్ ఏదో చుట్టుముట్టి
మా కలలను దూరంచేయ చూస్తుంది!

మనం దేవుడు సృష్టించిన పాత్రలం
తెరమీద నాటకం ముగిసే వరకేనని
ఇది సత్యమేనని అందరికి తెలుసు
అయినా ఏదో ఆశతోనే సాగేపయనం!

విషం చిమ్మిన కరోనా వైరస్ ఇప్పుడు
సమస్త విశ్వమంతా విలయమౌతుంటే
ఇక పూసే పూవులు విరిసేనవ్వుల్లేకా
ఆ చుక్కల పందిరి బోసిపోయిందిప్పుడు!

అందరు కోవిడ్ భయంగుప్పిట్లోనే
ఒకరికొకరం జాగ్రత్తలు చరవాణితోనే
ఆట పాటల్లో నా తోడున్న నేస్తాలు
ఎప్పుడస్తారో తెలియక దారికాస్తున్నాను!

పుస్తకంలోని పేజిల్లా ఎప్పుడుకలిసి
అక్షరాల కలువలమై బడిలో కలిసిన
కల్మశమెరగని బాల్యపు నెమలికలం
మళ్ళీ కలువాలన్న ఆశలే అందరివి!

మహమ్మారి కాటునుండి భయటపడి
అందరు ఆనందంగా మళ్ళీ కలుసుకోవాలి
మబ్బులు వీడినఆకాశపుచుక్కలపందిట్లో
కరోనాను తరిమిన ధీరుల్లా నిలబడాలి!!



- వజ్జీరు ప్రదీప్
9989562991

## యామిని

అలసిన దేహానికి
సొలసిన మనసుకి
ఆలోచన మేధకి
విశ్రాంతినిచ్చేది యామిని....

మల్లెల సుగంధాలు
వెన్నెల అందాలు
కలువల సోయగాలు
మిణుగురుల మెరుపులు
నక్షత్రాల తళుకులు
ఆహ్లాదాన్నిచ్చేది అంధకారము...

పగలంతా అలసినదేహాలు
పరుగులుతీసే జీవనయానాలు
ఎవరికివారే ఆరాటపోరాటాలు
బ్రతుకుపోరాటంలోని సమస్యలు
వీటికి కామాపెట్టేదే తిమిరం...

ద్వానీతమే లేక
మూతబడదు మనోద్వారం

నూతన ఆరంభానికి
సంకేతం రజోబలమే మూలం
ఉదయం రావాలంటే
శ్యామికకి ఆహ్వానం
పలుకాల్సిందే..
ఆయుష్షును పెంచే
రజస్సును స్వాగతిద్దాం



-డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502

## మహా సంకల్పం

శక్తియుక్తులు లేని శరీరానికి
కష్టాల కడగండ్లు ఎరుగని కాయానికి
యుక్తవయసు రానే వచ్చింది
పనికి పయనం కావాల్సిన
తరుణం రానే వచ్చింది
పనిలో చేరితే గాని తెలియలేదు
చెమట చిందించే సత్తువ
నైపుణ్యంతో కార్యాలను నడిపించే
మేధస్సు తనకు లేవని..

ఉపశమనం లేని
ఉరుకుల,పరుగుల
పోటీప్రపంచంలో ఊడి పడ్డందుకు
పోటీని తట్టుకోలేక నిలువలేకపోతున్నందుకు
సమాజం చిన్నచూపు చూస్తున్నందుకు
కన్నవారిని నిందించాలో, దైవాన్ని నిందించాలో
తనను తానే దూషించుకోవాలో
లేదా తనువు చాలించాలో
తెలియని అయోమయ దుస్థితి..

అయినా జన్మ తీసుకున్నాక జీవించాల్సిందే
జీవితం కొనసాగించాల్సిందే కదా
అనే మహా సంకల్పంతో
మనసును ధృడంగా మార్చుకొని
మహా సంగ్రామం చేస్తూనే ఉన్నాడు.
చేస్తూనే ఉంటాడు..
తనకంటూ ఒక గుర్తింపు వచ్చే వరకు...



-బస్వ రాజ్ కుమార్
9392006080

## మనిషెందుకో విగ్రవీగుతున్నాడు

మనిషెందుకో విర్రవీగుతున్నాడు
స్వల్పకాలిక ఆనందాల కోసం
మరణం అనేది మరిచి
విర్రవీగుతున్నాడు
విలువలు చెరుస్తున్నాడు
ఒకరోజు
మృత్యు ఒడిలోకి వెళ్లి
అదరాన్ని తాకవలసిందే కదా!
నిద్రించిన తన మనసు తట్టిలేపక
అందకారము అనే చెరసాలలో బంది అయ్యి
మమతల తడులు మట్టుపెట్టి
అనురాగాల ఆత్మీయత ను కత్తిరిస్తూ
మనిషికి మనిషికి అంతరాలు పెరుగుతున్నాయి
విలువలను విష వలయం చేస్తూ
మంచి ని పాతిపెట్టి
చెడుని నెత్తికెక్కించుకునే అవసరాల స్నేహాలే నేడు
ఎన్ని అవతారాలు ఎత్తిన
అన్యాయం న్యాయం కాదు కదా!
తప్పు ఒప్పు కాదు కదా!
నీతిగా మసులుకొలేని
ఓ మనిషిగా ఉండటం చేతకాలేని
ఓ మనిషిగా నటిస్తూ
అయిన
మనిషెందుకో విర్రవీగుతున్నాడు!
మనిషెందుకో విర్రవీగుతున్నాడు!

-నవీన్ రెడ్డి
9963691692

## నాన్నకు నాన్ననై

బాల్యంలో నేను పుట్టగానే ఎంతో పరవసించెను మా నాన్న
తన కాళ్లపై నా కాళ్ళను పెట్టి
తప్పటడుగులు వేస్తుంటే వెన్నంటే ఉండి ధైర్యాన్ని నూరిపోసి
నడకలు నేర్పిందు మా నాన్న
తన భుజాలపై ఎక్కించుకొని
లోకం మొత్తం చూపించాడు మా నాన్న
ఓనమాలు నేర్పిన మొదటి గురువు మా నాన్న
ఎన్నో కష్టాలు పడ్డ మా సుఖం కోసం
తన జీవిత కాలాన్నే అర్పించిన
మహనీయుడు మా నాన్న
పండగ వస్తే మాకు బట్టలు కొనేవాడు తప్ప
తాను మాత్రం నాకెందుకులే
అని అన్నింటిలో తన త్యాగాన్ని
మా సంతోషంలో తన సంతోషాన్ని చూసుకున్న
గొప్ప వాడు మా నాన్న
బాల్యం నుండి యవ్వనం వరకు ఎన్నెన్నో త్యాగాలు మాకోసం
తన కోసం ఏమి ఆశించని
త్యాగమూర్తి మా నాన్న
అలా ఎన్నో సేవలు చేసిన మా నాన్నకి
తను వృద్ధాప్యంలో ఉతక్రర అవుతాను
తను తినలేని స్థితిలో
గోరుముద్దలు తినిపించే అమ్మనవుతాను
నడవలేని స్థితిలో నాన్ననవుతాను....
నాన్నకి నాన్ననై నాన్న రుణం తీర్చుకుంటాను
కొంతయినా...



-పోతరు కుమార్
8978631913

పుస్తక సమీక్ష

## గురువు అందించిన అరుదైన కానుక "ఆచార్య మసన చెన్నప్ప"




ఒక శిష్యుడు ఒక గురవుకు కానుకల్ని అందించడం మనం ఇప్పటివరకు తెలుసుకున్న వాస్తవం. కానీ ఒక గురువు శ్రీ అడపాల నరసింహారెడ్డి గారు తన శిష్యుడైన ఆచార్య మసన చెన్నప్పపై గ్రంథం రచించి ఇవ్వడం ఎంతో అరుదైన విషయం. అలాంటి అరుదైన గ్రంథం ఇది. నిజంగా ఆచార్య మసన చెన్నప్ప గారికి అరుదైన కానుక. ఈ గ్రంథంలో చెన్నప్పగారి బోధనానుభవం నుంచి వీరు అందుకున్న సన్మానాలు, సత్కారాలు, ప్రసంగాలు వరకు ప్రతి విషయాన్ని కూలంకుషంగా రచించారు. ఆగస్టు 8, 1955లో మసన బుచ్చయ్య, రామలక్ష్మమ్మ కొడుకుగా పాలమూరు జిల్లా లోని కొల్కులపల్లి లో జన్మించారు. ఈ గ్రామం నల్గొండ జిల్లాలోని చింతపల్లి మండలానికి చేరువలో ఉంది. చింతపల్లిలో వీరు తొమ్మిదవ తరగతిలో ఉండగానే వీరిలోని ప్రతిభకు గుర్తుగా 1979లో ఆ పాఠశాల నుండి వెలువడుతున్న "ఉదయిని" అనే వార్షిక సంచికకు విద్యార్థి సంపాదకునిగా నియమింపబడినారు. అపుడు వీరిలో కలిగిన తెలుగు సాహిత్యంలో వీరికి కలిగిన మక్కువ ఇంతగా అంచెలంచెలుగా ఎదగడానికి దోహదపడిందని తెలిపారు.. పేరుకు ముందు 'ఆర్షకవి' అనడం వింటూంటేనే అర్థమవుతోంది మనకు వీరి పట్ల గురువుగారికి ఉన్న గౌరవభావం.

"కష్టపడుతూ బ్రతుకునొక్కడు, కష్టపెడుతూ బ్రతుకునొక్కడు
కష్టమెరుగక బ్రతుకునొక్కడు, విడిచిసర్వము బ్రతుకునొక్కడు" అనే మాటలే బృహద్గీత గా ముత్యాలసరాలలో ఉపనిషత్తులు తెనిగించడానికి వీరికి ప్రేరణ కలిగించాయని అందుకు ఒక సంవత్సర కాలం శ్రమించవలసి వచ్చిందని మసన చెన్నప్పగారె తెలిపారు. వీరి ద్వారా అనేకమంది కవులు పిహెచ్‌డి, ఎంఫిల్ డిగ్రీలు పొందారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పాలనాబాధ్యతలు చేపట్టారు. వీరి రచనల్లో అంతర్యామి, వ్యాస పరంపర, నడవలేని అడుగులు, సాహిత్యంలో తత్త్వ దర్శనం అనే పరిశోధనా వ్యాసాలు రచించారు. అంతేకాకుండా ఉపనిషత్తులను సంస్కృతం నుండి తెలుగులోకి ముత్యాల సరాల రూపంలో అందించడానికి పూనుకున్న మొదటి వ్యక్తి ఆచార్య మసన చెన్నప్ప గారు. ఈశావాస్యం, బృహద్గీత, తెలంగాణోదయం కావ్యంపై ప్రముఖులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు.

'నా జ్ఞాపకాల పుట్ట ఇది, పిల్లల కోడిపెట్ట ఇది
రోజుకొక్కసారైనా ఈ సందుకను చూడకపోతే నాకు నిద్రపట్టదు" అంటూ రచించిన ఆ సందుక కవితా సంపుటిని కొనియాడుతూ అభినందనలు తెలిపారు డా॥ సి. నారాయణరెడ్డిగారు.

కవితాపరంగా, వ్యాసపరంగా, గొప్ప వక్తగా, పాలనా దక్షునిగా, వ్యాస కర్తగా, పరిశోధనాత్మకమైన సాహితీ వేత్తగా అనేక రంగాలలో వేదాలు, ఉపనిషత్తులు అవపోసన పట్టిన ఒక గొప్ప వ్యక్తిగా పేరొందిన ఆచార్య మసన చెన్నప్ప గారి గురించి ఎన్నో విషయాలను కూలంకుషంగా వారి గురువులు చర్చించి, అందించిన గ్రంథం ఇది. అందరూ చదవదగినది. జీవితంలో ఎన్నో అడుగులను తెలియబరచాలనే ఆలోచన రావడం ఎంత గొప్పది. అమెరికా అంటారేమిటి? నాకు కావాల్సింది భావాల అమరిక" అంటారు. అమెరికా గురించి వీరి అభిప్రాయం చాలా సరదాగా సాగుతుంది ఇలా " అమెరికా ఎంత గొప్పది!/ ఎవరి జోలి వాళ్ళది ఎవరి జోలె వాళ్ళది" అంటారు.

మరోచోట " అమెరికన్లు ఆటవస్తువులతోనే కాదు / అన్ని దేశాలతోనూ ఆడుకుంటారు" అంటారు. ఇంకోచోట "ఎన్ని సంవత్సరాలైనా / అమెరికా ఎక్కలేనిది ఆధ్యాత్మిక శిఖరమే" ఎంత అద్భుతం ఈ వాక్యం అనిపించక మానదు. అలాగే మల్లి పదాలు, నేత్రోదయం, సమాలోచన, అమృత స్వరాలు, అగ్ని స్వరాలు, చెన్నప్ప నానీలు, పీఠికలు, అక్షర కేతనం, సమదర్శనం, సుందరకాండ, ప్రమీలా ద్విశతి, చింతన వంటి రచనల వివరాలు, వర్ణనలు ఎన్నో ఈ గ్రంథంలో. ఇన్ని రచించిన వీరు ఇప్పటివరకు వీరు అందుకున్న పురస్కారాలు, సత్కారాలకు లెక్కలేవు. వాటిని గురించి తెలపాలంటే మరో గ్రంథం తప్పదు. కనుక తెలుగు సాహిత్యాన్ని నిత్యం కాపాడుతూ, తమదైన శైలిలో అనేక గ్రంథాలను రచించిన ఆచార్య మసన చెన్నప్పగారి జీవితాన్ని ఒక గ్రంథంగా మార్చిన గురువులు అడపాల నరసింహారెడ్డి గారికి, ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్పగారికి నా హృదయపూర్వక నమస్సులు..

-ప్రతులకు: ఎ.భారతి
ఫోన్: 94903 54579
మరియు
ప్రమీల ప్రచురణలు
ఫోన్: 98856 54381



-శైలజామిత్ర
9290900879

## కూలి బతుకు కుదేలాయె

ఆధునిక పోకడలొచ్చె
అందరిలో మార్పు తెచ్చె
బతుకంటె జల్సాలంటు
వేగమొచ్చి చితిని చేర్చె

చదువు కొనే రోజులాయె
పేదలకిది భారమాయె
అంతరాల ఆధునికము
చదువందక కూలిఆయె

నగర మంటె పరుగులాయె
వలస బతుకు గడుపు దాయె
యజమాని పనివాడై
పనుల కొరకు వెదకుడాయె

ఇరుకు గదుల బతుకు డాయె
పలకరింపు లేక పాయె
ఎవరి బతుకు వారిదై
నగర బతుకు నరకమాయె
పని చేస్తె పూట గడుచు
పనిలేక పస్తులుంచు
డొక్కలన్ని ఎండిపోయి
పేదరికం ఎక్కిరించు

కోపమెవరికి వచ్చినను
నలిగి పోయె పేదలవును
అరటాకు బతుకులాగ
అణగి ఉండే బతుకవును

స్వంత ఊరు విడచినోళ్ళు
నగరమొచ్చి పేదోళ్ళు
స్వేచ్ఛ లేని బతుకు వల్ల
అందరిలో కన్నీళ్ళు

తెల్లారితె ఉరకాలి
కూలి కొరకు వెదకాలి
ఏమి బతుకు వీరిదాయె
ఇకనైనా మారాలి

వలస కూలి బాధ నేడు
నడవ లేక పడెను చూడు
కడుపు మాడి కూలబడి
కన్నీటిని తాగె నేడు

అంటు వ్యాధి మంట లేపి
అందరికి భయము చూపి
బతుకు తీరు మార్పు తెచ్చి
కాలుష్యము రూపు మాపితీసి



-బి.సుధాకర్
9849243908

## అవ్వా

అవ్వా ఎన్ని జన్మల పుణ్యమో
నేను నీ కడుపుల పుడితిని
కాయకష్టం జేసి నీ కడుపు మాడ్చుకొని
నువ్వు కారం గటుకతోనే సల్లవడి
నా కడుపునిండా మంచి కుర బువ్వతోని
కుతార నా కడుపు ఆకలి తీర్చితివి
నేను చేతుకచ్చే దాక పిట్టెపిల్ల లెక్క
నాకు ఏ బాధ రాకుంట సాకుకుంటివి
కరంటిలేకుంటే గ్యాసుమానే దీపం దగ్గర
నడియం రాత్రిదాక అజారు బీడీలు చేసి
మన బతుకు బండిని నెట్టుకచ్చినవే
ఎంత కష్టమచ్చినా నన్ను ఏ కైకిలి తోలలేవ్
నన్నే కకా నీ కన్న తల్లిదండ్రులకు కూడా
నువ్వు తల్లివై చెట్టులెక్క నీడనిస్థివి.
సర్కార్ బడిలనే నన్ను పెద్ద పెద్ద
సదుల కోసం పట్నం దాక తోలితివి
అప్పుడప్పుడు తెలక నేను తప్పుజేసినా
పెయి మీద ఒక్క దెబ్బైనా ఎయ్యకుంట
బుదిరికిచ్చి నాకు బుద్ధిజెప్పినవే
మంచి మంచి ముచ్చట్లు జెప్పినవ్
సత్తెంకొద్ది బతకాలని తప్పుజేయకుంటే
ఓల్లకు భయపడద్దని ధైర్యం జెప్పినవ్
చిన్నప్పటి నుంచే నా కళలను గుర్తువట్టే
సక్కటి తెలివి జెప్పి మంచి మెలవకువలు నేర్పి
నన్ను ఓ కళాకారుడిగా తీర్చిదిద్ది
గీ దునియాల గర్వంగా నిలబెట్టివే
బడి పంతుల్లు, కళాకారులు సలాం జేసిరే
అవ్వా! నువ్వు ఎందరో ఆడోల్లకు
నూటికి నూరు పాల్లు ఆదర్శమే...



- పోలీస్ భీమేశ్
9505255218

## ఒక పలవరింత

ఒక పలవరింత
నా గుండెలపై తన్ని
కన్నీటిని విరజిమ్మింది
కొండలు తొలిచి
కోనలు కోసి
గర్భాన్ని చీల్చి
నిన్ను నువ్వు మోసం చేసుకున్నందుకు.

పరమాణువు ఛేదించి
బ్రహ్మపదార్థం బద్దలు చేసి
తలబిరుసుతనంతో
తూగుతున్నందుకు.

కాలంకోసే కోతగాయాలను
లేపనాలతో చల్లార్చి
అపరవైద్యుడనని
విర్రవీగుతున్నందుకు.

రంగుల పూప్రపంచం నాదేనని
మాయరంగుల్లో మునిగితేలుతుంటే
నీకంటే మాయదారి రంగొకటి
చీకటిని పులిమి
పరిహసిస్తున్నందుకు.

రాళ్ళను కరిగించి
గుళ్ళను ఏమార్చి
శటగోపాన్ని నీ తలమించి
దేవుడిపైకి మళ్ళిస్తున్నందుకు.

అర్థం చెప్పలేని భావాల్ని
అందంగా ఒడిసిపట్టి
నిలువెత్తు మనీకౌశలాలు
నిండుగా ప్రదర్శిస్తున్నందుకు.

నిన్న చేసావు
నేడు చూస్తున్నావు
రేపటికిదే నీ మతమైతే
రెక్కలు తెగిన దీపపురుగులా
ఆహుతికి సిద్ధమా.

ఇది ప్రశ్నా పలవరింతా..
అప్రమత్తతా సంకేతమా
ఏదైతేనేం
జ్ఞానోదయం అనివార్యం.

-బి.వి.గణేశ్వరరావు
8519838426

## విషం

అమ్మ నాన్న అనురాగఫలమో
ఏ రెండు శరీరాల కలయిక కర్మమో
ఇలలో ఒక జననం మరో మరణం
అవస్థ మారే కొద్దీ అయ్యే అలవాట్లు
పరిస్థితుల ప్రాబల్యమో
అంది వచ్చిన అవకాశమో
చడీచప్పుడు లేకుండా వచ్చిపడి
వ్రేళ్ళూనుకు పోయాక తెలిసే అపరాధం
కూడని సహవాసం ఎటు తీసుకువెడుతుందో
ఏ మార్గంలో నడిపిస్తుందో
స్వీయనియంత్రణ లోపిస్తే
బలహీనతకు బానిస కాక తప్పదు
ఒక వ్యసనం ఓ విధ్వంసానికి
దారి తీయకపోతే ఫరవాలేదు
మత్తు మదోన్మత్తత కానంతవరకూ
మనిషి మనిషిగా నిలబడగలడు
మద్యం కోసం పరుగు తీయు పరువు
ఆలుబిడ్డలకది ఒక గ్రహపాటు
నైరాశ్యంలో సంసారం వేదనా కాసారం
మందంటే మందా కాదది
కరోనాలా కబళించే కాలకూటవిషం!



-అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి
9014463489.

## వందనాలు

మనిషి ఎంత అభివృద్ధి చెందినా
మనిషికి తెలియని రహస్యాలెన్నో
అటువంటి రహస్యమయమే 'కరోనా'
కనబడని సూక్ష్మక్రిమి ఒకటి
అవనినంతా అతలాకుతలం చేస్తున్నది
అగ్రరాజ్యాలు సైతం అల్లలాడిపోతున్నయ్‌త
ఆర్థికంగా కుదేలయిపోతున్నాయ్
కనిపించే అటుఇటుగా అంచనా వేయొచ్చు
తెలియకుండానే కరోనా
కౌగిలికి కొందరు బందీలైపోతున్నారు
వారిని రక్షించుకునేందుకు
రక్షక భటులు వైద్యులు, సిబ్బంది
పారిశుద్ధ్య కార్మికులు, బ్యాంక్‌లు
పోస్టాఫీస్‌లు వారి సిబ్బంది
జాగ్రత్తగా వారి కర్తవ్యాన్ని
వారు నిర్వహిస్తున్నారు
బాధ్యతంటే నిర్వచిస్తున్నారు
వారందరికీ మనమందరమూ
వందనాలు అర్పిద్దాం-
వారి సేవలకు కృతజ్ఞతలు చెబుదాం.



- డా।। చిట్యాల రవీ
సెల్: 7798891395

## నాయిన

మా బతుకుల్లో వెలుగులు నింపేందుకు
తాను వలసపక్షై రక్తాన్ని దారవోస్తూ
దూరాలని సైకిల్ పై చేదిస్తూ
సద్దిబువ్వనే పరమాన్నంగా బుజించే
మానాయిన దేవుడు గాక ఏమగును....

తనజీవితాన్ని అజ్ఞానాంధకారాలు అలుముకున్నా..
మమ్ములను విజ్ఞానఘనులుగా మార్చిన
మితభాషి మాశ్రేయస్సుగోరే శ్రేయోభిలాషి
మానాయిన దేవుడు గాక ఏమగును...

కరువులు కోరలు జాచిన
మా తనువుల రక్షణకే తంటాలుపడుతూ
మా కంటిలో కన్నీళ్ళు రానీయక
తన కంటిలోని నీళ్ళు మాకంటవడకుండ
మా యథను ఒంపుకున్న అక్షయపాత్ర తను
మరి మానాయిన దేవుడు గాక ఏమగును..

ఎండనక వాననక
రాత్రనక పగలనక
రాయిని మలిచి గుడిగట్టి
దేవునికే నీడనిచ్చే..
మా తలరాతలను మార్చిన
మానాయిన దేవుడు గాక ఏమగును....

మేట్నాతో మేడలు గడుతూ
హలంతో పొలందున్నుతూ
ప్రతిఫలం ఆశించక
నిత్యం ప్రవహించే జీవనది అతడు..

బడిని గుడిని గట్టినా గరీబ్
ఒంటి కాలుపై తపస్సునిజేసిన
భగీరథుడు వారసుడు...

బతుకు సమరంలో ఓటమి పై
విజయపతాకాన్ని ఎగరవే?స్తూ...
మాబతుకుల్లో వెలుగులు నింపి
మా తలరాతలను రాసిన
నిజబ్రహ్మ మానాయిన



-ఉప్పరి తిరుమలేష్
9618961384

## తొలకరి చినుకులు

అన్నదాతల ఆర్తనాదాలు చూసి
ఆశలు బతికించటానికా అన్నట్లు
బొట్లు-బొట్లుగా
కన్నీరు కార్చినయి మేఘాలు,

భానుడు కురిపించిన
నిప్పుల వర్షాన్ని చల్లార్చి
గాలి అలలతో పోటీపడి
సరిగమలు పాడుతూ
చిందులు వేసినయి చినుకులు,

భూమాత తనువు చల్లబడి
తన్మయత్వమొందితే
చెట్లు-మొక్కలు చేతులూపుతూ
స్వాగతం పలికినయి వానకు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన జనం
ఉన్నపళంగా కరుణించిన
చినుకు ముత్యాలను తాకి పరవశిస్తే
పశుపక్షాదులు స్నానమాడి
సంతోషంతో పరుగులుపెడుతూ
పండగ చేసుకున్నయి
తొలకరి జోరుకు:



-గంభీరావుపేట యాదగిరి
9440617611.

## సరిహద్దులో సూరిడా

సందేశం వస్తుంది బెగిరమ్మని
ఆదరాబాదరాగా మూటముళ్ళే సర్ది
భార్య పిల్లలకి కన్నీటి వీడ్కోలు చెప్తూ
చెంగుచెంగున బోర్డర్ దగ్గరికిపరిగెత్తి
దేశ రక్షణ కోసం నీకు నువ్వే సంకెళ్ళు వేసుకుంటావు.
తూర్పున ఉదయించే సూర్యుడుకి
విశ్రాంతి ఉంది.
కానీ, విరామం ఎరుగని జీవితాలు ఇవి.
ఒక్కసారి దేశం దాటి చూడు సైనికుని విలువ తెలుస్తుంది
ప్రతిసైనికుడి గుండె చప్పుడు
భారతీయత
అదే రా తమా ఇండియా అంటూ
కొవ్వొత్తులా సర్వత్యాగాలు.
దేశ సరిహద్దు నా ఇల్లంటూ
దేశరక్షణే నా బాట అంటూ
దేశభద్రతే నా లక్ష్యం
కర్తవ్యం ఉపిరంటూ
సరిహద్దుసేవంటే సాహసమేనని
భరతమాతకు తిలకమవుతానని
యుద్ధానికి యోధుడినై సిద్ధమంటూ
కార్గిల్ చైనా పుల్వామా యేపోరైనా
ముందర నుంచే యే యుద్ధమైనా...
పిరికిపంద ఉగ్రవాదులారా
మా భారతదేశ సైనికుల్ని
చేతగాక వెనక నుంచి చంపేస్తారా!
తూటాలు తగిలి దేహాలు
నెత్తుటి మడుగులో ప్రాణాలొదిలే
ముష్కరులు ఆడిన ఆటలో
దేశభక్తులు ఇక రారని తెలిసి
దాయాదుల ఆటలో
దేహం దగాపడి
దేశ రక్షణలో దేహాలు కొన్ని పూలై భరతమాత ఒడిలో
ఒదిగిపోయాయని తెలిసి
నన్ను నేనే మరచిపోయి
మౌనంగా రోదిస్తున్నా...
జోహార్లు సైనికుడా
జోహార్లు సేవకుడా

-వి విజయశ్రీ దుర్గ

## మానవత్వం

హృదయ భారము తగ్గించే
కన్నీరునైన..
హృదయాన్ని ఆనందడోలికలలో ఓలలాడించే
ఆనంద భాష్పాలునైనా...
అశ్రుగ్రంధులు సమయానికి
నయనాలపై కురిపించినప్పుడే
హృదయాలు స్పందిస్తాయి..

నెర్రలు ...నోళ్ళు చాచిన క్షణాన
కారు మబ్బులు నీటి చుక్కలను
పుడమి తల్లి దోసిటలో పోసినప్పుడే
రేపటి మేఘాలనూ ఆహ్వానించే
చల్లని పవనాలను వీచే తరువులకు
ఊపిరిపొయ్యగలదు భూదేవి..

అన్నమో రామచంద్రో
అన్నమాట నీ శ్రవణేంద్రియాలను
తాకినప్పుడే మానవత్వము
ఊప్పెనై ఎగిసిపడాలి నీ మనసున...
నీ కరములు అసంకల్పితంగా
అన్నధాత గా అవతారమెత్తాలి..

సానుభూతన్నది మనసున
సుగంధపరిమళమై
ప్రాణమున్నంత వరకూ
నిత్యమల్లెలా వికసించాలి.



-శ్రీదేవి సురేష్ కుసుమంచి
7032760484

## ప్లాస్టిక్

పాడు చేయు చుండె ప్లాస్టిక్ భువినంత
పెరుగు చుండె వేడి పెద్ద గాను
వాడ వలదు మనము యెడపెడ ప్లాస్టిక్
పుండలీకు మాట పూలబాట

పెరుగుతుంది నేడు ప్లాస్టికు వాడుక
కరుగు తుంది భూమి కాల మందు
తప్ప దికలె మనకు తిప్పలు త్వరలోన
పుండలీకు మాట పూలబాట

పెండ్లి విందు లందు పేరంట ములలోన
విరివిగాను జనులు వాడు చుండ్రు
ప్లాస్టికునుమనుషులు పలువిధా ములుగాను
పుండలీకు మాట పూలబాట



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## తలుపుల మెరుపులు

తలుపులు ఇంటికి
ఆలు మగలు
మనిషి కంటికి
అవిక్రయ వస్తువులు !!

కోట్లతో ఇల్లుకట్టిన
తలుపులులేక వ్యర్థం
తలుపులుంటే గుడిసెకైన
అదే నిగుడార్థం !!

మారుపేర్లు రక్షణకు
ఇంటికున్న తలుపులు
గురిచేయవు భక్షణకు
కాపాడే మలుపులు !!

కర్రైనా లోహమైన
ఇంటికి రక్షణ
ఒదులుతవి ప్రాణమైన
చేయనీయవు భక్షణ !!

తలుపులను తన్నినా
తగువు పెట్టుకోవు
విరగగొట్టుటకు వలవేసినా
విజృంభిస్తూ మీదికిరావు !!

ఓర్చుకొని ఉండరా
ఓరి.. మానవుడా
తగ్గించుకొని బతకరా
మాయమయ్యే విగతజీవుడా !!

అమ్మానాన్న ఉన్నఇల్లు
సంతోషంగా ఉంటది
తలుపులున్న ఇల్లు
అతిసుందరంగా ఉంటది !!



-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762.

## అక్షరసత్యం

జీవకోటిలో మనిషి మహనీయుడు
శక్తిపరుడు యుక్తిపరుడు
కానీ నేడు తాను విజ్ఞానం విపరీతమై
నాగరికం మరచి నడయాడుతున్నాడు
వివేకం కోల్పోయి వెర్రి మొర్రి చేష్టలతో
దుశ్చర్యలకు పాల్పడుతూ...
వింత వింత చేష్టలు చేస్తూ
అదే నవీన నాగరికమని భ్రమిస్తూ
తనకుతాను మురిసిపోయి
అనర్థాలకు తెర లేపుతున్నాడు
మానవుడు ఎంత విజ్ఞానవంతుడైనా
ప్రకృతిని శాశించలేడు
ప్రకృతితో చెలగాటం ప్రమాదకరం
ప్రకృతిలోని వింతలు విశేషాలు కోకొల్లలు
మనిషి మేధస్సుకు అందినది రవ్వంత
ఇంకా తెలుసుకోవలసినది కొండంత
ప్రకృతికి విరుద్ధంగా కాకుండా
ప్రకృతిని అనుసరిస్తూ బ్రతకడం శుభదాయకం
అన్నీ సజావుగా జరిగితే 'నేను' నావలననే అని
జబ్బ చరిచి విర్రవీగుతాడు మనిషి
అంతు చిక్కని సమస్య ఎదురైతే
భగవంతుడిదే భారం అని చేతులెత్తుతాడు
ఈ ద్వంద వైఖరి సరియైనది కాదు
ఎవరు ఔనన్న కాదన్నా ఒక్కటి మాత్రం నిజం
ఎదో ఒక మానవాతీత మహత్తర శక్తి
ఈ ప్రకృతికి ఊతమిచ్చి ముందుకు నడుపుచున్నది
ఇది సర్వదా అక్షర సత్యం
దానికి మానవాళి దాసోహం అనక తప్పదు.



-దాసరి శ్రీనాథ్ గౌడ్
9701781696,
7780143871

## నానోలు

అర్థం
అబద్ధం
ఆత్మ
నిజం

ఆశ
వెలుగు
నిరాశ
చీకటి

మనసు
వెన్నెల
వయసు
మంచు

విజ్ఞత
మిత్రుడు
అహం
శత్రువు

సేద్యం
భృతి
ఋణం
మృతి

మనసు
కడలి
ఆలోచన
కెరటం

కలం
ఖడ్గం
సిరా
రుధిరం

మౌనం
ఆభరణం
మాట
అలంకారం

మూర్ఖం
వినాశిని
వివేకం
సంజీవని

పుస్తకం
దిక్సూచి
చదువు
గమ్యం

మనిషి
స్వార్థం
మొక్క
త్యాగం

చెట్టు
స్ఫూర్తి
మెట్టు
ప్రేరణ



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139

## గాలి లో దీపాలు

రెక్కాడితే గాని డొక్కాడని జీవులు
కూలీనాలీ తోనే పొట్టపోసుకొనే ప్రాణులు
తాడు,బొంగరం లేని వలస కూలీలు
ఉరుము లేని పిడుగు లా కరోనా వచ్చింది
ఆ భాగ్యు ల బతుకు లని రోడ్డు న పడేసింది
వలస కూలీల పై పిడుగు పాటు
సర్కార్ ప్రకటిం చిన లాక్ డౌన్ పోటు
కనీస వేత నానికి నోచుకోని శ్రమ జీవులు
ఆరోగ్య రక్షణ కూడ లభిం చని జనాలు
సామాజిక భద్రత పొందని జీవితాలు
వైరస్ భయం తో వణికిపోతున్నారు
ఆకలి బాధ తో విలవిల లాడు తున్నారు
సర్కార్ నిర్లక్ష్యానికి బలి పశువు ల వు తున్నారు
వలస కూలీల వేదన అరణ్య రోదనే
వాళ్ళ ఆవేదన చెవిటి వాని ముందు శంఖా నాదమే
విదేశాల్లో ఉన్న వారికి విమానాలు
వీరికి మాత్రం లేనేలేవు సరైన వాహనాలు
ముందు చూపు లేని సర్కార్ చేతులెత్తేసింది
దూరదృష్టి లేని ప్రభుత్వం ముఖం చాటేసింది
వాళ్ళ బతుకులు బాగు పడేదెప్పుడు?
వాళ్ళ సమస్యలనుండి బయటపడే డెప్పుడు?
కాయకష్టం చేసే వాళ్ళ కష్టాలు పోయేదెప్పుడు?
సర్కార్ దృష్టి సారిస్తే సరే సరి
లేదంటే వాళ్ళ బతుకులు కాస్త హరీ

-ఆచార్య గిడ్డి వెంకట రమణ
చర వాణి 9440984416

## గ్రుహమే స్వర్గ సీమ.

కత్తులుండవు, కాలు దువ్వటాలుండవు, ఫిరంగుల మోతలుండవు, బలి చక్రవర్తి వద్దనుండి మూడడుగుల నేలపొంది, త్రివిక్రముడై మె?త్తం జగత్తు నంతా రెండు అడుగులతో, మిగిలిన ఒక అడుగుతో బలిచక్రవర్తిని పాతాళానికి పంపిన విధంగా, చేతి వేళ్ళతో కన్ను, ముక్కు తాకుట వల్ల మరియు వైరస్ సోకిన వ్యక్తి దగ్గు, తుమ్ము, తుంపర ద్వారా గాలిలోకి ఎగజిమ్మిన చిన్న చిన్న నీటి రేణువులతో కప్పబడిన వైరస్, మరొకరికి శ్వాస ద్వారా ప్రవేశించి, గొంతు మంట, తలనొప్పి, శ్వాస ఆడకుండా చేసి మానవుని ముప్పు తిప్పలు పెట్టు మహమ్మారి కరోనా వైరస్ కంటికి కనిపించకుండా యుద్ధం చేయుటలో అందె వేసిన చెయ్యి, అందుకు నీవు చేయాల్సిన యుద్ధం, ముక్కుకు మాస్కు వేసుకో, గంటకో సారి కరముల సబ్బుతో శుభ్రపరచుకుని శానిటైజర్ రాసుకో, కనిపించిన ప్రతి ఒక్కరికి షేక్ హ్యాండు నివ్వక, కరములతో నమస్కరించు, ఎక్కడకు వెళ్ళిన భౌతిక దూరం పాటించు, పోలీసులకు కనబడకుండా, రోడ్డు దాటగలవేమో, కానీ కనిపించని కరోనా మహమ్మారి నుండి ఎలా తప్పించుకో గలవు, ఎవరిని మ్రింగుదునా అని గర్జించు సింహం లా, సైలెంట్గా, చాపకింద నీరులా విస్తరిస్తూ, అగ్ర రాజ్యాలలోను మరణ మ్రదంగం మ్రోగిస్తూ, కంటికి కునుకు రాకుండా చేయు చున్న కరోనా మహమ్మారి నుండి తప్పించు కొనుటకు ఏకైక మార్గం గ్రుహమే నీకు స్వర్గ సీమ.



-బుర్రి. కుమార్ రాజు
9848918141.

## కదిలెను బతుకు జట్కా బండి

కరోనా లాక్ తీసినంత పనైంది
బతుకు బండి గిర్రలకు కందెనలద్ది
కాసింత ధైర్యాన్ని గుండెకు పూసుకొని
కరోనా కన్న ఆకలే కడు ప్రమాదమంటూ
మెతుకు వేటకు బడుగుల పయనం !

రోడ్లన్నీ జనాలతో ఊపిరాడక
దుకాణ షట్టర్లు విశ్రాంతిని వీడి
గిరాకీ కోసం తదేక ఎదురుచూపులు
వైరస్‌కు జడిసి బస్సు చక్రాలే కాదు
ప్రయాణీకులు జంకి వణికిన వేళ
కళావిహీనం కూడలి ప్రాంగణాలు !

గృహ నిర్బంధంతో సిలుం పట్టిన..
కాళ్లు, కీళ్లు, సైకిళ్లకు గ్రీసులను రుద్ది..
తడబడుతూ బెదిరి భీతిల్లుతూ
దూరాచారాలను అటకెక్కించి
మూతి గుడ్డకు విరామమిచ్చి
అందని ద్రాక్షకు ఉరుకులు !

మనిషికి మనిషినే అనుమానితిన్ని చేసిన
పక్కలో బల్లెం పెట్టుకొని నిద్ర నటించినట్లు
కోవిడ్‌తో బలవంతపు సహజీవనాలు
రోజంతా పని కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని
సాయంత్రానికి సతికిలపడ్డ జీవచ్ఛవాలు
బతుక్కు లాక్‌డౌన్ లేదనే లేదంటూ
సగటు జీవి నిత్య నిట్టూర్పుల మంటలు !



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కణజీవి కథ

పొంచి యున్న ముప్పు మునుముందె ఉన్నది
మర్చిపోయి యెపుడుమసలబోకు
విజయమందితినని విర్రవీగకు మోయి
అంతమొందలేదు ఆకణమ్ము!!

అంతమెప్పుడనుచు నారాటపడబోకు
ఓర్మిగలిగినంత నొప్పు యౌను
కలిమి లేము లేవి కారణమ్ములుకావు
అంతమొందలేదు ఆకణమ్ము!!

పొరుగు వారికడకు పోవలదుపనులే
మియును లేక, దూర మేల మనకు
చాలు నింక యనిన, సడిలేక వచ్చును
అంతమొందలేదు ఆకణమ్ము!!

సీత గీత దాటి చిక్కులో బడిపోయె
కష్టమెల్ల నవియు కానలేమె
బురదలోన బొరలి పోరుసల్పి నటుల
అంతమొందలేదు ఆకణమ్ము!!

మాయలాడి యదియ మర్మమెరిగి తిర్గు
రోగకారకమ్ము రోదనిచ్చు
లాకుడౌను బోవ లౌక్యంగ మసలుకో
అంతమొందలేదు ఆకణమ్ము!!

షేకుహేండు యెపుడు క్షేమమ్ముగాదయ్య
వందనమ్మె మనకు వాంఛి తమ్ము.
రెండు చేతులెత్త దండమ్ము గామారు
అంతమొందలేదు ఆకణమ్ము!!

అవసరమ్ముదీర వాహనమ్ము నడుప
వాయుకలుషితమ్ము పరుగు దీయు
దూరదూరముండి దొరవోలె బ్రతుకుము
అంతమొందలేదు ఆకణమ్ము!!

గుట్క పాను నమిలి ఘోరంగ వుమ్మకు
రోడ్డు పాడుజేయ రొంప వచ్చు
నొక్క రోగ మింక, ఓర్మి వహించుము
అంతమొందలేదు ఆకణమ్ము!!

నేటి దాక మనము నేర్వక యుంటిమి
రోగజీవిజంప రూఢి గాను
విచ్చుకొన్న కణము వీడకుండు ననిరి
అంతమొందలేదు ఆకణమ్ము!!ల

వేసిన వెనుకడుగు వేసేది ముందుకే
యనిరి వైద్యులంత, కనుగొనంగ
వాక్సినెప్పుడొచ్చు? వ్యాధిని వారించు?
అంతమొందలేదు ఆకణమ్ము!!



-యెనిశెట్టి గంగా ప్రసాద్
సెల్: 9866447234

## "నేటి నిజం"...!

నేటి నిజాన్ని చూసి
మౌనం మాట్లాడుతుంది
ఒక్కొక్కసారి ఆరాధనగా
మరొక్కసారి అభిమానంగా
ఇంకొక్కసారి హెచ్చరికగా
మౌనం మాట్లాడుతుంది
కరోనా తెచ్చిన సంక్షోభంతో
కృష్ణల కన్నీళ్ళన్నీ కమ్ముకున్న వేళ
నేటి నిజాన్ని స్వీకరించు
కరోనాతో సహజీవనం ప్రారంభించు
నీ మనస్సును
ఓదార్చే లేపనం నువ్వే అవుతావ్
కరోనా తెచ్చిన ఆర్థిక ఇబ్బందులతో
కన్నీరు సంద్రంలా నిన్ను చేరు వేళ
ఆత్మవిశ్వాసాన్ని తీరంలా మార్చి
నీ కన్నీటిసంద్రానికి హద్దుగీసి చూడు
ఒకసారి లోకాన్ని పరికించి చూడు
లోకంలో కష్టాలు అంటూ లేని వారు ఎవరున్నారు?
ఇది నిజం కదా...! ఇదే నిజం కాదా...!
నేటి నిజాన్ని స్వీకరించూ...
నీతో నువ్వు యుద్ధం ప్రారంభించు
నిన్ను నీవు జయించు
నీతో యుద్ధం చేయడానికి
లోకం సిద్ధంగా ఉన్నదని గమనించు
ఈ నిజాన్ని చూసి
మౌనం మాట్లాడుతుంది
ఒక్కొక్కసారి ఆరాధనగా
మరొక్కసారి అభిమానంగా ...
ఇది నిజం కదా!
ఇదే నిజం కాదా!
"నేటి నిజం" ఇదేకదా ... !
"నేటి నిజం" ఇదే కాదా ......!!



-డా. చింతపల్లి ఉదయ జానకి లక్ష్మి
9440731067

## కరోనాతో కొత్త అడుగులు!

కాలంతో పాటు మనము నడవాలి
కష్టకాలమైన అది ఇష్టంగానే సాగాలి
కరోనా చెప్పెనెన్నో పాఠాలు జాగ్రత్తలు
అవి తప్పామా బతుకు అంధకారమే !

మనకు ఇక క్షణం క్షణం ఒకయుద్ధమే
మనిషి తనకు తాను కావాలి ఇకసిద్ధం
పీల్చేగాలి నుండి తినే అహారం వరకు
ఏచోట ప్రమాదం పొంచివుంటుందో ఏమో!

మనం ఇప్పుడు కరోనాతోనే నడవాలి
ఎందుకంటే దానికి మందు వచ్చేవరకు
వేసే ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాలి
అది ఎవరు అవునన్నా కాదన్నా నిజం!

పేద ధనిక బేధం చూడని మహమ్మారి
కరాళనృత్యమాడుతుచేస్తున్న విలయం
కనిపించని వైరస్ తో అందరు కంపిస్తుంటే
ఒక్కసారిగా స్తంబించెను భూమండలం!

బంధం బంధుత్వం స్నేహం కుటుంబాలను
నిన్నటిదాక ఉరుకుల పరుగుల జీవితంతో
పరుగెడుతునే దూరమయ్యాము అందరం
ఇప్పుడు కరోనాఎవరినెలాదూరంచేస్తుందో!

లాక్ డౌన్ పాటిస్తు మన అవసరాలకై
కొత్త దారుల ప్రణాళికలను అన్వేషిస్తునే
ప్రమాదపుటంచులను దాటుకుని
వ్యాధిని జయిస్తు మనం అడుగులేయాలి!
ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల చేయుతా

ల్యాబ్ ల్లోవ్యాక్సిన్కై సైంటిస్టుల ప్రయత్నం
డాక్టర్లు పోలీస్ పారిశుద్ధకార్మికుల సేవలు
నిత్యం యజ్ఞంలా సాగుతునే వున్నాయి!

మనం ఈ విపత్తు పరిణామం ఎదుర్కోను
ఎడంగానే అందరం కలిసికట్టుగా వుందాం
ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిబంధనలుపాటిస్తు
ఇప్పుడు మనం అందరం కొత్తగా జీవించాలి!!



- వజ్జీరు ప్రదీప్
9989562991

## సుధావాణి

మంచి గుణం క్షమాగుణము
రాకూడనిది విరక్తి భావము
ఉండవలసినది దాన గుణము
చేయకూడనిది నమ్మక ద్రోహము.

చేయవలసినది మంచి సహాయము
వదలకూడనిది మంచి స్నేహము
మరువకూడనిది చేసిన ఉపకారము
చేయకూడనిది ఇతరులకు అపకారము,

వీక్షణ శక్తివి నీవు
ఆఘ్రాణించే శక్తివి నీవు
వినికిడి శక్తివి నీవు
పలికించే శక్తివి నీవు

తల్లిని ప్రేమగా చూడాలి
నాన్నను మమకారంతో చూడాలి
పిల్లలను ఆప్యాయంగా చూడాలి
బంధువులను తీయంగా పలకరించాలి.

స్నేహితులను ప్రాణప్రదంగా చూడాలి
పెద్దవారిని చక్కగా గౌరవించాలి
సేవకులను అభిమానంతో చూడాలి
దేవుణ్ణి భక్తితో ఆరాధించాలి.



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## మరణ సందేశం

మరణం ఒక సంఘర్షణల సమూహం
మరణం ఒక ఉత్తేజం
మరణం మానవుని కోరికలకు
అంతం
మనిషి అసూయకు అంతం
మనిషి పగలకు ప్రతీకారానికి
అంతం
మనిషి భవిష్యత్ ఆలోచనలకు
అంతం
మనిషి ఊహలకు
అంతం
మరణం కొత్త విషయాన్నీ
తెలుసుకోవాలని ఉరకలేస్తుంది
నరక ద్వారాల
స్వర్గ ద్వారాల
గుట్టు రట్టు చేయాలని
ఆసక్తితో ఎగిసిపడుతుంది

తెలుసుకోవాలనే ప్రయాణంలో
ఆకలి నిద్ర ప్రేమ
దయ జాలి కరుణ
బంధుత్వం అనే
తేడానే మర్చిపోతుంది
భగవంతుడి రూపాన్ని
చూడాలనే కోరిక నేమో
ఉవ్విల్లు ఊరుతుంది
పడుకున్న మంచం
ప్రవాహ చక్రంలా అనిపిస్తుంది
పాపం తెలియని జనాలు
కొర్రి ప్రాణం అనుకోని
గగ్గోలు పెడుతున్నారు
కోరిక అని తెలియదు ఏమో.



- చెల్పూరి శ్రీకాంత్
8297975713.

## అమ్మతనం ప్రకృతి

సమస్త మానవాళిని అమ్మలా
చల్లగా చూసేది ప్రకృతి
అలాంటి ప్రకృతి తన ఒడిలో..
సేదదీరుస్తుంది ప్రతి జీవిని!

అమ్మతనం ప్రకృతియై
గతించిన కాలం వదిలి
వర్తమానానికి వరమై
భవిష్యత్తుకు భరోసా
అవుతుంది.
ప్రకృతి మనిషి ఆసనానికి
ఆసరై..
ఆకాశంలో చంద్రుడిలా
తొలి వేకువలో వెలుగులా
అనునిత్యం ప్రకృతి అమ్మలా
అహర్నిశలు ఆరాటపడుతోంది.
మనతో మమేకమై...

సృష్టి ధర్మాన్ని ఆచరిస్తుంది.
ప్రకృతి తన తనువులో
జీవం పోస్తోంది అనునిత్యం.

ప్రకృతి నాలుగు దిక్కులలో
కరములనే ఆయుధాలుగా
చేసుకుని కాపలా కాస్తుంది
అలుపెరుగని సైనికుడిలా!

చిగురించిన తరువులు
వసంతం రాకతో మదికి
నవ్వుల పూలనిస్తుంది.
గ్రీష్మ తాపానికి మేను
విలవిలలాడింది.
వర్షపు చినుకులతో అలసిన
దేహానికి ప్రాణం పోస్తోంది.
హేమంతలో మల్లె తుంపరులు
మంచుతో మత్తెక్కిస్తోంది.

శరత్కాలపు సోయగాలు
చలువల వెన్నెల నిస్తోంది.
ద్రుమానులు శిశిరంలో దాచుకున్న
సిగ్గులను వలువలుగా విడిచి
కనులకు సొగసులనిస్తోంది.
ఆస్వాదించే పూల పరిమళాలు
మధుర భావాలను ఇంకా
ఎన్నెన్నో..మనకై సంపూర్ణంగా
మన సొంతమైంది
ఈ ప్రకృతి అమ్మతనంతో....!!



- కొలిపాక శ్రీనివాస్
9866514972

## నగ్న సత్యం

ఎడతెగని కథల్ని, ఎదలోని వెతల్ని రాసేదెన్నాళ్లని
కలం కదలనంటుంది....గళం మూగదౌతుంది.

అడుగుల గాయాలకు , అలసిన పాదాలకు
అక్షరాలే లేపనంగా ఆవేదన తీర్చాలని,
అమ్మ ప్రేమై పటుశక్తినివ్వాలని,
పదాలతో పాదాలకు పాదుకలల్లి
పారే నెత్తుటి ధారను కలంలో నింపుకున్న.

అందుకే నా కలం రుధిర ధారనే పారిస్తుంది.
ప్రవాహంలో వేగంగా వలసలు సాగాలని,
వాక్యాల వారధి కట్టి, సొంతూర్లకు చేర్చాలని,
తహ తహలాడిన మనసు తలో ముద్ద పెట్టినా
తాపం తీరేనా , తల్లి తండ్లాట తలపుల్లో పోయెనా

ఓ.. తొలిచూలు తల్లికి తోడుగా
తెరచాటైన నలుగురు ప్రసవవేదనల్ని
పక్కకు తప్పిస్తున్నా..నడిరోడ్డు నగ్నసత్యంగా
బారసాల చేసింది బజారు. భవిష్యత్తుకిదే ఖరారు.

రగిలిన జఠరాగ్నినార్ప రాలే మెతుకులు
దొరకని దైన్యం, దీనుల పయనానికి హేతువులు
ఎంగిలి కూడా అంటకుండా పొమ్మంది పట్నం
కష్టాల కడలి ఈదినా, కన్నీళ్ల సంద్రమే తోడైంది.

భరోసా లేని జీవితాల్ని, నెత్తిన మూటలా...
చంకన పిల్లల్ని, తల్లుల్ని మోస్తూ, ఆశల తీరం కోసం
చిరిగిన పాదాలు చీలిన దేహాలు కార్చిన నెత్తురు
తూర్పున సిందూరమై కాల్చుతున్నా.. ఏగుతున్నరు.
ఊరు ఉత్సాహం నింపేనో, ఊపిరి ఉయ్యాలలుపేనో.!

-వి. పద్మ
9951445867

## రాగగీతికలు

కవన సేవను చేయు కవులకు భవిత
దిద్దు భాగ్యము పొంది ధీరులు గాను
నిలిచి వెలుగును నిలుపు నిత్యము భువిన
రమ్య మైనది చూడు రాగ గీతికను,

పసిడి నవ్వుల లోన పసనీత రుచులు
దాగి మనసును ముగ్ధ దయననీదు లోన
నిలిపి మురియనీగ ముదము నిచ్చును భువిన
రమ్య మైనది చూడు రాగగీతికను

నెత్తి పైనను బరువు నిత్యము మోసి
బ్రతుకు బండిని లాగ బలిమేమి లేక
వలస బతుకుల లోన వ్యధలను గనుము
రమ్య మైనది చూడు రాగ గీతికను

రాతి మనిషికి నిండు రాగాలు పంచి
రమ్య భావాలు నింపి రసరమ్య పరచ
జీవ మందక జేసి జీవచ్ఛవనీగ
రమ్య మైనది చూడు రాగగీతికను



-ధనాశి ఉషారాణి
9121096397

## మధ్యతరగతి బతుకులు

ఏమిలేనివాడు
ఎట్లనైన బ్రతుకు
ఉన్నవాడు
ఉన్నట్లు బతుకు...

మధ్యతరగతి వాడా !
నీ బతుకు ఎట్ల?

తాడు తెగి
బావిలో పడ్డ
బొక్కెన బతుకు!

గాలంకు చిక్కుకుని
తల్లడిల్లుతున్న
చేప బతుకు!

శ్రమకు ఫలితంలేక
పొదుపు లేక
అప్పుల పాలైన
బతుకు!

దారం తెగిన
గాలి పటం
బతుకు!

అవసరానికి
వాడుకునే
వారి మాయ మాటలకు
లొంగకు.

దళారులు
విసిరిన పంజాలో
ఆగమాగంకాకు.

తెలివితో
సమస్యలను
ఎదుర్కో... భయపడకు!



-యెల్డి సుదర్శన్
పద్మశాలి ముంబయి
9892411067

## మనిషితనం

ఎన్నాళ్లు లోపలుండి
చీకటిని ప్రేమిస్తారు?
బయటకు వచ్చి
వెలుగునూ ఆస్వాదించండి.

లోపాలు కడగపడి
ద్వీపం తొలుగుతుంది.
దీపాలు వెలుగుతాయి.

పేరుకుపోయిన గర్వం కరిగి
పాచిపెట్టిన అహం తొలగి
పాతుపోయిన గతం మరలి

విస్తరించిన ఒంటరితనంలో
మౌనం ముక్కలై
మనసు మమతల అల్లికతో
గోరంత ప్రేమ చిగురులు వేస్తుంది.

మనిషి సావాసానికి
మనసు ఆవాసానికి
మనిషితనం మచ్చికతో
ముడుచుకు పోతుంది.



-చందలూరి నారాయణరావు
9704427247

## నేనో స్వాప్నికుణ్ణి

త్వరలో....
అఖండభారతం సిద్ధిస్తుందని
మళ్ళీ నాభారతం విశ్వగురువు అవుతుందని
ఈదేశం సకల సంపత్సమేత అవుతుందని
ఇచట ప్రజలంతా సోదరభావంతో మెలగుతారని
కష్టాలు కన్నీళ్ళు లేని రామరాజ్యం
ఇంకెంతో దూరం లేదని
వజ్ర వైఢూర్యాలను రాసులుపోసి అమ్మినట్లు
సుసంపన్నం అవుతుందని
ఆనాటి నలంద తక్షశిలా విశ్వవిద్యాలయాలు
ఈదేశంలో అడుగడుగునా దర్శనమిస్తాయని
కాశ్మీరపు మంచుకొండల్లో
మళ్ళీ శాంతికుసుమాలు కుంకుమపూవులై వర్షిస్తాయని
దేశంలో అడుగడుగున వేదఘోష,
సత్యవాక్కులు వినిపిస్తాయని
ధర్మపాలన ప్రతిచోటా కనిపిస్తుందని
మహిళామణులు సీత దుర్గ సావిత్రుల్లా గౌరవం పొందుతారని

బాలలు భరతునిలా సింహంతో ఆడుకునే
శౌర్యవంతులు అవుతారని
యువకులు శివాజీలా వీరత్వం చూపుతారని
నవరత్నాల్లాంటి కవులు ఉద్భవిస్తారని
సముద్రగుప్తునిలాంటి ఏలికలు
ప్రపంచాన్ని ఏకతాటిపైకి తెస్తారని
ఎందరెందరో ఆర్యభట్టులు ఉదయిస్తారని
రాముడు కృష్ణుడు బుద్ధుడు మళ్ళీ ఉదయిస్తారని
దేశం అఖండమవుతుందని అజేయమవుతుందని
ప్రతిరోజూ కలగనే
నిరంతర స్వాప్నికుణ్ణి నేను.



-రాంనరేష్ కుమార్
9492682285

## మణిపూసలు

హైదరాబాద్ నగరమున
మూసీ దక్షిణ ఒడ్డున
సాలార్ జంగ్ మ్యూజియం
ఉందోయ్ మన అదృష్టమున

పాలరాతి శిల్పాలు
ఏనుగుదంత బొమ్మలు
అమర్చబడియున్నవిచట
లోహ కళాఖండాలు

వర్ణ చిత్రలేఖనాలు
వస్త్రాలు చేతిరాతలు
దేశవిదేశాలలోని
బొమ్మలూ గడియారాలు

ఇస్లాం కళాఖండాలు
ప్రాచీన ఖురాను ప్రతులు
యుద్ధసామగ్రి మరియు
నాణేలు నగ నగిషీలు

కళాసంగ్రహాలయము
సాలార్ జంగ్ మ్యూజియము
మన భారతదేశమున
మూడవది పెద్దదనుము

డెబ్బై ఎనిమిదట గదులు
నలభైవేల వస్తువులు
జాతీయ ప్రాముఖ్యత
కలిగిన కళాఖండాలు

రోజంతా సరిపోవును
ఆశ్చర్యం కలిగించును
జన్మంతా మరువలేని
అనుభూతిని అందించును

ఏనుగుదంతాలు కోసి
నారలాగ పోగుతీసి
సంభ్రమమును కలిగించును
చాపలాగా అల్లేసి

పరదా రెబెక్కా ఉంది
జహంగీరు కత్తి ఉంది
నూర్జహాను పళ్ళకోయు
కత్తికూడ ఇచటయుంది

ముందునుండి పురుషుడిగా
వెనుకనుండి ఒక స్త్రీగా
స్త్రీ పురుష శిల్పమొకటి
వహ్వాయనిపించునుగా

గంటల గడియారమొకటి
దానికదే కదాసాటి
తలుపుతీసి బయటికొచ్చి
గంటకొట్టు బొమ్మయొకటి

భలేభలే మ్యూజియమిది
అనుభూతి చెప్పలేనిది
ప్రతివారూ చూడదగిన
పర్యాటక స్థలమైనది



- గుడిపూడి రాధికారాణి
9494942583

## ఎన్నాళ్ళు...!!

నిశ్శబ్దంగా జీవితం సాగిపోతుంది
బతుకంతా మౌనంగా వెళ్లిపోతుంది
మనోవేదనతో నరకం కనిపిస్తుంది..!!

ముఖంలో దీనత్వము తాండవిస్తుంది
పెదవి పై చిరునవ్వులు కనబడడం లేదు
కుంగిన హృదయానికి స్పందన లేదు..!!

మాటలకు భావం అందడం లేదు
శ్వాసకు గాలి సహకరించదు
కళ్ళు కన్నీళ్లు తోడి పోస్తున్నాయి...!!

మౌనం నోరు విప్పలేదు
చీకటిలోకి విసిరేస్తుంది జ్ఞాపకం
అగాధం కనిపిస్తుంది క్షణక్షణం...!!

చెలరేగుతున్న మనసులో దావాగ్ని
చివరికి మిగిలిపోయిన కాఠిన్యం
ఎన్నాళ్ళు నటించాలి అయిష్టత..!!



-కొప్పుల ప్రసాద్
9885066235

# నాటి కవుల భాషా చమత్కారాలు




వింగడించి చెప్పగలిగే వాళ్ళుండాలిగాని ప్రాచీన, పద్య సాహిత్యం చెరకు రసంకంటే తీపిగా ఉంటుంది. నిన్న మొన్నటి వరకు మన మధ్యన ఉండి,తన పరిశోధనా పటిమతో ఎన్నో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించిన డా॥ కపిలవాయి లింగమూర్తిగారి 78వ సాహితీ పుష్పమిది. స్వర్గీయ లింగమూర్తిగారు ఎన్నో శతకాలు కావ్యాలు, సంకీర్తనలు చరిత్రలు, వ్యాఖ్యానాలు, సంపాదకీయాలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు.

అధ్యాపకుడిగా తాను అప్పుడప్పుడు విద్యార్థులకు వివరించిన సాహిత్య సంఘటనలు, ఆయా రచయితలు తాము గ్రంథాల్ని వెలయించేప్పుడు తారసపడిన,అద్భుత, ఆశ్చర్యకరమైన అనుభవాలు, కొన్ని చాటువులకు ఆసక్తికరమైన నేపథ్యంలాంటివి 16 అధ్యాయాలున్నా మీసంకలనంలో, చాటువు అంటే ప్రియమైన అని మరియు ప్రియోక్తి అని నిఘంటువు అర్థం. 'అప్రయత్న చమత్కారం' అని, అలవోకగా, అశువుగా రావటంచాటువు యొక్క ముఖ్య లక్షణం' అని చల్లా రాధాకృష్ణశర్మ (ఆంధ్రాశాఖాచార్యులు, మదురై కామరాజు విశ్వవిద్యాలయం)గారు అంటారు. హాస్యత, హ్రస్వత, ఒక్కోసారి నర్మగర్భత-చాటువుల లక్షణాలని అంటారు.

నన్నయ, తిక్కన, శ్రీనాధుడు, పోతన, తెనాలి రామకృష్ణ, కవి, ముక్కుతిమ్మన లాంటి సాహితీ దురంధకుల అపురూపఅనుభవాలు, ఈచిన్ని సంకలనంలో పరిమళిస్తున్నాయి.

స్వజాతి వైరం, ఒక కవియెడ మరొక కవికి ఉండే మత్సరము, కొండొక అధికార దుర్వినియోగం, ఆనాడూ ఉండినదని, మొదటి అధ్యాయం'నన్నయను చిన్న బుచ్చిన పద్యం' లో తెలుస్తుంది. యధార్తత పాలు ఎంతో తెలియదు కాని- న్నయలాంటిమహామహుని గ్రంథచౌర్యం' (Plagiarism) తెలుపుతుంది ఈ అధ్యాయం, కవుల 'వామాంగులు' కూడా కవితాస్వాదన చేయగల ప్రతిభగల వారై ఉంటారని తెలుపుతుంది.

'పాండవ మధ్యముడు', 'కుంతీ మధ్యముడు' అన్నా అర్జునుడనుకుంటాం. మొదటి పదానికి అర్జునుడని రెండవ పదానికి భీముడని అర్థసూక్ష్మము.ఎందుకంటే కర్ణుడు కూడా కుంతీ సుతుడే కనుక, మధ్యముడు భీముడవుతాడట!

సామాన్యులైతే ఆలోచించుకుని మాట్లాడుతారు. ఋషుల యెడ వారికి కావల్సిన అర్థమే, భయపడి పరిగెత్తుకుని వస్తుందట వారినోట! (తిక్కనను తిరమక పెట్టిన పద్యం), బమ్మెర పోతనగారి భక్తి పారవశ్యత, నిబద్ధత, లోక విదితము. ఆయన భాగవతములోని 'అల వైకుంఠపురంబులో అనే పద్యాన్ని చివరి సగం సాక్షాత్తూ ఆవైకుంఠవాసుడే పూరించుకున్నాడట! 'శ్రీరాముడు వ్రాసిన పద్యం.

భాగవతములోని గజేంద్ర మోక్షణలో 'సిరికిం జెప్పడు" (అష్టమస్కంధం-96వ పద్యం) అన్న పద్యంలో ఆర్త త్రాణ పరాయణుడైన శ్రీహరి,తన పరివారులెవ్వరినిపిలవకుండానే గజేంద్రుని కాపాడాలని, 'ఉన్నది ఉన్నట్టుగా' పరిగెత్తుకు వచ్చాడని పోతన రాస్తే, ఆక్షేపించిన శ్రీనాధుడికి, పోతన కుమారుడు మల్లన కనువిప్పు కలుగ చేసాడట (శ్రీనాధుని చిక్కుల బెట్టిన పద్యం).

ఈ కాలంలో పొగిడితేనే బహుమానం. కాని శ్రీనాధుడు సింగభూపాలుడనే ప్రభువును 'తెగడి' బహుమానం పొందినాడట (శ్రీనాధుడు తిట్టి బహుమానం తెచ్చుకున్న పద్యం)కవులు ఘటనా ఘటన సమర్ధులని, వికటకవులని (ఎటేపు నుండి చూసినా/ చదివినా ఒకే అర్థం రావటం) వాడుకలో ఉన్న "సర్వజ్ఞ నామధేయము/ శర్వునికే గాక సింగజనపాలునికే!" పద్యపు నేపథ్యాన్ని రచయిత లింగమూర్తిగారు పాఠకులకు మనొల్లాసము కలుగునట్లు రాసారు.

ఆనాటి పసిపిల్లలు కూడా ఎంతటి విద్వత్తు కలిగి ఉండే వారో "నాల్గణాల శ్లోకం"లో రచయిత వివరించారు.

'విషయం' సామాన్యమే అయినా, వివరించే వారి 'బుద్ధి కుశలత' వల్ల అది గొప్పతనాన్ని సంతరించుకుంటుంది.

వివిధ కవుల అనుభవాలువాటికి ఆ కవులు స్పందన స్వర్గీయ డా॥ కపిలవాయిలింగమూర్తిగారు బహుచక్కగా వివరించినారు. సాహితీ ప్రియులు అందరును చదువ వలసిన పుస్తకం ఇది. నిరుటితరం కవుల, కావ్యాలలోని గొప్పతనం వివరించే మెరుపు అవి!

**ప్రతులకు:**
కపిలవాయి సాహిత్య అశోక్
ఇ.నెం. 17-110,
వాణి సదనం
విద్యానగర్ కాలనీ,
నాగర్‌కర్నూల్-509 209
సెల్: 9000185437



- కూర చిదంబరం
సెల్: 8639335675

## ప్రకృతికి కొంత సమయం కేటాయిద్దాం

ఆలోచనలు ఎంతకీ తెగట్లేదు
రోజూ ఉదయం నడకకు వెళ్లే
రహదారే గుర్తొస్తుంది తను నన్ను మొస్తే
నా తనువు స్వేదమై వర్షించేది

రహదారంతా రోజు నన్ను పలకరించి
స్వాగతించి కుశలం అడిగే
చెట్లు పూలు పక్షులు ఇప్పుడు
ఎవరూ కానరాని నిశ్శబ్దరాజ్యంలో

ఏమి చేస్తున్నాయో!
ఎటు చూస్తున్నాయో కదా!
ఇప్పుడు తమలో తామే
పలకరించుకుంటాయా!
పంచతంత్రమ్ లోలాగా
కథలు చెప్పుకుంటాయా!

ఆ ఊహే అందంగా అనిపించింది
మయూరమై నాట్యమాడినట్లుగా
అనిపించింది ఒకసారి వెళ్లి పలకరించి
స్పృశించి ముద్దాడాలని ఉంది

రోజు కనిపించే దృశ్యాలు శబ్దాలు
మేమున్నాం అనే అనవాలుగా

రాత్రి స్వప్నంలో దర్శనమిస్తున్నాయి
అలసి నే సేద తీరిన చెట్టు ఆప్యాయంగా
కౌగిలించుకున్నట్టు
సుమగంధాలతో విరబూసిన పూలు
అక్కున చేర్చుకున్నట్టు
స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న
పక్షులు భుజాలపై
వాలి కుశలం అడిగినట్లు

అంతా బాగుంది నాణేనికి
మరోవైపు చూస్తున్నట్టుంది
ఊహించని అద్భుత ప్రపంచంలోకి
జాలువారినట్టుంది

రోజు యాంత్రికజీవనంలో
పరిగెత్తి సంసారం అనే
జంఝాటంలో పడిపోయి
అనుభూతులు అన్నీ కోల్పోయాము కదా!
ఇదే సరైన సమయం తిరిగి చిగురించటానికి
ప్రకృతికి కొంత సమయం కేటాయిద్దాం

-కోవూరి శ్రీనివాసరావు
9966517046

## ఆత్మహత్యలు

ఎవరికి తెలుసు
చెప్పుకోలేని బాధలుంటాయని
అయ్యో అనేవారు తప్ప
ఒదార్చేవారు కరువని
ఎగతాళి చేసే లోకం
ప్రాణాన్నే పణంగా పెడుతుందని

ఆశనిరాశల ఆరాటంలో
మనలేని జీవన పోరాటంలో
ఒక స్వప్నం చెదిరిన వేళ
అగాధం పిలుస్తుందని
నీటిధార ఆహ్వానం పలుకుతుందని
సముద్రుడు కౌగిలించకోమంటాడని
వృక్షాలు భరోసా ఇస్తాయని
విషం అమృతంలా వుంటుందని
నిద్ర మాత్రలు ముత్యాల్లా మారతాయని
ఎవరికి తెలుసు
ఆత్మన్యూనత ఆత్మహత్యగా
మారుతుందని



పి.విశాలాక్షి
9908435805

## మనసును ఎక్కడో పోగొట్టుకునీ..

అక్కడంతా నిర్మానుష్యం
అది ఏ మృత్యువుల తదనంతరమో
పురాస్మృతుల జాడల కోసం
అక్కడక్కడ కొన్ని యెదల నిట్టూర్పులు.
రెండు వెదురు బొంగుల్ని మోసుకొస్తున్న
బక్క పల్చటి నడి వయస్కుడు
కళ్లను కండువాతో తుడుచుకుంటూ
కడలి వద్దకు కడువతో ఒకడు.
దిగాలు పడ్డ గుమ్మానికి ఎండిపోయిన తోరణాలు
పందిరి కింద నులక మంచంపై
కళ్లజోడు మూడో కాలుతో ఓ ముసలాయన
వెలగని పొయ్యిబూడిదలో పిల్లి పిల్లలు
ఎనగర్రకు వేళ్లాడుతున్న ఉట్టి తాళ్లపై పిట్ట పిల్లలు.
కాలధర్మపు క్రియల్లో
తూలుతూ దు:ఖాన్ని మింగేస్తున్నారు కొందరు
చివరి చూపుకు చుట్టమొకడు వచ్చినట్టుండు
ఏడుపులు పెడబొబ్బలు మళ్లీ షురూ.
చివరి ప్రయాణం మొదలయ్యింది
వాళ్లకు శ్మశానమే లేదక్కడ
ఆరుబైటే అందరూ కేటాయించుకున్నారు.
మంగళవారమట పాడెకు కోడిని కట్టాడొకడు
బుక్కాగులాల్ గోవిందా..గోవిందా..
వరుసైన వాళ్లంతా వరుసలు కట్టారు
మనుషులే నడుస్తున్నారు
మనసును ఎక్కడో పోగొట్టుకుని.
కొన్ని అడుగులు ఊరవతల అడవి
ఎంత ప్రశాంతంగా వుందో..
మానవ మృగాలేవి లేవక్కడ.
నీళ్ల కరువో నిష్ఠ కరువో
ఒళ్లంతా నీళ్లు చల్లుకుంటున్నారు
కన్నీళ్లతో తడిసి ముద్దయిన దేహాన్ని
ఇంకేం తడుపుకుంటారులే..
కొన్ని సత్యాలతో కొన్ని అసత్యాలతో
అక్కడోళ్ల కళ్లల్లో వేదాన్ని నిర్వేదాన్ని పోగేసింది
బతుకుల మధ్య భగ్గుమన్న కాష్ఠం..!

-కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

## సాహితీ అభిలాష

మదిలో భావాలు మెదలగా
సతమత అయ్యెను మనసుత
అక్షరాకృతి దాల్చక కలతి చెందెను
కారణం అన్వేషించ
ప్రయత్న లోపమనిపించె
కలం జోడించె పని కల్పించగ
భావాలకు అక్షరాలు జోడై
సాగెను వడివడిగా కడలి అలలా
కదిలెను బిరాబిరా
పదాలు, వాక్యాలై, కవితలై కావ్యాలై
కథలై చరిత్రలై కనిపించె మదిని పూరిపించె
ఉత్సాహోస్త్రంగా కలం ఆగ సాగెను
ఆగని రైలు బండిలా
రచనలె పుస్తకాలై వెలిసే కుప్పలు కుప్పలుగా
మనసు తేలేను నీలి మేఘమాలై
ఊగేను హాయిగ ఆనంద డోలికలలో
ఊహాలోకం నుండి ఊడి పడగ
కళ్లు తెరచి చూడగ కల అని తేలగా
మనసు చేలయై చెంబేలు పడగ
దిక్కు తోచక మనసు చేసే విలాసాలకు
ఆరగించుకోలేక మానుకోలేక
భగీరథ ప్రయత్నంతో ముందుకు సాగేను
నిర్విరామంగా సాహితి అన్వేషణలో
ఆణిముత్యాలు అగుపడక పోవునా
అని ఆశాకిరణంలా
ప్రతయ్నమే ప్రథమ కర్తవ్యంగా..

-ఎం. శాంతిరావు
సెల్: 7382562179

## విశాఖ..విశాఖ విధిచెంతకు పరుగెత్తకు

విశాఖ.. విశాఖ
ఇప్పుడు మరణమే
మాట్లాడుతుందని
మనిషే నిద్రిస్తుందని
పరుగెత్తకు విధి చెంతకు.

సుందర స్వప్నాలు
సూర్యుడిని మింగుతున్నవని
అలలసప్పుడు వినపడకుండా
ఆకాశం అలారం మరచిందని
నడిచి వెళ్లకు పరలోకానికి

జారిపడ్డ విషం పిడుగు
బీద గుండెను పగులగొట్టే
బిడ్డజాడ చెప్పకుండ
నిషిరాత్రి నీతి మరచిందని
అమ్మ కడుపు విడిచి పెట్టకు

ఆకాశ గంగలో ఆనందం
విరిగిపోయిందని
మౌనాన్ని ముద్దాడి
మాసిపోకు రేపటిని
కనురెప్ప కావలి లేదని
కాటికి కబురు పంపకు!

సుగుణాల జాలరివిత
ఇప్పపూల చుట్టానివి
సంద్రాల సారధివి
కార్ఖానాల ఖాజావి
మిడిసిపడని ఇంద్రానివి
కాలం కల్తీగా మారిందని
భజన చేయకు కుబుసాన్ని!

- జోగు అంజయ్య
సెల్:8008957480

## 'అతడు సల్లంగుండాలె"

అతడు
దేశమంటె మనుషులని
దృఢంగా నమ్మినోడు
తన ఇల్లూ పిల్లల్నిమరిచి
దేశమే తన పిల్లని
ప్రజలందరూ తనపిల్లలని
భావించిన వసుదైక మూర్తి
తన పొట్ట ఎండినా
అందరి పొట్టలు నింపాలని
అహర్నిశలు శ్రమించె
శ్రమైక జీవన సౌందర్యమూర్తి
మట్టిలో తన శరీరం
పొట్టు పొట్టైనా
పట్టువదలని విక్రమార్కుడిలా
రేయింబవళ్ళూ రెక్కలు ముక్కలు చేసుకునే
కృషీవల సార్థక నామధేయుడు
తన వెన్నెముక వెయ్యిముక్కలైన
దేశానికి వెన్నెముకగా నిలిచిన
నిస్వార్థ నిరాడంబర
మానవతా మూర్తియతడు
పైరు పంటల ఆకుపచ్చని చీరకొంగులో
రకరకాల పండ్ల తోటల్ని
రకరకాల పూలతోటల్ని
అన్నిరకాల పప్పుదినుసుల్ని
సమర్పించి
వసుంధరకు వాయినమిచ్చేటోడు!

జై జవాన్, జై కిసాన్
అనే నినాదాల్లో
స్థానం రెండోదే అయినా
జవాన్‌కు సైతం
జవసత్వాలిచ్చే జీవన ప్రధాత!త

ఎలాంటి రాయితీలు
రక్షణ, విలువ, గౌరవాలు
లేకున్నా
వ్యవసాయంలో సహాయమున్నదని
మానవసేవయే మాధవసేవని నమ్మిన
మహోన్నతమూర్తి అతడు
రాజభోగాలు, రాజలాంఛనాలు లేని
రాజుగాని రాజు అతడు
గిట్టుబాటు ధరలేకున్నా
బతుకు పొక్కిలి పొక్కిలైనా
అతన్ని ఎవరూ పట్టించుకోకున్నా
నమ్ముకున్న నేల గట్టుల్ని వీడక
నిరంతరం, చిరంతరం
తరం తరం
దేశం గురించి ఆలోచిస్తూ
అందరికి అన్నంబెట్టి ఆదుకునే
అన్నదాత అతడే
అతడెప్పుడూ
సల్లంగుండాలే!



-డా॥ కూర్మాచలం శంకరస్వామి
సెల్: 7702435110

**నేటినిజం** చందా వివరాలు

ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660 Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

'నేటినిజం' దినపత్రిక, ఎస్ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

## నీ మహిమేనా అంతా

నీలాకాశం నిర్మలమాయె
పుడమితల్లి పులకించిపోయె
నదులలో చిరు అలలసవ్వడి
వనాలలో పక్షుల కిలకిలల
సందడి
ఇంటింటా పిల్లలతో
సరదాల లాహిరి
విరబూసె అనుబంధాలు
వెదజల్లెను ఆత్మీయ
సుగంధాలు
దూరమాయె భారాలు
చేరువైన తీరాలు
జగమంతా కొత్త వింత
జనజీవితాలలో చిగురింత
కరోనా నీ మహిమేగా అంతా



-చయనం అరుణా శర్మ
9550819614

## విజయం

సహనం , ఓర్పు
నీ ఆభరణాలైతే
వివేకం , నేర్పు
నీ అలంకారాలైతే
పట్టుదల ,కృషి
నీ చిరునామా అయితే
ప్రయత్నం , సాహసం
నీ హృదయ స్పందనలైతే
ధైర్యం , విశ్వాసం
నీ ఉచ్వాస , నిశ్వాసాలైతే
విజయం అవుతుంది నీ స్వంతం
ప్రణమిల్లుతుంది ఓటమి అమాంతం

-కయ్యూరు బాలసుబ్రమణ్యం
944179139

## అంతిమ విజయం మనదే...

స్వచ్ఛంద నిర్బంధమే ఆయుధంగా..
నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నాం ...
లోకాన్నంతా శోకసంద్రం చేస్తున్న
కరోనాపై రణభేరి మ్రోగిస్తున్నాం..
గూడు నొదిలి గింజల వేటలో...
దూర తీరాల్లో..
తల్లడిల్లుతున్న వలస పక్షులను చూస్తున్నాం..
అయిన వారి కోసం ఎదురుచూసే..
ఆత్రుతలో మరిగి పోతున్నాం...
ఆహారం దొరకక మాడుతున్న
పేద కడుపులొకవైపు
కోతకు నోచుకోక మగ్గిపోతున్న
పంటలు మరొక వైపు..
మానవత్వాన్ని పంచుతున్న
మమతలు ఇంకొక వైపు...
చిత్ర, విచిత్ర వైపరీత్యాల్ని చూస్తున్నాం..
మా శరీరమే శత్రు స్థావరమై...
సామాజిక దూరమే వరమై.....
మా స్పర్శే మాకు భయానకమై...
చిగురుటాకుల్లా కంపించి పోతున్నాం...
ఊపిరితిత్తులపై దాడి చేసిన వైరస్
ప్రాణాలను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే..
ఏకాంతంగా క్వారంటైన్లలో మగ్గుతున్న
దీనులను దీనంగా చూస్తున్నాం...
అనాథలుగా మరుభూమికి
తరలిపోతున్న అలసిన యోధుల
రోదనలను చూస్తున్నాం..
మా ప్రాణ రక్షణకు సైనికులై పోరాడుతున్న
వైద్య, రక్షక దళాల బలిదానాల్ని చూస్తున్నాం..
క్షణక్షణం అనంత వాయువుల్లో,
కలిసిపోతున్న ఆయువుల్ని లెక్కిస్తున్నాం..
సంకల్పమే మా బలంగా...
దైవ శక్తే మా అందరి అండగా..
విశ్వమానవ శ్రేయస్సే మా ఆశయంగా...
ఆయుధం లేని ఈ యుద్ధంలో...
అంతిమ విజయాన్ని కాంక్షిస్తున్నాం...

-ఆర్.శ్రీవాణీశర్మ
9441324587

## సాగనియ్ ప్రయాణం

భూగోళాన్ని కరోనా మేఘమేదో కమ్మేసింది.
నగ్నంగా ప్రపంచపు అంతర్భాగంలోకి
చొచ్చుకొనిపోయి, నాలుగు దిక్కులకు
ఇరువైపుల మోకరిల్లి, పులి చంపిన
నెత్తుటి వాసనేదో కమ్ముకుంది.
ఒక్కొగీతా చేరిపేస్తూ,
మన బతుకుకు సున్నాగా చుట్టేస్తుంది.
ఒక్కో రేకు తెంచుతూ,
మన జీవితాలను నెలరాలుస్తుంది.
గొంతు పెగలని రాగమేదో ఆలపిస్తున్నట్లు,
ధరణి చుట్టూ, నిశ్శబ్దపు
సంగీతం ఆవరిస్తుంది.
గాయపడ్డ జీవితానికి
ఒకింత దుఃఖాన్ని కడుక్కొని,
నిన్ను నువ్వే మేల్కొల్పుకోని,
నీకు నువ్వే శక్తిని కూడగట్టుకో.
కరోనా గాలి విస్తున్న వడగాల్పులకు,
జీవిత దీపాలను ఆరిపోనివ్వకుండా,
కోరికల పాదరసం అంటని అరచేతులై,
రక్షణ కవచంగా నిలబడు.
కంటి చాటున దాగిన కన్నీటిబొట్టును,
దిగమింగుకొని గుండెనిబ్బరం చేసుకో.
చీకటి ఆవరించిన పొరలను చీల్చుకుంటూ,
నిర్బందపు గీతలను గీసుకొని,
హద్దులు మీరి, నీ హద్దును దాటకుండా
సాగానియ్ నీ జీవిత ప్రయాణాన్ని.



- అశోక్ చిన్నం
7989875763

## గుర్తుకొస్తున్నాయి ...

అదేదో సిన్మాలల్లా సూపించినట్లూ ..
మాది అందమైన పదహారణాల
పల్లెటూరు ...
ఆత్మీయ అనుబంధాలతో సింగారించుకున్న పూలతేరు ..
మమతానురాగాలను ఒల్లెనింపుకున్న
పెద్దముత్తైదువ ...
ఇండ్లు ఇర్కటంగా వున్నా ..
విశాల మనసుల చలువపందిళ్ళు ...
సెమట సుక్కల గంధమే ఇంధనమై ..
బతుకు బండినీ నడిపిస్తున్న శ్రమజీవుల స్వర్గసీమ ..
కంట్లో నలుసుపడినా
కాలికి ముల్లు నాటినా కడుపుల పెట్టుకుని
సూసుకునే పల్లెతల్లి ...
ఆ పల్లె ఒడిలో సేదతీరిన రోజులు ..
జీవితానికీ సరిపడే మధురానుభూతులెన్నో పంచింది ...
కంటికి కనిపించని పురుగేదో ఇప్పుడు గతస్మృతులను కళ్ళముందుంచింది ..
అమ్మమ్మతో ముచ్చట్లు తాతయ్య చెప్పిన కథలు
అమ్మనాన్నల జీవన అగచాట్లు
దోస్తులతో ఆడిపాడిన పోట్లాటల అనుభూతులు
లీలగా కదలాడుచున్నవి ఒక్కొక్కటి దృశ్యాదృశ్యంగా ..
కోపావేశాలను ప్రేమామృతాన్ని
కుండబద్దలుగొట్టినట్లుగా అక్కడికక్కడే ఒలకబోసుకునేవాళ్ళం ..
మాటల్లో చక్కెర్లుండేవి కావు .
కడుపులో కత్తెర్లసలేలేవు
ఉన్నప్పుడు లేనప్పుడు
ఒక్కతీర్గనే బతికినోళ్ళం ..
వరిబువ్వో చింతతొక్కో కలో గంజో కలివిడిగా కూర్చొని
ప్రేమగా వడ్డించుకునేవాళ్ళం ..
పదార్థాలకంటే పలు ఆత్మీయ మాటలే మాకడుపు నిండేవి .
ఆ ..తీపిగుర్తుల జాడ నేడు కనబడదేంది ...
ఆ ..ఆత్మీయ మాటల మూటలనుఎవరెత్తుకెళ్ళారు ..
పల్లెతల్లిని విడిచి పట్నం ముంగిట వలస పక్షులమయ్యాం .
పొద్దస్తమానం విత్తానికై నిత్యపోరాటమే తప్ప ..
కుటుంబంతో గడిపే అవకాశమేది ..
అలసిన దేహాలను ఇంటి గూట్లో అలంకరించుకోవడమే తప్ప ..
మనసువిప్పి మాట్లాడుకునే
సందర్భమేది ..
మెర్క్యూరి నవ్వులు పాదరసపు నడకలే తప్ప ..
కడిగిన ముత్యంలా కన్పించే మనుషులేరి ..
ఓ సినీ కవియన్నట్లుగా "జగమంత కుటుంబం నాది ఏకాకి జీవితం నాది "
యన్నది నిజమే కాబోలు ..
కంటికి కనిపించని కరోన ప్రపంచపటంపై ఏ ముహూర్తాన కాలుమోపిందో కానీ ..
మానవ జీవన ముఖచిత్రం మారింది ...
గరీబ్ నైనా షరాబ్ నైనా
తన కనుసైగతో శాసించి గడప దాటకుండ దడ పుట్టించింది ..
ఇల్లును మించిన స్వర్గసీమ ఇలలో లేదని గుర్తింపచేసి
వడ్డించిన విస్తరాలాకుటుంబాన్ని
నిండుగా కళకళలాడించింది .
చెల్లాచెదురైన మమతలను ఆత్మీయ లతలతో అల్లి
జీవన మాధుర్య సుస్వరాలను ఆస్వాదింపచేసింది ..
పోగొట్టుకున్న కుటుంబ విలువల ఆణిముత్యాలను
పోగేసి అనుబంధాలతో బంధించింది ..
పల్లెతల్లి అందించిన అపాతమధురానుభూతులను మరొక్కసారీ గుర్తుచేసి ..
గుండె కొలనులో జలతారు పుష్పాలను వికసింపచేసింది .

-డా.బాదేపల్లి వెంకటయ్యగౌడ్
9948508939

## చేతులెత్తేశారు....!

ఎన్నాళ్ళని కాపలా ?
ఇన్నాళ్ళని తెలీదుగా !

మునివేళ్లపై నడచిన
పాదాలిప్పుడు
అరికాళ్ళనాంచి పరిగెడుతున్నాయి
తిమ్మిరులెక్కిన కాళ్ళను విదిలుంచుకుంటూ.

బిక్కుబిక్కుమంటూ చూసిన కళ్ళిప్పుడు
కొత్త వెలుగును వెతుకుతున్నాయి
నిద్రావస్థనుండి మేల్కొన్న మిణుగురుల్లా.

గూటిలో
ఇష్టంగానో అయిష్టంగానో
ఇన్నాళ్లు ముడుక్కున్న రెక్కలిప్పుడు
రివ్వురివ్వున ఎగిరెగిరిపోతున్నాయి
బంధించబడ్డ పంజరాల్లోంచి
విడిచిపెట్టిన విహంగాల్లా.

తప్పదుమరి
ఎన్నాళ్ళు కట్టడి చెయ్యగలరెవరైనా
ఫలానా రోజులని తెలిస్తేగా?

తొలిదినాల్లో అతిస్వల్ప అవస్థల్లోనున్న
ఓపికలిప్పుడు
క్రిమి విస్తారంగా వ్యాపిస్తున్నరోతజు
పట్టు సడలిపోతున్నాయి.

ఎవరి జీవితాల్ని
వారి చేతుల్లో పెట్టేశారు మరి
చేతులు కడుక్కుంటారో?
కాల్చుకుంటారో !.

తొలుతనున్న భయాందోళనలకి
తిలోదాకాలిచ్చేశారు జనం
నిర్భయంగా సంతలో మందల్లా
రాసుకుంటూ పూసుకుంటూ
తిరిగేస్తున్నారు నిబంధనలు విదిల్చి.

జీవితఖైదు నుండి విడుదలైన
బందీల్లా రొమ్ములు విరచి నడుస్తున్నారు

వచ్చిన చక్కని మార్పును మరచి
ఆ మార్పును పెనుముప్పు ఉప్పెనలై
ముంచేస్తాయని తెలిసీ
అజ్ఞానపు మత్తులో మైమరచి
కలికాలం హద్దులు దాటుకుని
కలిదాహపు వరదకు
బలైపోతున్నామని తెలియని
కొత్తగొచ్చిన వింతలోకంలో
విహరించేస్తున్నారు.

చేతులెత్తేశారందరూ
అది పాలకులైనా ! ప్రజలైనా !
బరువును గుండెమీంచి దింపుకున్నట్టుగా
మళ్లీ పాతరోజుల్ని వెతుక్కుంటూ
ఉన్న జబ్బుల్లో ఇదీ ఒకభాగంగా
చేర్చుకుని బ్రతికిపోవాలనే
నస్పష్టమైన సందిగ్ధావస్థతో....!



-నాగముని. యం
9490856185

## కరోన వైఖరి!

అవమానింపబడ్డ నా సంస్కృతియే
అసలైందని ఋజువైంది
నిందలను బరించిన ఆచారాలే
నిజాలని తేటతెల్లమైంది
పాతచింతకాయ పచ్చడులే
నేడు పరమాన్నాలైనాయి
తాతలనాటి సంప్రదాయాలే
తలమానికమని స్పష్టమైనాయి
ఇదికాలం ఇచ్చిన తీర్పు
ప్రగతికోసమే ఈ మార్పు
పోయినదంతా పొల్లేనని
చేసిందంతా కుళ్ళేనని
ఒకింత నిట్టూర్పులు విడిచినా
రేపటి తరానికి కొత్త మేలుకొలుపును పాడాలంటే
చరిత్రలో కత్త పేజీకీ
శ్రీకారం చుట్టవలసిందే
ఏ దుర్మార్గపు మేధస్సులు పుట్టిన
విషవలయమో
నరరూపరాక్షసుల ఆంక్షలను
నెరవేర్చినమాయా జాలమో కానీ
కరోనా..!
నువ్వుమాపై చూపించింది
మాపైన ఒకింత కరుణనే అని చెప్పాలి
నిజాలను కాస్త విప్పాలి
బ్రతుకంటే ఎంత అప్రమత్తతనో
జీవితమంటే ఎంత విలువైనదో
చావంటే ఎంత భయంకరమో
చిరవకు మనిషికి మిగిలేదేమిటో
నీ వైఖరివల్లనే కొంత స్పష్టమైంది
ఇది మా మంచి కోసమేనని ఆశిస్తాం
నువ్వింతటితో వెనుదిరిగిపోతే సంతోషిస్తాం!



- సుప్పని సత్యనారాయణ
సెల్: 9492626910

## పట్టాలపై పాదయాత్ర

కరోనా...?
ఎంతటి దౌర్భాగ్య స్థితి తెచ్చావే ?
పొట్టకూటి కోసం
వలస కూలీలుగా వచ్చినవారు
బతక లేక
మూటముల్లే సదురుకోని
సంకలల్ల బిడ్డల్ని ఎత్తుకొని
సక్కగా రైలు పట్టాలెంబడి
పాదయాత్ర చేసుకుంటూ
వాళ్ళ రాష్ట్రాలకు బోతుండ్లు !

కలో గంజో తాగి
ఈడనే వుందా మనుకుంటే
కరోనా గజ్జున వణికిస్తుండే..
కరుణించే జాడలు లేక
ఆకలికి తట్టుకో లేక
ఉన్నఊరే ఉత్తమమని
నడకను నమ్ముకోబట్టే !

నడక సాగితే మంచిదే
కానీ..!
ఓ పక్క మూటలు
మరో పక్క
అల్లరిచేసే తూటలు
గంటెత్తు కుంటనే
గుంజిసత్తది చేయి
ఇప్పుడు...
ఎన్ని గంటలైతాందో మోయబట్టి !

కరోనా...ఉన్నకాదుండక
చైనా నుంచి ఉరికి వత్తివి
వచ్చిందానివి ఓ మూలనుండక
లోకాన్ని చుట్టేస్థివిఅంతటితో ఆగితివా..?
పాణాలు తీసుకుంట
పరిహాస మాడుతాంటివి !

ఇంకెన్ని రోజులు
నీ ఆటలు కరోనా..?
ఓ మందు , సూదో వచ్చేవరకే
" నవ్విన నాపచేను పండదన్నట్లు "
నిన్ను చంపే టైం దగ్గర్లనే వుంది !!

మా వలస కూలీల
పాదాలకు విశ్రాంతి టైం
అతి దగ్గరలోనే వుంది !!



-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762.

## కరోనా..పంచ రత్నాలు??

ఇష్టరీతిమనిషి:ఇచ్చ పనులు
పాపమనక జేసె:పాడుబుద్ధి!
సూక్ష్మజీవివలన:సోకమొందెఁ
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!

చెట్లునరికి మనిషి:చేటు జేసె
తల్లిభూమియెంత:తాపమొందె!
భవిత తెలియఁనరుడు వానరుండు

అవని తనను తాను రక్ష చేయ
పుట్టు కొచ్చె జీవి పుడమి నుండి
జాతినంత ముంచ : జాడ్యమవలె
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!

కక్ష గట్టి వచ్చె:కరడు జీవి
అడుగుబెట్టెకాద:అవనియందు
చంపిపంపుచుండె:చల్లగాను!
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు,,!

గూడు వదలిగుమ్మి:గూడవలదు
కరొన తోడ కలదు: కడుభయంబు
జాగుచేయబోకు జరతెలుసుకొ !
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!

రైలుబండివచ్చె:రయ్యినొచ్చె
వలసజీవికింక:వనరు లేక
బండినందె పరుగు పరుగుతోడ
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!

వలస వచ్చి దిక్కు :కానకంత
ఊరు కాని చోట: గూడు లేని
పేదరికము జూడ:పేగుబాధ
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!

సొంత గూటి వలచి పోరు సలిపి
లాకు డౌను తీసె :రద్ది పెరిగి
జబ్బువదలనంటు జగతిజనులఁ
సునితవాక్కులెపుడు:శుభమునిచ్చు..!
పేద జీవికింక: పెరిగె ఆశ
లాకు డౌను మెల్లగాను సడల
కరొన అంటకుండ :పదిలముండు
సున్నితంబునిజము:సునిత పల్కు!!

తమ ఊరు చేర :తగని పాట్లు
లాకు డౌను లోన యన్ని మూత
కరొన తోడ ముక్తి వచ్చుటెపుడు..!
సున్నితంబునిజము:సునిత పల్కు!

గుంపునసలు గుమియు :గూడవలదు
కరొన తోడ కలదు: కఠిన హాని
తీసి చంపుచుండె:తీరుజూడ..!
సున్నితంబునిజము:సునిత పల్కు.!

నరుని చేత చిక్కు:సమయమొచ్చు
కరొన తోడ చేయు:ఆన మేము
జీవి మూడు రోజు: వచ్చు నిపుడు
సున్నితంబునిజము:సునిత పల్కు..!

వలస జీవి బతుకు :వడిదుడుకున
పని లేక వారు: పస్తు తోడ
కరొన తెచ్చె వింత సమయమిదియు
సున్నితంబునిజము:సునిత పల్కు!!

కరుణజాలి లేని:కఠిన కరొన
పుడమిజనులజంపు:పూనికాయె
సూక్ష్మజీవి నీకు:సిగ్గు లేదె
సున్నితంబునిజము:సునిత పల్కు..!

మాయ దారి దొచ్చె:మనుషు లతిన
కదలి క లిల లేని:కబళ జీవి!
కరుణ జాలి రహిత:కఠిన రక్కసి
సున్నితంబునిజము:సునిత పల్కు!!

బయటతిరగ వలదు కరొన వేళ
ఆప్తమిత్రులమాట:అరయబలము
సూక్ష్మజీవితినును:సూటిగాను
సున్నితంబునిజము:సునితపల్కు!

గుంపు కూడ వలదు:గూడి యంత
పేద రాజు యనెడి:తేడ లేక
తిరుగ వద్దుజనత:మితియు మీరి
సున్నితంబునిజము:సునీతపల్కు!

పుడమి యంత దీని:ముప్పు చేత
ఇక కరోన తోడ:బ్రతుకు టెట్లు?
మాన సికమె బలము:జగతి లోన
సున్నితంబునిజము:సునిత పల్కు!

కదన రంగ మాయె:సమగ్ర జాతి
వింత జీవి చేసె ,విషపుదాడి
ఎన్నివచ్చిపోగ:వెలుగు జాతి
సున్నితంబునిజము:సునిత పల్కు!

సూక్ష్మజీవియనియు:సులువు చెసిన
దాడిజేసి జంపు:దయనులేక
మేనునిండ కనుల:మేలుకొనర!
సున్నితంబు నిజము:సునిత పల్కు.!

కాలకూటవిషము:కద్పునుంచి
కాలుమోపెజీవి :కఠినరీతి
విశ్వమందుజనుల:విరివి జంపె
సున్నితంబునిజము:సునితపల్కు!

మనుజజాతియంత:మరణ భీతి
కంటి మీద కునుకు:మంట కలిపె
పారదోలలేరా:పాడు క్రిమిని
సున్నితంబునిజము:సునితపల్కు!



-సునీత బండారు
9440671530

## మరణం

అయితే ఆకలి
కాకుంటే కరోనా
చావయితే తథ్యం
ప్రస్తుత పరిస్థితి

ఎవరి పాపమంటే
ఏం చెబుదాం
భాద్యులెవరంటే
ఎవరిని చేద్దాం

పుట్టడమేం ఖర్మ
జీవించే హక్కు
నాకు ఉందని కరోనా వాదిస్తే
భుజాలు తడుముకోవాల్సిందే

కరువొచ్చినట్టు
కనబడ్డదానల్ల కబళిస్తే
కళ్లముందు కనబడేదే
సదృశ్యమని సర్దుకోవాల్సిందే

అయినా
ఎన్ని ఆటు-పోట్లు ఎదుర్కోలేదు
ఎన్నెన్ని రోగాలను తరిమేయలేదు
ధనాత్మక దృక్పథం
రణమంటె వెరవని మనిషి
విజయబావుటా ఎగరేసేదాక
వెనుదిరగడనే ఆశిద్దాం

-డా॥ పాక వెంకటేశ్వర్లు
9849436891

## ప్రణామం

చరిత్రకే ఆణిముత్యమా !
సృష్టికే ఆరాధ్య దైవమా!
ధరణిలో మానవత్వ ప్రతిరూపమా!
దైవత్వం ధరించిన మనిషి రూపమా !
వైద్యుడా ! ఓ వైద్యుడా !
ప్రణామం ప్రణామం నీ సేవకు !
ప్రణామం ప్రణామం నీ తెగువకు !!

నీ తోడుదే కదా జననం
నిన్ను దాటితేనే కదా మరణం
కనిపించని యుద్ధంలో
కనిపించే ధైర్యం
కమ్ముకున్న కరోనా
చీకటిని చీల్చే దీపం
నువ్వే కదా ప్రత్యక్ష దైవం

ముప్పు నిన్నే తాకుతున్న
నిప్పు కణికవై లేచి
ఉక్కు పిడికిలి బిగించి
తెల్ల కోటు ధరించావు
ఓర్పుతోనే నేర్పుగా
సమరం సాగిస్తున్నావు

ఇంటికి నువ్వు దూరమైనా
కంటికి కునుకు భారమైనా
రక్షణ కవచాలే ప్రతి బంధాలై
నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా
ప్రాణ దాతవై ఊపిరి పోస్తూ
ప్రజా సేవకుడివై వైద్యం చేస్తున్నావు

ఒత్తిళ్ళు సవాలు విసిరినా
సహనం,సాహసం నీ ఆయుధాలై
పోలీసులు,సఫాయిలు రక్షణ దళమై
వైద్యాలయ సిబ్బంది నీ సైనికులై
కనిపించని శతృవుతో
కలబడి యుద్ధం చేస్తున్నావు

పేగును పంచిన తల్లిని మించిన
ప్రేమను మాకు పంచావు
తోడబుట్టక పోయినా
తోడుగా నిలిచావు
పంచుకు పుట్టలేదు మా రక్తం
చిందించావు మా కోసం నీ రక్తం
మరువదు నిన్ను ఈ లోకం
చెరగదు ఎన్నటికి నీ త్యాగం
ప్రణామం ప్రణామం నీ సేవకు !
ప్రణామం ప్రణామం నీ తెగువకు !!

-డా.రానవేయిన రమేష్,
9849294694

## దానికేం తెలుసు...

భరతమాత శ్వాసలో
మృత్యువును నింపడానికి...
విమానం దిగి,
ప్రతి భారతీయుడి గుండెపై కాలుమోపింది ఓ మహమ్మారి...

తనని సాదరంగా స్వాగతించి
ఆతిధ్యమివ్వడానికి నిరాకరించమనే కోపం కాబోలు
రెక్కల కింద దాచుకున్న ప్రాణాల్ని పిప్పిచేయడానికి
దేశం యొక్క దేహంపై
అనుక్షణం దాడికి పాల్పడుతూనే ఉంది...

చాపకింద నీరులా మెల్లగా చొరబడి
కాపు వలయం చుట2ట్టా ప్రమాద అలజడులను సృష్టిస్తూ
రక్షణగా ఉన్న ఒక్కో కవచాన్ని మింగుతోంది

బహుషా!
మనం పెట్టె చిత్రహింసలను తాళలేకపోతున్న ప్రకృతి మనపై ప్రతియుద్ధం ప్రకటించి
కరుణలేని కరోనా అస్త్రాన్ని ప్రయోగించింది కాబోలు..

ధైర్యానికి కూడా భయాన్ని నేర్పుతూ
సువిశాల విశ్వాన్ని సూన్యం లోకి నెట్టుతూ
విచ్చలవిడిగా తిరుగాడుతోన్న స్వేచ్ఛకు సంకెళ్లను బిగించి
నాలుగు గోడల మధ్య బంధించి
కాలంతోపాటు కనుమరుగవుతోన్న పచ్చదనానికి పురుడు పోస్తూ
నవనాగరికతపై యమపాశం విసురుతూ
జీవచ్ఛమవుతోన్న పర్యావరణానికి ప్రాణవాయువునందిస్తోంది..

అయినా!
దానికేం తెలుసు...
తను సృష్టించిన కల్లోలాలు క్షణకాలమేనని!
కోవిడ్ కి మానవుడి జ్ఞానానికి జరిగే ఈ కురుక్షేత్ర సంగ్రామంలో
ప్రకృతిపై ప్రపంచానిదే పై చేయి అవుతుందని...

-కొండా శిరీష
6300396530.

## కరోనా పద్యాలు



-ఉంద్రాళ్ళ రాజేశం
9966946084

కదలలేని జనుల పదునుతో వైద్యులు
మాట ముచ్చటించి మాయజేసి
మదిన చింతబాపి మామూలు మనిషిగా
యింట చేర్చుతాడు యింపుగాను

రోగమెంతవున్న రూపాయలెన్నున్న
ప్రాణ మిచ్చువాడు ప్రాణదాత
చావు కోరనుంచి జనులను కాపాడు
దైవమూర్తి తాను ధరణినందు

జనము గూర్చి నడుచు జర్నలిస్టు కదిలి
ప్రాణభయము వదిలి వార్త తెలిపి
ఆటుపోట్లు వున్న యగ్రజులైనారు
జనము మెచ్చువారు జర్నలిస్టు

మూతికంత మాస్కు చేతుల గ్లౌజులు1
తమ్ముతుండ చాలు దూరమనిరి
సరుకు తీసుకొచ్చి శానిటైజరు వాడి
చేతులన్ని కడుగు చిత్రమాయె

ధనిక పేద మరిచి దండాలు మేలంటు
హాయి హాలో మాట నాపినారు
దూరదూరమంటు దొరకక తిరుగుతూ
పట్టుకున్న వచ్చు ముట్టకనిరి

దారులందు వున్న దండిగా జనులకు
బువ్వ పెట్టుతుండ్రి సేవపరులు
పనిని గట్టుకుని పాడు కరోనాను
పాత రెస్తమనిరి పల్లెజనులు

సగము జీతమిచ్చె సర్కారు కొలువుకు
ఎన్నడెరుగ లేదు యింతవింత
ధనిక రాష్ట్రమంటు దండిగా పేరొంది
కపట ప్రేమ చూడు కరుణలేక

ఒకటి రెండు మూడు యింతింత పెరుగుతూ
భయము చూపుతుంది భారతాన
బందు యెంతవున్న బయటి దేశాలొల్ల
గుట్టు విప్పుతుండె బెట్టుగాను

బయట దేశమంటు వచ్చి తెలంగాణ
చిక్కుకున్న వారి చిట్టవిప్పి
కదలకుండ చేసి క్వారెంటెయిన్ నందు
వుంచినారు బాగు వుత్తమముగ

రెండు రోజులన కరీంనగరమునందు
కదిలినట్టి వ్యాధి కంటపడగ
ఇల్లు యిల్లు తిరిగి యిండోనెషియనులు
ముప్పు తెచ్చిననిరి ముదముగాను

పోరుగడ్డ వణికి పోవుతుండ గదరా
పాప మెరుగనట్టి ప్రజలమంటు
ముప్పు జూసి వగసి ముంగిలి దాటక
కష్ట పడుతువుండ్రి యిష్టముగను

దేశమంత కదిలి పాశానము నొదిలి
యముడు చంపుతుండు యడ్డులేక
మొదట తగ్గుముఖము మురియ ఘడియ కాలె
ముచ్చటించ వ్యాధి ముసురుతుంది

ముఖ్యమంత్రి కదిలి ముఖ్యుల పిలిపించి
కట్టు దిట్టమనెను కఠినముగను
గీత గీసినట్టి కెసిఆర్ పిలుపునకు
రాష్ట్రమంత కదిలె రయమునను

రామచంద్రుడైన రాజేందర్ మంత్రిగా
అంటు వ్యాధి వదల వెంటనడిచె
సాయ మడగకున్న సయ్యానా కెటిఆర్ యే
ఆజ్ఞ వేయుచుండు నాచరించి

గల్లి గల్లి తిరిగి పల్లె పట్నము చేరి
శుద్ధి చేయ తలచి బుద్ధిచెప్పి
తాను ముందు నడిచి తన్నీరు హరిషుందు
కంటనీరు బాపె కార్యమందు

బాధ తొలగెనంటు బాధ్యతలందుండి
మైకులందు నిలిచి మాటలాడి
కొద్ది రోజులందు పెద్దగా విజయంబు
పొందినాము యనిరి పొగుడుకుంట

పరుగు పెట్టి కదిలి మర్కజ్ కలయికతో
ఉల్కి పడ్డదంత పలుకులేక
వేలమంది నిలిచి విడిదిగా వుండిరి
వ్యాధి వ్యాప్తి చెంద వగచినారు

మతము పేరుతోని మహ్మదీయులకంత
వ్యాధి సోకినాది వడివడిగను
దేశమంత వారు తిరిగిన చోటంత
ప్రభలుతుంది నేడు పాడువ్యాధి

కష్టముచ్చెనంటు కదిలిరి పోలీసు
పట్టు కెళ్ళినారు పరిధిలోకి
కదల లోల్లి జేసి క్వారెంటిను తరల
గాయిగాయి జేసె గడుసువారు

యింట వుండుమంటు ఇరవై ఒక్క దినము
రాష్ట్ర హద్దులన్ని రాళ్ళునింపి
రాకపోక బందు రాకండి జనులార
ఉన్నకాడ నిలువు ఉత్తమముగ

కూరగాయ కొరకు కొట్లాట వద్దని
వాడవాడలందు జాడజూపి
మందు గోలి కొనుట మహనీయ వెళ్ళంటే
పొద్దు మాపు తిరుగ పోటిపడిరి

ఇంటికొకరు గాను వెళ్ళండి సరుకులు
డబ్బడబ్బ జరుగు జబ్బు వుంది
గుంపు గుంపు తరలి ముప్పుతేకండిరా
మారకున్న ఎట్ల మనుషులేన

అన్ని వసతులున్న అమెరికా దేశంబు
నెత్తి కొట్టుకుంది నిలువజాల
లక్షలాది జనులు శిక్షగా మరణాలు
తప్పవంటు పలికె తంత్రి ట్రంపు

రాజు రాణి మంత్రి రాజ్యము నెవ్వరూ
ఎదురు నిల్చుతున్న వెంబడించు
యింట నిలువనట్టి ఇంగ్లండ్ ప్రధానియే
రోగ బారి నొంది రోధనొందె

దేశ దేశమందు దిక్కరిల్లెను చావు
అంధకారమందు నలమటించి
మందు మాకు లేక మహినంత కేకలు
ఆపతరము గాద అగ్రజులకు

మురికి కూపమున్న ముంబాయి విలవిల
డిల్లినందు జేరి లోలి పుట్టె
తమిళనాట కూడ తాండవమాడుతూ
దేశమంత కదిలి తిరిగినాది

ఎవరి కంట పడక వేడి జ్వరము పంచి
మొఖము నందు బుగ్గ మోగుతుండు
వ్యాధివున్న పట్టి వ్యక్తుల చూపించు
యంత్రమున్న చోట నాగుతుంది

దాతలంత వచ్చి దండిగా విరాళాలు
ఇచ్చుతుండ్రి చాల వేగిరమున
ఆర్థికాన లోటు ఆలోచనలు మాని
పప్పు బియ్యముప్పు పంపినారు

కూలి నాలి మాని కూర్చున్న బీధలు
చౌక ధరలయందు సరుకుతెచ్చి
పూట గడుపుతుండ్రి పూరి గుడిసెనందు
పనులు మరిచినట్టి పల్లెవాసి

పించ నిచ్చినారు పిలుచుకుంట కలిసి
రాష్ట్ర మేదియైన కష్టమనక
బీధలెందరున్న బాధ్యత మాదంటూ
పంచుతుండ్రి నిజము పండు ఫలము

దేశభక్తి చాట దీపాలు వెలిగించి
దైర్య మిచ్చినారు ధరణి సుతులు
తొమ్మిదైన వేళ తొమ్మిది నిమిషాలు
జ్యోతి వెలుగుతుంది ఖ్యాతిపెంచ

భారతాన చూడు భవ్య చరిత్రను
నిండు పున్నమల్లె వెండికాంతి
అందరేకమౌతు ఐక్యతా రాగమై
స్ఫూర్తి నింపినారు కీర్తినొంద

జ్ఞాపకాలు జులై 8



జులై 8, 2015న ఎర్రగడ్డలోని రాయల్ హాల్‌లో 10 మంది కవుల 'రెక్కల ప్రస్థానం' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో పెద్దూరి వెంకటదాసు, ఇసనాక మురళీధర్, హస్మంతరావు, గూడూరు చెన్నారెడ్డి, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ తిరునగరి, యం.కె.సుగమ్‌బాబు, మల్లాది విజయలక్ష్మి, గూడూరు విజయలక్ష్మి.



సభలో ప్రసంగిస్తున్న నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

జ్ఞాపకాలు జులై 9



జులై 9,2013న మంగళవారం విశ్వసాహితి, త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో కళా సుబ్బారావు కళా వేదికపై శిష్ట్లా మాధవి రచించిన 'మాతృభాషా వైభవం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న 'నేటినిజం' సంపాదకులు బైస దేవదాసు. వేదికపై డా॥ పులిగడ్డ విజయలక్ష్మి, శిష్ట్లా మాధవి, ఆచార్య జయరాములు, డా॥ పోతుకూచి సాంబశివరావు డా॥ ద్వా.నా.శాస్త్రి, సినీ దర్శకుడు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, డా॥కళావేంకట దీక్షితులు.



సభలో ప్రసంగిస్తున్న డా॥పోతుకూచి సాంబశివరావు.

జ్ఞాపకాలు జులై 10



జులై 10, 2013న బుధవారం స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆచార్య అనుమాండ్ల భూమయ్యగారు రచించిన 'తెలంగాణ భావ విపంచిక' గొల్కొండ కవుల సంచిక ఆవిష్కరణ సభలో డా॥ గంటా జలంధర్‌రెడ్డి, బైస దేవదాసు, డా॥ నందిని సిధారెడ్డి, రచయిత ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆవిష్కర్త డా॥ పాలకుర్తి మధుసూదన రావు, డా॥ అమ్మంగి వేణుగోపాల్, గున్న రాజేందర్ రెడ్డి, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ ఆర్. దిలీప్‌రెడ్డి, డా॥ తిరునగరి.



జులై 10, 2019న త్యాగరాయ గాన సభలో సిలువేరు సుదర్శన్ 75వ జన్మదిన 'వజ్రోత్సవ' సభలో 'జ్ఞాన పదం' ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో సాధన నర్సింహచారి, శ్రీమతి అన్నంగి వేంకటలక్ష్మి, సుధామ,డా॥ చిల్లర భవానీదేవి, ఆవిష్కర్త తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణ, డా॥ హనుమాన్ చౌదరి, పి.వి.మనోహరరావు, సిలువేరు సుదర్శన్ దంపతులు, బైస దేవదాసు.

జ్ఞాపకాలు జులై 11



జులై 11, 2016న త్యాగరాయ గానసభలో ఆచార్య ఎన్.గోపి రాసిన "ఓ కవి స్వీయ కథ" గ్రంథావిష్కరణలో డా॥పోరెడ్డి రంగయ్య, విహారి, ఆచార్య ఎన్.గోపి, ఆవిష్కర్త డా॥సి. వసుందరారెడ్డి, డా॥పత్తిపాక మోహన్, బైస దేవదాసు.



జులై 11, 2016న త్యాగరాయ గానసభలో డా॥ ఎన్.గోపి రాసిన "ఓ కవి స్వీయ కథ"ను నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు అంకితం ఇస్తున్న ఆచార్య ఎన్.గోపి. వేదికపై విహారి,డా॥సి. వసుందరారెడ్డి, డా॥పత్తిపాక మోహన్, డా॥కె.వి. దీక్షితులు, డా॥ పోరెడ్డి రంగయ్య,

జులై 11 & 12 జ్ఞాపకాలు



జులై 11, 1993లో ఒక సభలో రాష్ట్ర సమాచార శాఖమంత్రి డి. శ్రీనివాస్‌తో బైస దేవదాసు.



జులై 12, 2013న త్యాగరాయ గానసభలో శ్రీ కిరణ్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఏకా పద్మ స్మృత్యర్థం బి.టెక్ విద్యార్థిని అనూష ప్రతినిధికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎ. వెంకట్రావు, బైస దేవదాసు. వేదికపై డా॥ ముక్తేవి భారతి, ఏకా నాగరాజు రామమోహనరావు.

జ్ఞాపకాలు జులై 13



జులై 13, 2014న త్యాగరాయ గానసభలో విశ్వసాహితి నిర్వహించిన సభలో టి.సరోజ రచన "తీరం చేరని కెరటాన్ని" కథల సంపుటి ఆవిష్కరణలో కె. సత్యమూర్తి, టి. సరోజ, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥పోతుకూచి సాంబశివరావు, డా॥ వేదగారి రాంబాబు, డా॥జి. సీత, జి. పద్మావతి.



జులై 13, 2014న విశ్వసాహితి నిర్వహించిన సభలో శ్రీమతి జి. పద్మావతికి ఎ.ఆర్.కృష్ణ అవార్డును ప్రదానం చేస్తున్న బైస దేవదాసు. వేదికపై టి.సరోజ, డా॥పోతుకూచి సాంబశివరావు, డా॥ జి. సీత.

జ్ఞాపకాలు జులై 14



జులై 14, 2007న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి ఆనం వివేకానందరెడ్డిని కలిసిన చిన్న, మధ్య తరహా దిన పత్రికల అసోసియేషన్ అధ్యక్షులు కె. యస్. రంగసాయి, ఉపాధ్యక్షులు వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి బైస దేవదాసు.



జులై 14, 2019న త్యాగరాయ గానసభలో జరిగిన ఒక సభలో ఆచార్య టి. గౌరీశంకర్, కవి,విమర్శకులు రమణ వెలమకన్ని, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు.

జ్ఞాపకాలు జులై 15



జులై 15, 2017న కళాలలిత కళావేదికలో "రెక్కల పందిరిలో భజగోవిందం" గ్రంథావిష్కరణలో రఘుశ్రీ, యం.కె. సుగమ్‌బాబు, బైస దేవదాసు, రచయిత యం.రాధాకృష్ణ, ఆవిష్కర్త డా॥కేవీ రమణాచారి, డా॥ మసన చెన్నప్ప, కె.జె. మూర్తి, డా॥ తిరునగరి, రమణ వెలమకన్ని, పి.వి.దాసు.



జులై 15, 2017న "రెక్కల పందిరిలో భజగోవిందం" పుస్తకావిష్కరణ సభలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి, రచయిత యం.రాధాకృష్ణ, రఘుశ్రీ.

# చైనా ప్రపంచాన్ని మోసం చేసింది

## దానితో మాట్లాడే అవసరం మాకు లేదు

## మరోమారు తెగేసి చెప్పిన ట్రంప్

వాషింగ్టన్,జూలై15ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ విషయంలో చైనా మీద ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరోసారి తన కోపాన్ని ప్రదర్శించారు. చైనాతో మాట్లాడే ఆలోచన తనకు లేదన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. 'లేదు.. నేను అతనితో(జిన్‌పింగ్) మాట్లాడను. వారితో మాట్లాడే ఆలోచన కూడా నాకు లేదు. కరోనా వైరస్‌ను కట్టడి చేయడంలో వారు విఫలమయ్యారు. చైనాతో గొప్ప వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. జనవరిలోనే ఫేస్1 అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా అయ్యాయి. సిరా ఇంకా ఆరకముందే వారు మమ్మల్ని కరోనా వైరస్‌తో దెబ్బ తీయాలని చూశారు. అందుకే మరో తప్పు చేయకూడదు అనుకుంటున్నాను. వారు వైరస్ గురించి దాచి పెట్టారు.. ప్రపంచం మీదకు వదిలారు. కరోనా వల్ల ప్రపంచానికి కలిగిన నష్టానికి చైనానే బాధ్యత వహించాలి' అన్నారు. అంతేకాక ప్రపంచ ఆరోగ్య సంస్థ మీద కూడా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్ల్యూహెచ్ఓ చైనా తోలుబొమ్మ అన్నారు. అంతేకాక 'మా ప్రభుత్వం చాలా ముందుగానే చైనా, యూరోప్ నుంచి ప్రయాణాలను బ్యాన్ చేసి చాలా మంచి నిర్ణయం తీసుకుంది. ఇలా చేసి మేం చాలామంది ప్రాణాలు కాపాడం. ప్రజలంతా ఒక విషయం గమనించాలి.. చైనాపై పోరాడటానికి, కరోనా నుంచి ప్రజలను కాపాడటానికి మేం సమాఖ్య ప్రభుత్వ పూర్తి శక్తిని ఉపయోగిస్తున్నాం' అన్నారు. అతి త్వరలోనే కరోనా వైరస్‌కు వ్యాక్సిన్‌ను కూడా తీసుకొస్తామని ట్రంప్ తెలిపారు. అదే విధంగా డెమొక్రటిక్ అభ్యర్థి జో బిడెన్‌పై కూడా ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చైనా మన ప్రత్యర్థి అనే ఆలోచన వింతైనదని ఆయన అన్నారు. అతను చైనా అసలు ప్రాబ్లమ్ కాదు అన్నారు. గత 25, 30 ఏళ్ల నుంచి చైనా ఇబ్బంది పెట్టినంతగా ఎవరు మనల్ని ఇబ్బంది పెట్టలేదు. చైనా పట్ల కఠినంగా ఉండాల్సిన సమయంలో ఆయన దానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడటం లేదని ఆరోపించారు.

# ఒత్తిడికి తలొగ్గిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## ఆన్‌లైన్ తరగతులపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

## వీసాల రద్దు ప్రతిపాదనను వెనక్ఇక తీసుకుంటున్నట్లు ప్రకటన

వాషింగ్టన్,జూలై15ఆర్ఎన్ఎ): కరోనావైరస్ కారణంగా ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే విదేశీ విద్యార్థులు దేశం విడిచి వెళ్లాలనే వివాదాస్పద నిర్ణయాన్ని అమెరికా ప్రభుత్వం రద్దు చేసింది. యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) జూలై 6న ప్రకటించిన ఈ విధానానికి వ్యతిరేకంగా హార్వర్డ్ ,ఎంఐటి తదితర విశ్వవిద్యాలయాలు అనేక ఇతర సంస్థల సహకారంతో కోర్టుకు వెళ్లాయి. ఈ కేసును పరిశీలించిన ఫెడరల్ న్యాయమూర్తి అల్లిసన్ బురోస్.. అమెరికా ప్రభుత్వం తన నిర్ణయాన్ని రద్దు చేయడానికి అంగీకరించిందని తెలిపారు. ఐసీఈ ఉత్తర్వుల ప్రకారం.. ఎవరైతే విద్యార్థులు తమ తరగతులకు ఆన్‌లైన్‌లో మాత్రమే హాజరవుతున్నారో వారందరూ తమ వీసాలను క్యాన్సిల్ చేసుకొని దేశం విడిచి వెళ్లాలని తెలిపింది. ఇది కుదరకపోతే.. వ్యక్తిగతంగా పాఠాలు బోధించే కళాశాలకు మారాలని ఐసీఈ తెలిపింది. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ హార్వర్డ్, ఎంఐటి కోర్టును ఆశ్రయించాయి. ఈ ఉత్తర్వుల వల్ల విద్యార్థులకు వ్యక్తిగతంగా,ఆర్థికంగా కూడా భారీ నష్టాన్ని కలిగిస్తాయని విశ్వవిద్యాలయాలు తమ దావాలో పేర్కొన్నాయి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ప్రకారం.. 2018-19 విద్యా సంవత్సరానికి గాను యూఎస్ లో పదిలక్షలకు పైగా విదేశీ విద్యార్థులు ఉన్నారు. అమెరికా తన నిర్ణయాన్ని వెనకకు తీసుకోవడం పలు దేశాలలోని విద్యార్థులకు శుభపరిణామంగా చెప్పుకోవచ్చు. కరోనా మహమ్మారి వల్ల కళాశాలలు తెరవడానికి భయపడుతున్న విద్యాసంస్థలపై ఒత్తిడి తెచ్చేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌజ్ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలి వివాదాస్పద నిర్ణయంపై వెనక్కి తగ్గారు. ఆన్‌లైన్ క్లాస్‌లకు హాజరవుతున్న విదేశీ విద్యార్థులకు షాక్ ఇస్తూ గత నెలలో తీసుకొచ్చిన ఆర్డర్లను తాజాగా రద్దు చేశారు. . 2020-21 విద్యా సంవత్సరానికి గాను పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యే వారికి వీసాలు జారీ చేయబోమని ప్రకటించి పెద్ద దుమారాన్ని రేపింది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా ఎఫ్-1, ఎం-1పై ప్రస్తుతం అమెరికాలో ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్న వారు కూడా దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని ఐసీఈ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై అటు ప్రతిపక్షం, ఇటు అమెరికాలోని పలు యూనివర్శిటీలు విద్యార్థులు, టెక్ దిగ్గజాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. వీటిని సవాలు చేస్తూ పలు వ్యాజ్యాలు కూడా దాఖలు చేశాయి. ఈ ఒత్తిడి నేపథ్యంలో ట్రంప్ సర్కారు దిగి రాక తప్పలేదు.

నేటి నిజాలు




# గ్రేటర్‌లో అధికార పార్టీలో పోటాపోటీ

## కెటిఆర్ దృష్టిలో పడేలా కార్యక్రమాలు

## మాధవరం,గాంధీ మధ్య కోల్డ్ వార్‌పై పార్టీలో గుసగుసలు

హైదరాబాద్,జూలై15ఆర్ఎన్ఎ): నగరంలో గ్రేటర్ ఎన్నికలకు మరో ఏడాది ఉన్నా అప్పుడే రాజకీయాలు మొదలయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల మధ్యపోటీ నెలకొంది. దీనికితోడు మంత్రి కెటిఆర్ నిత్యం రాజధాని రాజకీయాలను నేరుగా పరిశీలిస్తున్నారు. ఎక్కడ ఏం జరిగిందో తెలుసు కుంటున్నారు. కరోనా కారణంగా ఆయన ప్రతి విషయాన్ని తెలుసుకుంటున్నారు. నేతల మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నా సమించేది లేదని హెచ్చరిస్తున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో ఇటీవల కరోనా కారణంగా ఇద్దరు ఎమ్మెల్యేలు పోటీపడి సహాయక కార్యక్రమాలు చేపట్టారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య ఆధిపత్య పోరు ఉందన్న విషయమై ఉత్కంఠగా చర్చించుకుంటారు. ఈ రెండు నియోజకవర్గాలు పక్కపక్కనే ఉంటాయి. ఇద్దరు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు వీరి మధ్య విభేదాలు ఇప్పుడు తారాస్థాయికి చేరాయని చర్చించుకుంటున్నారు. టీఆర్ఎస్‌లోకి రాకమునుపు ఇద్దరు నేతలు తెలుగుదేశం పార్టీలో ఉండేవారు. మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి మున్సిపాలిటీ వైస్‌చైర్మన్‌గా చేశారు. గాంధీ టీడీపీలో చురుకుగా ఉండేవారు. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య సంబంధాలు అంతంత మాత్రంగా ఉండేవట. 2014లో కృష్ణారావు కూకట్‌పల్లి, గాంధీ శేరిలింగంపల్లి నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా గెలిచారు. తర్వాత ఇద్దరూ గులాబీ కండువా కప్పేసుకున్నారు. 2018 ఎన్నికల్లో ఇద్దరూ టీఆర్ఎస్ టికెట్‌పై మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కరోనా సమయంలో తమ ప్రాంతాల్లోని ప్రజలకు తోచిన విధంగా పేదలకు సాయం చేశారు. రోజువారీ కూలీలకు ఆర్థిక సాయం అందించారు. భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆహార పొట్లాలు పంపిణీచేశారు. ఇళ్లకు వెళ్లి నిత్యావసరాలు ఇచ్చారు. హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీతోపాటు మరో డివిజన్‌లో సైతం మాధవరం కృష్ణారావు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. కృష్ణారావు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్నప్పటి నుంచీ ఈ డివిజన్‌లలో ఆయనకు కేడర్ ఉందని చెబుతారు. అందువల్లే ఆయా డివిజన్‌లలోనూ సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే అసలు తిరకాసు ఇక్కడే ఉంది. హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, మరో డివిజన్ శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. తన నియోజకవర్గంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఎలా సహాయ చర్యలు చేపడతారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారని అంటున్నారు. అసలే ఒకరంటే మరొకరికి పడని పరిస్థితి ఉండగా.. ఈ పరిణామాలు ఇద్దరి మధ్య గ్యాప్ మరింత పెంచాయని, పార్టీ వర్గాలు కూడా ఈ అంశంపై రకరకాల కామెంట్స్ చేస్తున్నాయి. అయితే ఈ వ్యవహారం మంత్రి కెటిఆర్‌కు చేరవేశారని తెలుస్తోంది.

# బొగ్గుగనుల ప్రైవేటీకరణను అంగీకరించం

## విద్యుత్ బిల్లును కూడా టిఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది

## రానున్న రోజుల్లో సింగరేణికి మహర్దశ

## ఢిల్లీలో అధికార ప్రతినిధి వేణుగోపాలచారి

ఆదిలాబాద్,జూలై15ఆర్ఎన్ఎ): రానున్న రోజుల్లో సింగరేణి సంస్థ ప్రపంపచంలోనే అత్యుత్తమ సంస్థగా రూపుదిద్దుకోబోతోందని కేంద్రమాజీ మంత్రి, ఢిల్లీలో అధికార ప్రతనిధి వేణుగోపాలచాని స్పష్టం చేశారు. అయితే బొగ్గుగునులను ప్రైవేటీకరించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల నస్టాలే ఎక్కువన్నారు. ఈ నిర్ణయాన్నిన టిఆర్ఎస్ వ్యతికిస్తుందని, దీనిపై పోరాడుతామని అన్నారు. సింగరేణి,విద్యుత్ బిల్లులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేదీ లేదన్నారు. ఇప్పటికే సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకుని వచ్చిన సిఎం కెసిఆర్ దానిని అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిదే ప్రణాళికలో ఉన్నారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాతనే సింగరేణిని సిఎం కెసిఆర్ ప్రత్యేకంగా దృష్టి పెట్టి ముందుకు సాగారని అన్నారు. ఇది కార్మికులకు బాగా తెలుసన్నారు. సింగరేణికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఇచ్చే

అంశం ప్రతిపాదనలో ఉందని తెలిపారు. సింగరేణి అభివృద్ధి కోసం నిరంతరం తపించే కేసీఆర్,... దానిని కూడా అమ్మేస్తారని ఇటీవల విపక్ష పార్టీలు చేసిన విమర్శల్లో అర్థం లేదన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఎవరు ఎన్ని విధాలుగా విమర్శలుచేసినా మళ్లీ కార్మికులకు అండగా నిలిచింది మాత్రం కెసిఆర్ అని అన్నారు. సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. గతంలో సీమాంధ్ర ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థ నిర్వీర్యమైందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో సింగరేణి సంస్థ అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందని వివరించారు. కార్మికులకు కారుణ్య నియామకాలు అమలు చేయించిన ఘనుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇన్‌కంటాక్స్‌ను రద్దు చేయాలని పేర్కొంటూ అసెంబ్లీలో తీర్మాణం చేయించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ఆ తీర్మాణాన్ని కేంద్రం పక్కన బెట్టిందని వివరించారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, వ్యవసాయానికి పంట పెట్టుబడి కింద రూ.10 వేలు, రైతులు ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందితే జీవిత బీమా ద్వారా రూ.5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా ఈ పథకాలు లేవన్నారు. ఈ పథకాలను చూసి ప్రపంచ దేశాలు గర్విస్తున్నాయన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ పరిశుద్ధమైన నీరు, మిషన్ కాకతీయతో చెరువుల అభివృద్ధి, ఆసరా పింఛన్లు ద్వారా వృద్ధులు, వితంతువులకు రూ.1000, వికలాంగులకు రూ.1500, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా పెళ్లి చేస్తుకున్న పేదింటి మహిళలకు సీఎం కేసీఆర్ గాడ్‌ఫాదర్‌లాగా రూ.1,00,116 అందిస్తున్నారని, ప్రభుత్వ దవాఖానల్లో మహిళలు ప్రసవం చేస్తే ఆడబిడ్డకు రూ.13 వేలు కేసీఆర్ కిట్, మగబిడ్డ పుడితే రూ.12 వేలు కేసీఆర్ కిట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మరెన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సింగరేణితో పాటు, విద్యుత బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కరోనాపై బిజెపి చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. వారు ఏదైనా సాయం చేయదల్చుకుంటే కేంద్రంతో చేయించాలని అన్నారు. కరోనాపై ఎలాంటి సాయం లేకుండా ప్రచారం చేసుకోవడం తగదని చారి అన్నారు.

# రాజస్థాన్ రాజకీయాలు ఊహించినవే !

హైదరాబాద్,జూలై15ఆర్ఎన్ఎ): భారత రాజకీయాల్లో విలువలకు ఎప్పుడో తిలోదకాలు ఇచ్చారు. అధికారమే పరమావధిగా ఎలాంటి నీచ రాజకీయాలైనా నడిచే దుస్థితి ఏర్పడింది. అధికారం కోసం నానాగడ్డీ కరవడం షరా మామూలయ్యింది. మంత్రి పదవుల కోసం బేరాలాడి మరీ చేరుతున్న ఘటనలు సర్వసాధారణమయ్యాయి. ప్రభుత్వాలను కూల్చడం అంతే సామాన్యమైన విసయంగా మారింది. ప్రజలు తము ఎన్నుకున్న నేతలు ఎటు వెళుతు న్నారో..ఎక్కడ ఉంటున్నారో నిలదీసే స్థితి లేదు. ఫిరాయింపులు అపహాస్యం కావడం... ఒకపార్టీపై గెలిచిన వారు మరో పార్టీలో చేరడం..మంత్రి పదవులు పొందడం..స్పీకర్లు నిర్ణయాలు తీసుకోక పోవడం...కోర్టులు ప్రేక్షకపాత్ర వహించడం.. రాజ్యంగం అపహాస్యం కావడం అన్న పదాలు మన ప్రజాస్వామ్యంలో నిత్యకృత్యం అయ్యాయి. రాజకీయాల్లో ఒకపార్టీ నుంచి మరో పార్టీలోకి ఫిరాయించడం సర్వసాధారణమైన విషయంగా మారింది. ఫిరాయింపులతో ప్రభుత్వాలను ప్రభావితం చేస్తున్నారు. మద్దతు ఇవ్వడం ...వెనక్కి తీసుకోవడం వంటి చర్యలతో ప్రభుత్వాను శాసిస్తున్నారు. రాజస్థాన్‌లో జరుగుతున్న తాజా పరిణామాలు గతంలోనూ అనేకం జరిగాయి. మొన్నీమధ్యనే మధ్యప్రదేశ్‌లో ఇలాంటి ఘటనే జరిగింది. అంతకుముందు కర్నాటకలోనూ ఇలాంటి నాటకమే నడిచింది. రాజస్తాన్ రాజకీయాలు ఇప్పుడు మనకు కొత్తేమీ కాదు. అందుకే ఆ వార్తలను ఎవరూ పతాకశీర్షికలో ఉండాలని కోరుకోవడం లేదు. అక్కడ జరుగుతున్న తతంగ మంతా ముం1దే ఊహించిందన్న ధోరణిలో ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అందుకే ఇక్కడ రాజకీయాల పట్ల ప్రజల్లో పెద్దగా ఆసక్తి కానరావడం లేదు. నిజానికి ఎన్నికల ఫలితాలు వచ్చాక సచిన్ పైలట్ సిఎం అవుతారని అంతా భావించారు. కానీ ఢిల్లీ వెల్లిన గెహ్లాట్ మళ్లీ సంచి సర్దుకుని జయపుర చేరుకుని సిఎం గద్దెపై కూర్చున్నారు. యువనాయకత్వాన్ని పక్కన పెట్టడంతో మధ్యప్రదేశ్‌లో చేతులు కాల్చుకున్న కాంగ్రెస్ ఇక్కడ తప్పుదిద్దుకునే ప్రయత్నం చేయకపోవడం స్వయంకృతం కాక మరోటి కాదు. సరికదా ..తిరుగుబాటు నేత సచిన్ పైలట్‌కు కాంగ్రెస్ అధిష్టానం షాక్ ఇచ్చింది. పైలట్‌ను రాజస్తాన్ ఉప ముఖ్య మంత్రి పదవి నుంచి, పీసీసీ చీఫ్ పదవి నుంచి తొలగించింది. పైలట్‌కు సన్నిహితులైన ఇద్దరు మంత్రులు విశ్వేంద్ర సింగ్, రమేశ్ మీనాలను కూడా మంత్రి పదవుల నుంచి తప్పించింది.సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ స్వయంగా పైలట్‌తో మాట్లాడి తిరుగుబాటు నిర్ణయాన్ని మార్చు కోవాలని కోరినా మార్పు రాలేదు. అయితే భారత రాజకీయాలను సునిశితంగా పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ దీనికి ప్రధాన దోషిగా గుర్తించాలి. కాంగ్రెసేతర పాలనలో ఉన్న ప్రభుత్వాలను కూల్చడం ద్వారా ఇతరులకు ఇప్పుడు మార్గం చూపింది. బిజెపి ఇప్పుడు అదే దారిలో కొంత తెలివిగా నడిపిస్తోంది. అయితే ఇందులో ఎవరు కూడా సచ్ఛీలురని చెప్పడానికి లేదు. అంతా ఒక తాను ముక్కలే. నీతులు వల్లిస్తున్న వారంతా ఒకప్పుడు ఇలాంటి తప్పిదాలను ప్రోత్సహించిన వారే. దీంతో రాజకీయ వాతావరణం కలుషితం అవుతోంది. ఈ కారణంగా మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ ప్రభుత్వం కుప్పకూలి..శివరాజ్ సింగ్ చౌహాన్‌లో నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడింది. నిజానికి ఎన్నికలయ్యాక కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో మార్పులు ఖాయమని అంతా ఊహించినదే. అక్కడ కాంగ్రెస్ అనుసరించిన విధానాలు కూడా పార్టీలో అసంతృప్తులకు కారణమయింది. అందుకే దేశంలో పార్టీలు ఫిరాయించడమన్నది ఒకప్పుడు నేరంగా పరిగణించేవారు. అలాంటి వారిని చులకనగా చూసేవారు. కానీ ఇప్పుడు అధికారమే పరమావధిగా పార్టీలు మారడం గెలిచిన వారికి వెన్నతోపెట్టిన విద్యాగా మారింది. ఎన్నికల కోలాహలంలో ఇది మరీ ఎక్కువగా కనిపిస్తుంది. ఆయా పార్టీల్లో టిక్కెట్లు దక్కని వారంతా సిద్ధాంతాల పేరుతో ఫిరాయి స్తున్నారు. రాజకీయ పార్టీల్లో విలువలు లేకపోవడం, రాజకీయ నేతలకు నిబద్ధత లేకపోవడం ఇందుకు నిదర్శనం. పదవులే ప్రాతిపదికగా ఫిరాయింపులు జరుగుతుంటాయి. వీరంతా ఆయా పార్టీల సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారన్న నమ్మకం లేదు. ఎప్పుడు ఏది అవసరమో అదే వారి సిద్ధాంతం. ఇకపోతే రాజకీయాల్లో అవసరాలే ముఖ్యం. అందుకే గతంలో ఏం మాట్లాడారన్నది ఇప్పుడు ముఖ్యం కాదు. అధికార పార్టీలోకి మారడం ..ఇప్పటి వరకు ఉన్న పార్టీని నిందించడం షరా మామూలు అయ్యింది. పార్టీలను చీల్చడం కొత్తగా గ్రూపుల కట్టడం..కొత్త ప్రభుత్వాలు ఏర్పడడం అన్నది మామూలు విషయంగా మారింది. రాజస్థాన్‌లోనూ అదే జరిగింది. అక్కడ వపిక్షంగా ఉన్న బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాచుకుని కూర్చుంది. సమయం కోసం వేచిచూస్తున్న తరుణంలో సచిన్ పైలట్‌ను ఎగేసింది. బీజేపీ కుట్రలో భాగంగా తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధి సూర్జేవాలా ఆరోపించారు. పైలట్ బీజేపీ చేతిలో పావుగా మారడం దురదృష్టకరమని ఆ తరువాత సీఎం గహ్లోత్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరసారాలు చేస్తున్నారని బీజేపీపై ఆరోపణలు గుప్పించారు. మధ్యప్రదేశ్ రాజకీయాల్ని రాజస్తాన్‌లో కూడా పునరావృతం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలు సఫలం కాబోవని వ్యాఖ్యానించారు. సచిన్ చేతుల్లో కూడా ఏమీ లేదు. ఆయన బీజేపీ చేతుల్లో పావులా మారారు. మొత్తం కథ నడిపిస్తోంది బీజేపీనే' అన్నారు. కరోనాతో దేశమంతా అల్లకల్లోలమవుతున్న తరుణంలో ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలను కూల్చే కుట్రలో బీజేపీ బిజీగా ఉందని విమర్శించారు. రాజస్తాన్ అధికార కాంగ్రెస్‌లో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఎమ్మెల్యేల మద్దతుకు సంబంధించిన నంబర్ గేమ్ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 200 మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు 107 మంది సభ్యులున్నారు. 72 మంది బీజేపీ ఎమ్మెల్యేలున్నారు. 13 మంది స్వతంత్ర సభ్యులున్నారు. ముగ్గురు ఆర్ఎల్‌పీ, ఇద్దరు సీపీఎం, ఇద్దరు బీటీపీ, ఒక ఆర్ఎల్‌డీ ఎమ్మెల్యే ఉన్నారు. మెజారిటీకి అవసరమైన సంఖ్య 101. ఈ సంక్షోభానికి ముందు ప్రభుత్వానికి మద్దతుగా ఉన్నవారు.. 122 మంది. అయితే సచిన్ పైలట్‌తో 30మంది ఉన్నారు. కనుక తప్పకుండా ప్రభుత్వం కూలిపోక తప్పదు. ఇలాంటి విపరీతాలు ఇకముందు జరక్కుండా పటిష్ట రాజ్యాంగ నిబంధనలు రావాల్సిన అవసరం ఉంది.

# గ్రీన్ ఛాలెంజ్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్,జూలై15(ఆర్ఎన్ఎ): దేవరకద్ర ఎమ్మెల్యే ఆల్ల వెంకటేశ్వర్ రెడ్డి గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. మంత్రి నిరంజన్‌రెడ్డి విసిరిన గ్రీన్ ఛాలెంజ్‌ను స్వీకరించిన ఎమ్మెల్యే భూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలోని ఎల్లమ్మగుట్ట వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపీ సంతోష్ కుమార్ శ్రీకారం చుట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో తనను భాగస్వామ్యం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం యావత్ దేశం మొత్తం ప్రాచుర్యం పొందిందన్నారు. నాటిన మొక్కలను వందకు వంద శాతం బ్రతికించుకోవాలన్నారు. ఎల్లమ్మగుట్ట దగ్గర 10 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ క్రమంలో భాగంగా ఈ రోజు 2 వేల మొక్కలను నాటడం జరిగిందన్నారు. వారం రోజుల్లో మొత్తం 10 వేల మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరో ముగ్గురికి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు. జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ ఆల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి, భూత్పూర్ ఎంపీపీ కదిరే శేఖర్ రెడ్డి కి గ్రీన్ ఛాలెంజ్‌ను విసిరారు.

# మహారాష్ట్రలో ఎడతెరిపిలేకుండా వర్షాలు

## ముంబైని ముంచెత్తుతున్న వరదలు



ముంబై,జూలై15ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో గత కొన్ని రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి. ఓ వైపు కరోనాతో పోరాడుతున్న సమయంలో భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. మహారాష్ట్ర రాజధాని ముంబైలోని చాలా ఏరియాల్లో రోడ్లపై భారీగా వరదనీరు నిలిచింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ముంబై వాసులు అత్యవసరం అయితే తప్ప బయటికి రావద్దని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు కోరారు. రోడ్లపై భారీగా నిలిచిన వరద నీటిని తొలగించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, వాహనదారులు ఎవరూ ముంపు ప్రాంతాలవైపు రావద్దని బీఎంసీ హెచ్చరించింది. కాగా, నగరంలోని కింగ్స్ సర్కిల్ ఏరియాలో భారీగా వరదనీరు నిలిచింది. దీంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు తవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో డు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురువనున్నట్లు భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) హెచ్చరించింది. కొంకణ్ తీరంతో పాటు ముంబై, థానేలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొంకణ్ తీరాన్ని తీవ్రమైన మేఘాలు కమ్ముకున్నట్లు తెలిపింది. ముంబై, థానేలో 200 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కానున్నట్లు పేర్కొంది. భారీ వర్ష సూచన నేపథ్యంలో భారత వాతావరణ కేంద్రం మహారాష్ట్రలోని ముంబై, థానే, రాయ్‌గడ్, పాల్ఘర్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే రెండు రోజులు ఈ ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముంబైలోని కొలాబా ప్రాంతంలో ఈ ఉదయం 25 మి.మీ వర్షం నమోదైంది. అదేవిధంగా పాల్ఘర్ లో సుమారు 124 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మొత్తం మహారాష్ట్రలో 6 మిమీ నుండి 184 మిమీ వర్షపాతం ప్రస్తుతానికి నమోదైంది. నిరంతర వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలైన హిందుమాత, సియోన్, గాంధీ మార్కెట్, దాదర్ టిటి, వడాలాలోని షక్కర్ పంచాయతీ చౌక్, ధారావిలోని పలు ప్రాంతాలు, వడాలా ÷ర్ స్టేషన్, పరేల్ లోని పలు ప్రాంతాలు, చెంబూర్, కుర్లా, అంధేరి సబ్వే వంటి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.